# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

మార్చి
2024

వెల: రూ.
25/-













# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 3

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: సాయినాథ్, రమేష్



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| శుభప్రదం – మహాశివరాత్రి పర్వదినం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దివ... | 9 |
| హరిహర స్వరూపం | 18 |
| మహత్తర శివమంత్రం | 20 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 22 |
| హోళీ పండుగ | 27 |
| రామాయణ రత్నాకరం | 28 |
| తులసీదాసు జీవితగాథ | 32 |
| భక్త కవి నత్కీరుడు | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 40 |
| శివరాత్రి | 44 |
| ముకుందమాల | 46 |
| ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు | 51 |
| మీ ప్రశ్న మా సమాధానం | 53 |
| భారతదేశంలో తొలి శివాలయం | 54 |
| నారద పూర్వజన్మ వృత్తాంతం | 57 |
| శ్రీకృష్ణ తత్త్వం | 58 |
| అమ్మ కథలు | 60 |
| అంబరీషుడు | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


సంపాదకీయం..

# భగవంతుడు ప్రసాదించిన అస్త్రాలు

భగవంతుడు అందరినీ సమానంగా చూస్తాడు. అందరికీ ఈ భూమిని, గాలిని, పండ్లు, ఫలాలు, ఆహారం, నీటిని ఒకేరకంగా వాడుకునేటట్లు అనుగ్రహించాడు. కాని ఇందులో కొందరే ఈ జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మిగిలిన వారు కూడా సమానమైన పరిస్థితులను కలిగి ఉన్నప్పటికీ వాటిని వ్యతిరేక దిశలో వాడుట వలన జీవితం వ్యర్థమవుతుందని తెలుస్తుంది. ప్రతి మనిషికి జీవితం పట్ల సరైన విచక్షణా జ్ఞానం అవసరం. మనము చూచే దృష్టి కోణము సదా భగవంతుని వైపు ఉండాలి. ఈ సమస్త చరాచర ప్రపంచములో భగవంతుడే నిండి ఉన్నాడని, ఆయన కృప వల్లనే మనకు ఈ జన్మ లభించి జీవిస్తున్నామని తెలుసుకోవాలి. మరియు సదా ఆయనను స్మరిస్తూ శరణాగతుడై జీవించువాడు ధన్యుడు. ఇలాకాక అహంకారముతో విర్రవీగువారు మొదట్లో సంతోషం కలిగినప్పటికీ జీవితంలో ఓడిపోక తప్పదు. ఆధ్యాత్మికములో భావమే ప్రధానము. దేవుని రూపముగా చెక్కిన రాయిని, అది రాయి కాదు దేవుడని భావించువాడు సమర్థుడు. కాని అది రాయి మాత్రమే అని భావించువాడు మూర్ఖుడు. ఇదే ఇద్దరికీ తేడా. భగవంతుడు సమస్త విశ్వములో అణువణువు విస్తరించి ఉన్నాడని భావించాలి. మన జీవితంలో ఎదురగు ప్రతి సంఘటన భగవంతుని కల్పితంగా భావించాలి. అది ఎంతటి దుఃఖకర సంఘటన అయినప్పటికీ మన మంచి గురించి భగవంతుడు ఏర్పాటు చేసిన ప్రత్యేక సంఘటనగా భావించి స్వీకరించాలి. భగవంతుని దగ్గరకు చేరుటకు వారు మనకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దారిగా దానిని స్వీకరించాలి. ఆ దారి సుఖదాయకమైనా, దుఃఖదాయకమైనా ఒకేవిధంగా స్వీకరించువాడు ధన్యుడు. భగవంతునిపై మనము చూపే ప్రేమనే భక్తి. ఇది నిరంతరం సాగిపోయే ప్రవాహంలా ఉండాలి. ఒక దినమునకు రాత్రింబవళ్ళు ఉన్నట్లు మన జీవితములో ఆటుపోట్లు సహజము. నిజానికి భగవంతుని కృప లభించాలంటే కష్టకాలమే సరియైనది. కష్టంలో స్మరించినంత సుఖంలో స్మరించము. మరియు కష్టంలో మన దృష్టి అన్య విషయాలపై ప్రసరించక నేరుగా భగవంతుని పాదపద్మాలపై కేంద్రీకృతమై ఉంటుంది. 'కష్టాలు' భగవంతుని కృపను పొందుటకు భగవంతుడు ప్రసాదించిన అస్త్రాలు. వీటిని మరిన్ని ఎక్కువ కోరుకుని వాటిని ప్రయోగిస్తే భగవంతుని కృప తప్పక లభిస్తుంది. పూర్వము మహారాణి కుంతీదేవి కష్టాలను కావాలని కోరిందని చెప్తారు. ఆ కష్టాల్లో వారు ఆర్తిగా స్మరించుట వలన శ్రీకృష్ణుడు మళ్ళీ మళ్ళీ వారికి దర్శనమిచ్చి తగిన సూచనలు ఇచ్చేవాడట. అందుకే ఆమె కావాలని కష్టాలు కోరిందని అంటారు. కష్టమైనా, సుఖమైనా భగవంతుని స్మరణ నిరంతరం కొనసాగించువారు ధన్యులు. భగవంతుడు కేవలం భక్తికి మాత్రమే వశుడు. మనలోని భక్తి యొక్క శక్తే మనము నేర్చిన విద్యగా భావించాలి. భగవంతుని పొందుటకు నవవిధ భక్తిమార్గాలు ఉన్నాయి. అందులో మనకు నచ్చిన, మనము యోగ్యులమనుకున్న ఏ ఒక్క మార్గమును అనుసరించినా సరిపోతుంది. భగవంతుని కృపకు పాత్రులు కావాలంటే సర్వప్రాణి యందు భూతదయ కలిగి ఉండుట, అత్యంత సాధారణ జీవితము గడుపుట, సంతృప్తితో జీవించుట అత్యవసరము. కుటుంబ, లౌకిక విషయ వాసనలను వీలైనంతవరకు త్యజించువారు ధన్యులు. మన ముందూ వెనకా కేవలం భగవంతుడే ఉన్నాడు తప్ప అన్యులు కారు. సద్గ్రంథ పఠనము వలన పెద్దల ప్రవచనములను మన జీవితానికి అన్వయించుకొని, అనుభవ పూర్వకముగా విషయములను గ్రహించువాడు విద్యావంతుడు, పండితుడు. మన ప్రతి పనికి కర్త, కర్మ, క్రియ కేవలం భగవంతుడినే చేయువాడు ధన్యుడు.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం\|\| | 500-00 |
| ☐ 4 సం\|\| | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో ॥ శ్రీస్వామిపుష్కరిణికాఽఽప్లవ నిర్మలాంగాః
శ్రేయోఽర్థినో హర విరించి సనందనాద్యాః
ద్వారే వసంతి వరవేత్ర హతోత్తమాంగాః
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్

తాత్పర్యం – వేంకటపతీ! బ్రహ్మ, శివుడు మొదలగు దేవతలు, సనక, సనందనాది యోగులు స్వామి పుష్కరిణిలో స్నానము చేసి, పవిత్రులై నీ వాకిట ఉన్న శ్రేష్ఠమైన బెత్తముతో కొట్టించుకున్న తలలు గలవారై నీ దర్శనమునకై వేచి ఉన్నారు. స్వామీ నీకు సుప్రభాతమగు గాక!

శ్లో ॥ శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి
నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్ ।
ఆఖ్యాం త్వదీయ వసతే రనిశం వదంతి
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్

శ్రీవేంకటేశ్వరా! భక్తులు నీ నివాస స్థానమగు పర్వతమును శ్రీశైలమని, శేషశైలమని, గరుడాచలమని, వేంకటాద్రియని, నారాయణాద్రియని, వృషభాద్రియని, వృషాద్రియని ఏడు పేర్లతో పిలుచుచున్నారు. స్వామీ! నీకు శుభోదయమగు గాక!

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము



## గుజ్జరి

అప్పులేని సంసార – మైనపాటే చాలు
తప్పులేని జీత మొక్క – తారమైనఁ జాలు ||పల్లవి||

1. కంతలేని గుడిసొక్క – గంపంతయినఁ జాలు
చింతలేని యంబలొక్క – చేరెఁడే చాలు,
జంతగాని తరుణియే – జాతైన నదే చాలు
వింతలేని సంపదొక్క – వీసమే చాలు ||అప్ప||

2. తిట్టులేని బ్రదుకొక్క – దినమైన నది చాలు
ముట్టులేని కూడొక్క – ముద్దెఁడే చాలు,
గుట్టుచెడి మనుకంటె – కొంచెపు మేలైనఁ జాలు
వట్టి జాలిఁబడుకంటె – వచ్చినంతే చాలు ||అప్ప||

3. లంపటపడని మేలు – లవలేశమే చాలు
రొంపికంబమౌకంటె – రోయుటే చాలు,
రంపపుఁ గోరికకంటె – రతి వేంకటపతి
పంపున నాతనిఁజేరే – భవమే చాలు ||అప్ప||





భావము : అప్పు చేసి ఆటోపముగా సంసారము జరుపుటకంటె అప్పులేని కాపురము జరిగినంతవరకే చాలును. అదే సుఖప్రదము. అట్లే తప్పు త్రోవలో ఆర్జించిన అధిక ధనము కంటె తప్పులేని జీతము నాలుగు కాసులైనను చాలును.

ఎండవానల వలని బాధ తప్పని పెద్ద గృహము కంటె చక్కగా కప్పబడిన యిల్లు చిన్నదైనను మేలు. నానా చింతలకు లోనై తిను పంచభక్ష్య పరమాన్నముల కంటె చీకు చింత లేని యంబలి చేరెడైనను సుఖకరమే. ధూర్తురాలైన కులస్త్రీ కంటే గుణవతి యైన వనిత తక్కువ జాతిదైనను మేలు. "స్త్రీరత్నం దుష్కులాదపి'' అని పెద్దల వచనము. అన్యాయముగా క్షణములో ఆర్జింపబడి పదిమందికి వింతగొల్పు దొడ్డ సంపద కంటె న్యాయార్జితమైన విత్తము మిక్కిలి కొద్దిదైనను చాలు.

ఇతరుల దూషణకు లోనై శత సంవత్సరములు జీవించుట కంటె ఎట్టి దూషణ లేక ఒక్క దినము జీవించినను మేలే. అపరిశుద్ధమైన అన్నము కడుపునిండ తినుట కంటె పరిశుద్ధమైన అన్నమొక కబళమైనను సుఖావహము. పెద్ద పెద్ద ఆశలతో ప్రాకులాడి పదిమందిలో గుట్టు చెడి బ్రతుకుటకంటె ఏ కొంచెపు మేలుగలిగినను దానితో తృప్తి నొందుట మేలు. లేనిపోని ప్రయాసలకు గురియై జాలిబడుటకంటె వచ్చినదానితో తనివి పొందుట మేలు. పలు తగులములకు గురియై బాధపడుటకంటె ఏ లంపటము లేక వచ్చు మేలుకొద్ది పాటిదైనను చాలును. బురదలోని స్తంభమువలె నిలకడలేని జీవితముకంటె ఐహిక సుఖములపై రోతపడి నిశ్చలముగా నుండుట మేలు. రంపము వలె బాధావహమైన కోరికలకు లోనగుటకంటె 'మామేక శరణం వ్రజ' అను భగవదాదేశము ననుసరించి ఆ దేవుని సన్నిధి జేరుటకు ప్రయత్నించు మానవుని పుట్టుకే శ్రేష్ఠమైనది.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# శుభప్రదం - మహాశివరాత్రి పర్వదినం

చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ "శాంతం పద్మాసన స్థితం శశిధర మకుటం పంచవక్త్రం త్రినేత్రమ్
శూలం వజ్రంచ ఖడ్గం పరమభయదం దక్షభాగే వహంతమ్
నాగం పాశంచ ఘంటాం ప్రళయహుత వహం సాంకుశం వామభాగే
నానాలంకారయుక్తం స్ఫటికమణినిభం పార్వతీశం నమామి"

'మఖ' నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసాన్ని మాఘమాసమని అంటారు. 'అఘం' అనగా పాపం అని అర్థము. పాపం లేకుండా చేసే నెల కనుక మాఘమాసమని అంటారు శ్రీలక్ష్మీనారాయణులకు, ఉమామహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైన మాసం. ఈ మాసంలో యజ్ఞయాగాది క్రతువులు విశేషంగా జరుపబడతాయి. ఆధ్యాత్మిక కోణంలో పరిశీలిస్తే జన్మ జన్మల పాపాలను తొలగించుకునేందుకు భగవంతుడు మానవునికిచ్చిన అద్భుతవరం మాఘమాసం.

సృష్టి స్థితి లయ కారులైన త్రిమూర్తులలో లయకారుడికి అత్యంత ఇష్టమైన ఈ మాసమందు స్నాన, దాన జపాదులు, అర్చన ద్వారా పవిత్ర జీవితము గడిపి, జీవితమును సార్థకము చేసుకోవాలి. వేదాలలో యజుర్వేదం మేలుబంతి. దానిలోని నాలుగో కాండలో రుద్రం ఉంది. ఆ రుద్రం మధ్యలో నాలుగో ప్రశ్నలో ఉన్న పంచాక్షరీ మంత్రరాజం "విద్యాను శ్రుతి రుత్కృష్టా రుద్రైకాదశి నశ్రుతే తత్ర పంచాక్షరీ తస్యాం శివ ఇత్యాక్షర ద్వయమ్".

పంచాక్షరీ మంత్రంలోని అయిదు అక్షరాలలోని రెండు అక్షరాలు మహోత్కృష్టమైనవి. అవే 'శివ' అనే అక్షరాలు. అక్షర ద్వయాన్ని జీవరత్నమంటారు. 'శివ' అంటే మంగళం. "శ్వశ్రేయ సంశివం భాద్రం కళ్యాణం మంగళం శుభం" అని అమరకోశం వ్యాఖ్యానిస్తోంది. పాపాలన్నింటినీ ఒక్క క్షణంలో పోగొట్టగలిగే వేదాలకు జీవరత్నం. దేహానికి ప్రాణమూ, దేవాలయానికి మహాలింగం వలె వెలుగుతున్న శివ అనే రెండక్షరాలు పాపాన్ని పటాపంచలు చేసే పరమౌషధం.

అవ్యక్త స్వరూపుడైన పరబ్రహ్మం మొదటి నిర్గుణుడు. లోక శ్రేయస్సు కోసం భక్తులను అనుగ్రహించడం కోసం శివుడు

లింగరూపం ధరించాడు.

**"లీయతే గమ్యతే యత్రయేన సర్వం చరాచరమ్, తదే తల్లింగ మిత్యుక్తం లింగ తత్త్వ విశారదైః"**

అన్నాడు వ్యాసుడు. ఎందులోంచి అన్ని వస్తువులు పుడుతున్నాయో, అలాగే దేనిలోనికి అన్ని వస్తువులు లయమౌతున్నాయో అదే లింగం. సృష్టికి ప్రతీక. సృష్టిలోని శక్తికి ప్రతీక లింగమే. 'లిం' అంటే మన కంటికి కనిపించకుండా లీనమై యున్నదానిని, 'గం' అనగా గుర్తుగా కనిపించేది అని 'లింగం' శబ్దానికి అర్థం. మరోమాటలో చెప్పాలంటే కనిపించని శివునికి, కనిపించే గుర్తు లింగం. సాంఖ్యదర్శనం ప్రకారం ప్రకృతి, వికృతులు రెండూ లింగమే. ''లయ నాల్లింగ ముచ్యతే'' ప్రళయాగ్నిలో సర్వమూ భస్మమై శివలింగంలో చేరుతుంది. లింగానికి పూజ చేస్తే సర్వదేవతలకూ పూజ చేసినట్లేనని లింగపురాణం చెబుతోంది. శివలింగం బిందు నాదాత్మకమైంది. పరమేశ్వరుని అవ్యక్తమైన స్వరూపమే శివలింగం. నాశరహితం, తేజోవంతమైన ఆత్మజ్యోతికి ప్రతీక. బిందువు శక్తి. నాదం శివుడు లెక్కన శివలింగం బిందు నాదాత్మకం.

హిందువుల పండుగలలో మహాశిరాత్రి ప్రశస్తమైనది. 'శివ' అంటే శ్రేయస్సు, మంగళం, భద్రం, కళ్యాణం అనే అర్థాలున్నాయి. పరమసత్యం, జ్ఞానం, చైతన్యం మూర్తీభవించిన పరిపూర్ణ గుణధాముడు శివుడు. రసజ్ఞత శివస్వరూపం. సహిష్ణుత శివతత్త్వం. జీవం ఉన్న ప్రతి వస్తువులోను శివతత్త్వం ఉంది. ఈ విశ్వమంతా నిండి వున్న మహాశక్తినే శివ అంటున్నాము. విశ్వంలోని ప్రతి అణువులోనూ శివుడు ఉన్నాడు. ప్రపంచమంతా పరమేశ్వరమయం. కానీ ఆయన ప్రపంచానికి అతీతుడు. పరమేశ్వరుని రూపం గురించి చెప్పాలంటే ఆయన మేలిమి బంగారం వంటివాడు. బంగారం మన ఇష్టాన్ని బట్టి వివిధ ఆకృతులుగా కనిపించి మురిపిస్తుంది. పరమేశ్వరుడు కూడా అంతే. ఆయన ముద్దబంగారం వంటివాడు కూడా. మనమే మనకు కావాల్సిన రూపంలో ఆ స్వామిని మలచుకొని వివిధ నామాలతో, వివిధ ఆకృతులలో కొలుచుకుంటున్నాము. నిజానికి ఆయనకంటూ ఒక రూపం లేదు. ఆయన దిగంబరుడు. దిక్+అంబరుడు. దిక్కులే అంబరములు (వలువలు)గా కలిగినవాడు. ఆయన నిర్గుణుడు. విశ్వేశ్వరుడు. విశ్వమంతా నిండియుంటాడు. రూపము, గుణములు లేనివాడు అంటే నిరుత్సాహము చెందుతాము. అందుకే రూపము ఉండి కూడా లేనివాడయ్యాడు.

శివుడు మోక్షప్రదాత. పరమకళ్యాణం సమకూర్చు మహా నిర్ణేత. భక్తసులభుడు కావడం చేత సాధకుల ఆరాధన నిమిత్తం లింగరూపం. మాఘమాస బహుళ చతుర్దశినాడు దివ్య (నిశీధి) రాత్రిలో ఆవిర్భవించాడు. కనుక మహాశివరాత్రి పుణ్యదినం, పవిత్రదినం. ప్రతినెల బహుళ చతుర్దశి నాడు శివరాత్రి ఏర్పడినా, లింగోద్భవం మాఘ బహుళ చతుర్దశినాడు జరిగింది కాబట్టి ఆ దినం మహాశిరాత్రి అంటారు. ఇలా పన్నెండు మాసాల మాస శివరాత్రుల సమాహారం లోకాన్ని రక్షిస్తోంది.

శివునికి, శివానికీ ప్రీతిపాత్రమైన రాత్రి శివరాత్రి. వారిద్దరి సంకేతమే పానవట్టంలో పరిఢవిల్లే లింగాకృతి. శివరాత్రి అంటే జాగారం, ఉపవాసం, శివనామస్మరణ, ఇహపర సుఖాలను పొందడానికి శివారాధనను మించింది లేదు. పురుషార్థ, పరమార్థ సాధనకూ మార్గదర్శి శివుడే. శివారాధనలో లింగపూజకే ప్రాధాన్యం. భిన్నప్రకృతులు ఏకకాలంలో ఆవిష్కరించబడిన మహోన్నత స్వరూపం. ఆ పాతాళ నభో పర్యంతం నిండిపోయిన శుద్ధ స్ఫటిక సంకాశం. లింగమూర్తి రూపం గుండ్రనిది. బ్రహ్మాండాలను సైతం అధిగమించినది. శివుడు కానిది అంటూ సృష్టిలో ఏమీ లేదు. ఆయన అంతటా నిండి యున్నాడు. పంచాననుడు – పంచ+ఆననము = పరమశివుని అయిదు శిరస్సులు ఒక్కొక్క కల్పానికి చెందినది. బ్రహ్మ పరమేశ్వర ధ్యానంలో ఉండగా ఆయన శరీరము గురించి శివుడు ఉద్భవించి సృష్టి చేసే సమర్థతను, జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆ రూపమే 'సద్యోజాతరూపం' రక్తవర్ణంతో, ఎర్రని వస్త్ర విభూషణాలతో 'వామదేవుడి'గా పరమేశ్వరుడు అవతరించాడు. పీతవాస కల్పంలో పీతవర్ణుడై, పీతవస్త్ర ధారియై తేజోరూపిగా తత్పురుష రూపంలో నామంతో శంభుడు ఆవిర్భవించాడు. శివకల్పంలో నల్లని వర్ణంలో 'అఘోరనామం' ధరించాడు. విశ్వరూపం అనే కల్పంతో శుద్ధ స్ఫటికంగా ప్రకాశిస్తూ ఈశానరూపంలో, నామంలో ఆవిర్భవించాడు. ఈవిధంగా అయిదు వదనాలతో అయిదు అవతారాలు దాల్చాడు. భూలోకంలో స్వయంభూలింగం, బిందులింగం, ప్రతిష్ఠితలింగం, చరలింగం, గురులింగాలనే అయిదు రకాల లింగాలున్నాయి. అయితే పార్థివ లింగపూజకు సరితూగే పూజ కలియుగంలో మరేదీ లేదు. రోజుకోసారి పార్థివ లింగాన్ని అభిషేకిస్తే చాలు మరొక జన్మ ఉండదని పురాణాల కథనం.

శివుడు అభిషేకప్రియుడు. భోళాశంకరుడు. ''నీలకంఠుని శిరసుపై నీళ్ళు చల్లి పత్తిరిసుమంత యెవ్వడు పారవైచు కామధేనువు వానింట కాడి పరమల్ల సురశాఖి వానింట మల్లెచెట్టు''. శివలింగంపై నీళ్ళతో అభిషేకం చేసి పూలు, పత్రి (మారేడు దళాలను) శిరస్సుపై ఉంచి, నమస్కరించేవానింట కామధేనువు కాడిపశువుగా పడి వుంటుంది. కల్పవృక్షం మల్లెచెట్టులా ఉంటుంది అన్నారు పెద్దలు. అభిషేకం అనేది షోడశోపచారాలలో ఒకటి. ''ఆయాంతు ఈశ్వర స్నానార్థం నదీజలం ఆవాహయామి'' అంటూ పవిత్ర నదీ జలాలను పెద్ద కలశపాత్రలో మంత్రశక్తిచేత ఆవాహన చేస్తారు. ఆ నీటిలోనే అభిషేకం చేస్తారు. పంచామృతాది పదార్థాలకు మధ్య ప్రతిసారీ శుద్ధజలంతో అభిషేకం చేస్తారు. ఇలా ఒక వరుసలో రుద్ర

నమక చమక మంత్రాలతో అభిషేకం చేస్తారు. దానిని ఆయన స్నానంగా స్వీకరిస్తాడు. రుద్రాభిషేక దర్శనం చేయడం వల్ల అలక్ష్మి నివారణమవుతుంది. లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.

శివలింగంపై కాసిని నీళ్ళు పోస్తే సంతోషించి సర్వైశ్వర్యాలను ప్రసాదించే భోళాశంకరుడు శివుడు. ''పూజయా అభిషేకో హోమో మాత్తర్పణ ముత్తమం తర్పణాశ్చ జపః శ్రేష్టోః అభిషేకః పరోజపాత్''. పూజకంటే హోమం, హోమం కంటె తర్పణం, తర్పణం కంటే జపం, జపం కంటే అభిషేకం ఉత్తరోత్తరా శ్రేష్ఠాలని పెద్దలు చెబుతారు. అంటే ఒక దానికన్నా మరొకటి శ్రేష్ఠమని అర్థం. ''అప ఏవ ససర్జాదే'' అన్న ప్రమాణాన్ని బట్టి బ్రహ్మ మొదట జలాన్ని సృష్టించాడు. ప్రాణులన్నింటికీ నీరే ఆధారం. మంత్రపుష్పంలోని ''యోపా మాయతనం వేద'' తదితర మంత్రాలు నీటి ప్రాముఖ్యాన్ని చెబుతున్నాయి.

శివునికి పంచామృతాలతో చేసే అభిషేకం విశేష ఫలదాయకం. ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి, తేనె, నీరు కలిపితే పంచామృతం. పంచామృతాభిషేకం శివునికి ప్రీతికరం. ఆయన పశుపతి. పంచభూతాలకు అధిపతి. ధారగా పంచామృతాభిషేకం జీవాత్మ పరమాత్మలను అనుసంధానం చేసే కార్యం. అభిషేకం చేసుకున్నవారి కర్మలు నశించి సుఖాలను పొందగలరు.

శివునికి పంచామృతాలతో పాటు భస్మం కూడా అభిషేకం చేస్తారు. భస్మం జ్ఞానానికి సంకేతం. శివుడే యజ్ఞస్వరూపుడని వేదాలు పేర్కొన్నాయి. వైష్ణవులైనా, శైవులైనా భస్మధారణను విధిగా చేయాలి. ఎందువలననగా ''శివస్య హృదయం విష్ణుః''. శివకేశవులిద్దరూ ఒకటే. వీరు బాహ్యానికి వేరు వేరు కావచ్చు. శివుని హృదయంలో విష్ణువు కొలువై యుంటాడు. మృత్యుంజయ మహామంత్రం జపిస్తూ భస్మధారణను చేయాలి.

**"ఈశ్యాతే తత్పురుష నమో ఘోరాయతే సదా**
**వాసుదేవ నమస్తుభ్యం సద్యో జాతాయవై నమః**
**శ్రీ శివాయ నమః"**

అనే మంత్రముతో కూడా భస్మాన్ని ధరించవచ్చు. వేదం నుంచి స్వీకరించిన సంప్రదాయం భస్మధారణ. త్రిపుండ్రాల్లో పైన మధ్యవేలితో, కిందిది అనామికతో ఎడమనుంచి కుడికి పెట్టుకోవాలి. మధ్యరేఖ బొటనవేలితో కుడినుంచి ఎడమకు పెట్టుకోవాలి. శివుడు ఇచ్చే ఐశ్వర్యమే భస్మం. అదే జ్ఞానదాయకం. జ్ఞానదాయకమైన భస్మంతో శివునికి అభిషేకించిన ప్రీతి చెంది తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. శివలోకం పొందడానికి, లోక కళ్యాణానికి కూడా భస్మాభిషేకం చేస్తారు.

మహాశివరాత్రి పర్వదినం నాడు నిశిపూజ పరమ శ్రేష్ఠంగా భావింపబడుతోంది. ఆ పుణ్యదినాన పగలంతా ఉపవాసముండి రాత్రివేళ జాగరణ చేసి పరమశివుణ్ణి అర్ధరాత్రి వేళ లింగోద్భవ కాలంలో అర్చించాలని సంప్రదాయం చెబుతోంది. రాత్రివేళ



నాలుగు ఝాములలోను శివపూజలు చేయడం పరిపాటి. ప్రకృతిలో లభించే పవిత్ర నదీజలాలు, పత్రాలు, పుష్పాలు, ఫలాలు మొదలైన వాటితో పూజించి, అర్చించిన సంప్రీతుడవుతాడు.

మహాశివరాత్రి పర్వదినాన జాగరణతో పాటు ఉపవాస దీక్ష చేయడం పరిపాటి. పండుగ పర్వదినాలలో తిండికి, నిద్రకు దూరంగా ఉండటం వల్ల ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించవచ్చని భావిస్తారు. 'ఉప' అనగా సమీపమని, 'వాసము' అనగా నివసించడం అని అర్థము. శివునికి సమీపంలో ఉండి శివుని భజిస్తూ, స్తుతిస్తూ నివసించడం అని అర్థం. నాలుగు ఝాములలోనూ జరుగుతున్న అభిషేకాన్ని వీక్షిస్తూ తన్మయత్వం చెందడమును ఉపవాసమంటారు. అభిషేక సమయాన యజుర్వేదాంతర్గతమైన రుద్రాభిషేకంలో పంచాక్షరీ మహామంత్రాన్ని జపిస్తూ ఘంటానాదాల మధ్య 'నమశ్శివాయచ శివతరాయచ' అనే మంత్రాన్ని అర్చకులు సుస్వరంగా చదువుతూ ధారగా అభిషేకం చేస్తుంటే చూడటం మానవ జన్మకు ధన్యతను కలిగింప చేస్తుంది.

'ధ్యాయేత్ ఈప్సిత సిద్ధయే' శివనామం మనస్సులో ధ్యానం చేయాలి. ధ్యానం చేస్తే ఆయన అనుగ్రహిస్తాడు. మంత్రాన్ని స్వరంతో రమించి చదువుకున్నా, జపం చేసినా అభిషేకం చేసిన ఫలితమే సిద్ధిస్తుంది. రుద్రమంత్రాలతో అభిషేకం చేస్తుంటే లక్షరెట్ల శక్తి విస్ఫోటనం చెంది ఆ శక్తి ప్రసారాలు అభిషేకంలో పాల్గొన్న వారందరికీ చేరుతాయి. ధారపాత్ర నుంచి అమృత బిందువులు బొట్టు బొట్టుగా పడుతుండగా శివదర్శనం చేసి జాగరణ, ఉపవాస పరమార్థాన్ని అవగతం చేసుకున్నా జన్మ తరించి ధన్యత నొందుతుంది.

మహిమాన్వితమైన శివరాత్రి పర్వదినాన పరమేశ్వరుని ఆరాధించి, 'ప్రభుం ప్రాణనాథం – విభుం విశ్వనాథం జగన్నాథ నాథం సదానంద భాజం' అంటూ స్తుతిస్తూ తరిద్దాం.




12వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

### తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
— గోవింద దాసు
(పుల్లగూర్ల సాయిరెడ్డి)



**దిశ:** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతోపాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 12 వ భాగపు లీలల ప్రచురణ. **(ఏప్రిల్–2004–ఆగస్టు 2004)**


## ఇంటి స్థలమును చూపుట

ప్రతి జీవికి తల్లితండ్రులు, భార్యాపిల్లలు, బంధువులు నివసించుటకు ఒక ఇల్లును భగవంతుడే ప్రసాదిస్తాడు. ప్రతి మనిషికి ఇల్లు ఎంతో అవసరం. మనిషి ఎక్కువ సమయం గడిపేది ఇంట్లోనే కాబట్టి, అది ఎంత సౌకర్యవంతంగా ఉంటే అంత సుఖపడగలడు. ప్రతి మనిషికి ఇంటిని ప్రసాదించేది భగవంతుడే అయినప్పటికీ నాకు ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రసాదించారు. దాదాపు ఒక ఏడు నెలల ముందు నేను ఇల్లు కట్టుకోబోయే స్థలమును కలలో చూపాడు. కాని అప్పుడు దానిని అర్థం చేసుకునే శక్తి నాలో లేని కారణంగా, అది ఒక అసంబద్ధమైన లీల అని భావించాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

ఈ లీల నవంబర్ / డిసెంబర్–2003 లో చూపాడు. కాని ఈ లీల నిజమా కాదా అనే అనుమానముతో వ్రాయలేదు. ఇప్పటికీ ఇది నిజమా? అనే సందేహం ఉంది, కానీ ఏది జరిగినా నా స్వామివారి ఆజ్ఞ లేనిదే జరగదు అనే విశ్వాసము నన్ను దృఢపరుస్తోంది. అంతేకాకుండా రోజులు గడుస్తున్న కొద్దీ కలలో చూచింది నిజమౌతుందనే నమ్మకం కలుగుతుంది. అందుకే దీనిని 27–04–04 నాడు వ్రాసుకున్నాను.

**ఇల్లు గురించి:** నేను 1990 నుండి బిల్డర్ గా వ్యాపారము చేస్తున్నప్పటికీ ఇంతవరకు నాకు హైదరాబాద్ లో సొంత ఇల్లు లేదు. మేము మా బంధువుల ఫ్లాట్ లో అద్దెకుంటున్నాము. వారు అమెరికాలో ఉంటారు. వారు ఇండియాకు వచ్చినప్పుడు ఇబ్బంది కలుగుతుంది. పైగా కొన్ని విషయాల దృష్ట్యా నా భార్యకు మేమొక సొంత ఇల్లు కట్టుకోవాలనే కోరిక బలంగా ఏర్పడింది. ఈ విషయమై ఇంట్లో నాపై ఒత్తిడి తెస్తోంది. ఇప్పటికి నా వయస్సు 44 సంవత్సరాలు. ఐనప్పటికీ ఒక ఇల్లు లేదు. కాబట్టి

ఒక చక్కటి ఇండిపెండెంట్ ఇల్లును కట్టుకోవాలనే కోరిక పుట్టింది. ఇంటి స్థలము గురించి తీవ్రంగా వెతికాము. కాని ఈ మధ్యన హైదరాబాద్ లో భూమి ధరలు గణనీయంగా పెరిగాయి. మంచి కాలనీలలో భూమిని కొనే స్తోమత లేదు. విద్యానగర్ లోని శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఉన్న ఆఫీసు మా సొంతంది. కాబట్టి ఈ ఆఫీసు ఇలాగనే ఉండి, దీనికి రోజూ వచ్చిపోయే విధంగా మా ఇల్లు ఉంటే బాగుండునని అనుకున్నాను. పైగా ఇంటి స్థలము చక్కని కాలనీలో మంచి ఇరుగు పొరుగు వారు కలదిగా ఉండవలెనని ఆశ. కాని ఎలా తీరుతుంది. ఏమి చేయాలని ఆలోచించాను. ఇది నా ఆర్థిక పరిస్థితికి తగినదై ఉండాలి. ఆఫీసుకు దగ్గరగా ఉండాలి. మంచి కాలనీలో ఉండాలి. పైగా "నమో వేంకటేశాయ" రథమును ఆ ఇంటిలో శాశ్వతంగా పెట్టుకునే విధంగా ఉండాలి. ఈ విధమైన ఇల్లును ప్రసాదించమని స్వామివారిని వేడుకున్నాను. కట్టిన ఇల్లు వద్దు, ప్లాట్ ప్రసాదిస్తే తగినట్లు నేను నిర్మించుకుంటానన్నాను. గత రెండు నెలల నుండి తీవ్రంగా ఇంటి స్థలము గురించి వెతికాము. కొన్ని నచ్చక మరికొన్నింటికి నా ఆర్థిక పరిస్థితి సరిపోక ముందుకు వెళ్ళలేదు. మొత్తం మీద అలసిపోయాను. ఈ రోజు స్వామివారితో ఒక పట్టుపట్టి ఎలాగైనా సాధించుకోవాలనే కసి ఏర్పడ్డది. సాయంత్రం 6.30 నుండి ప్రార్థించుట ప్రారంభించాను. ఒక 45 నిముషాలు స్వామివారితో మొర పెట్టుకున్నాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను అత్యాశ లేదా అసంబద్ధమైన కోరిక కోరుట లేదు. ప్రతి మనిషికి ఇల్లు అవసరం. ఇప్పటికి నా వయస్సు 44 సంవత్సరాలు. నాకింతవరకు ఒక ఇల్లు లేదు. నేను, నా కుటుంబం ఉండుటకు ఒక చక్కని ఇల్లును భిక్ష పెట్టుమని వేడుకున్నాను. మీరు నా ప్రభువు. నేను మీ సేవకుడను. సేవకుడు తన అవసరాలను యజమానినే అడగాలి. కాబట్టి అడుగుచున్నానన్నాను. మొత్తం మీద ఇల్లు కావాలని మొదట రకరకాలుగా ప్రార్థించాను. తరువాత ఒక చిన్నపిల్లవాడు తనకు చాకిలెట్ కావాలని, ఇచ్చేంతవరకు తన తల్లితో ఏ విధమైన మంకుపట్టు పట్టునో అదే విధమైన మంకుపట్టు పట్టాను. మొత్తం 45 నిముషాలు దీనాతి దీనంగా స్వామిని వదలకుండా ప్రార్థించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు భగవంతులు, ఏమైనా చేయగలరు. కాబట్టి నాకు రేపటివరకు ఇల్లును ప్రసాదించమని నా కళ్ళనుండి ధారలుగా కన్నీరు కారుచుండ ప్రార్థించాను. ఆయన పాదాలను గట్టిగా పట్టుకొని మీరు ప్రసాదించేవరకు కదలను అంటూ కూర్చున్నాను. రేపటివరకు నాకు ఇల్లు కావాలని పట్టు పట్టాను. ఎందుకో కాని ఆరోజు నా పట్టుదల ద్విగుణీకృతమైంది. మీరు ప్రసాదించేవరకు ఇక్కడినుండి కదలను అన్నాను. నా పైన ప్రేమ ఉంటే ప్రసాదించమన్నాను. వెంటనే ఒక హృదయాంతరంగ భావం స్వామివారి నుండి వచ్చినట్లు ఏర్పడింది. "నీకోసం స్వామివారు ఈ సృష్టి ధర్మాన్ని విడనాడాలా?" అనే భావన పదే




పదే వచ్చింది. వెంటనే వెనుకకు తగ్గాను. చివరికి మీరు కూడా సృష్టి ధర్మాలను పాటించాలి కాబట్టి రేపటి వరకు ఇల్లును ప్రసాదించలేరు కాబట్టి కనీసం నేను ఎక్కడ ఇల్లు కట్టుకుందునో ఆ స్థలమునైనా చూపెట్టమని ప్రార్థించాను. ఎందుకంటే ఆ స్థలమును చూచి సంతోషపడవచ్చుననే కోరిక, దానిని తొందరగా కొనవచ్చుననే ఆశతో కోరాను. ఈ రాత్రి తప్పక చూపుమని వేడుకుని అలసి ఇంటికి పోయాను.

**కల:** అనుకున్నట్లే ఈ రాత్రి ఒక కల వచ్చింది. అందులో పట్టణములు, ఇండ్లు, మనుష్యులు ఎవ్వరూ కనబడలేదు. చివరికి రోడ్లు, ప్లాట్లు కూడా కనబడలేదు. నాకు కనబడింది కేవలం ఒక పెద్ద అడవి ప్రాంతములాగా ఉన్నది. అది ఎలాంటి అభివృద్ధి చెందని, నివాస యోగ్యం గాని చెట్లతో నిండి వున్న ప్రదేశం కనబడ్డది. మనము ఎందుకూ పనికిరాని భూమిలో సరుగుడు చెట్లు పెడితే ఒక పద్ధతి ప్రకారం వాటి మొదళ్ళు ఎలా వరుస క్రమంలో ఉంటాయో అలా కనబడ్డాయి. కొన్నిచోట్ల ఈ చెట్లు 30 నుండి 40 అడుగుల ఎత్తు వరకు పెరిగి ఉన్నవి. ఆ స్థలము మేకలు, గొఱ్ఱెలు మేయడానికి అనుకూలంగా ఉంది. ఆ స్థలములో పిల్లబాట కూడా ఉంది. (మనుష్యులు కాలినడక నడిచేబాట) ఆ పిల్ల బాటను, దాని పొడవున పెరిగిన చెట్లను ప్రత్యేకంగా చూచాను. మనము కారులో గాని లేదా బస్సులో కాని చెట్ల మధ్యన ప్రయాణిస్తున్నప్పుడు ఆ చెట్ల మొదళ్ళు పరిగెత్తుచున్నట్లు ఎలా కనిపిస్తాయో ఆ విధంగా కనబడ్డాయి. చివరికి నా దృష్టి ఒక ప్రత్యేకమైన స్థలముపై పడ్డది. తుమ్మచెట్లు కాదు కాని వాటిలాగా ఉన్న పెద్ద పెద్ద చెట్లు అక్కడ ఉన్నవి. అప్పుడే వర్షం వెలిసినట్లు ఆ చెట్ల కొమ్మల నుండి నీటిచుక్కలు ఒక్కొక్కటి క్రింద పడుచున్నవి. ఒక చెట్టు మంద వంగి ఈ భూమిపై వాలిందా అన్నట్లు ఉంది. గాలికి ఈ కొమ్మ పైకి క్రిందికి మెల్లగా ఊగుట వలన దానినుండి నీటిబొట్లు భూమిపైన ఈ స్థలములో పడుటను చూచాను. ఒకరకంగా ఇదే ప్లాటు అని వేలుతో చూపినట్లు ఉంది. కల చెదిరింది.

తెల్లవారాక ఈ కల గురించి విశ్లేషించుకున్నాను. ఇది నేను నివసించబోయే స్థలమా? హైదరాబాద్ లోనే ఉన్నదా? లేదా వేరే జిల్లాలోనిదా? నేను కట్టుకోబోయే ఇల్లు ఇక్కడేనా?

అనుకున్నాను. బహుశా నా ముసలితనంలో ఇలాంటి స్థలంలో కట్టుకోవచ్చనుకున్నాను. లేక ఈ కల యాదృచ్ఛికంగా వచ్చిందా తెలియదు. నిన్న స్వామిని ఇబ్బంది పెట్టినందుకు అదే కోణంలో జవాబిచ్చాడనుకున్నాను. అందుకే సందిగ్ధముతో దీనిని వ్రాయలేదు. తరువాత కొన్ని రోజులకు బోయిన్ పల్లి, సైనిక్ పురి, అల్వాల్, బంజారా హిల్స్ మొదలగు ప్రాంతములలో ఇంటి స్థలముకై వెతుకుచున్నప్పుడు చెట్లు ఎక్కువ ఉన్నవాటిని ప్రత్యేకముగా చూచుట జరిగింది. ఒకరోజు స్వామివారు ఆవహించే శ్రీమాన్ ఉపేందర్ రావు గారు మా ఇంటికి వచ్చినప్పుడు ఆయనకీ విషయం చెప్పాను. అప్పుడు ఆయన స్వామివారు నాకు ఆ స్థలమును చూపిన విషయం వాస్తవమని చెప్పాడు. ఆ స్థలము నాకు కావాలంటే రు.1116/- స్వామివారికి సమర్పించమన్నాడు. ఆయన మాట ప్రకారం తేది 25-03-2004 నాడు తిరుపతిలో సమర్పించాను.

దాదాపు 20-03-04 ప్రాంతమున హబ్సిగూడలో ఒక ప్లాట్ చూచాను, నచ్చింది. మళ్ళీ ఏప్రిల్ 2004 లో ఇదే ప్లాటును నిశితంగా పరీక్షించి చూచాను. అది నార్త్ 350 - 450 తిరిగి ఉండుట వలన అందులో దాదాపు 250 గజాలు వృధా పోతుందని భావించి వద్దనుకున్నాను. కాని స్వామివారు మాత్రం దీనిని తీసుకొమ్మన్నట్లు ఈ విధమైన లీలను చూపారు.

**కల:** నేను ఒక ఇంటిలో నిలబడ్డాను. ఈ ఇంటి ప్రక్కన వేరే వారివి రెండు ఓపెన్ ప్లాట్స్ ఉన్నవి. ఇవి ఉత్తర దక్షిణ పొడవుతో ఉన్నవి. ప్రక్క ప్లాటుకు వాయువ్యం నుండి 15 అడుగుల వీధి పోటు కల దారి నుండి ఒక జంట వచ్చారు. వారు మంచి తెల్లధోవతి ధరించారు. కొంచెము పొట్టిగా ఉన్నాడు. చక్కని తిరునామం ధరించాడు. ఆయన చేతిలో ఒక పెట్టె పట్టుకున్నాడు. ఆయన ప్రక్కన ఆయనకు తగిన ఎత్తుతో కొంచెం నలుపు (ఆయన కంటె నలుపు) రంగు కలిగి చీర ధరించిన ఆయన భార్య కూడా ఆయన వెనకనే వచ్చింది. ఆయన ఆ ప్లాట్ బయట నిలబడి "ఈ ప్లాట్ అమ్ముతారా? అని నన్ను అడిగాడు. నేను ఏమో నాకు తెలియదని బదులిచ్చాను. కల చెదిరింది. తెల్లవారి ఏదో పని నిమిత్తమని హబ్సీగూడ వైపు వెళ్ళాను. అనుకోకుండా మధ్యవర్తి ప్రమేయంచే మళ్ళీ ఈ ప్లాటును చూచాను. ఆ రోజు ఆ ప్లాటుకు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడాను. అప్పుడు ఈ ప్లాటు వాయువ్యం 15 అడుగుల వీధిపోటుతో కలదని గ్రహించాను. బేరం కుదరక వెనుదిరిగాను. తరువాత 26-04-04 నాడు నేనడిగిన ధరకు ఈ ప్లాటు వ్యక్తితో మళ్ళీ బేరమాడాను. ఇది 755 గజములు కలదు. అందులో 250 గజములు వంకర తిరిగి ఉంది. చివరికి దీనిని కొనాలనే ఆలోచన కలిగింది.

ఈ విధంగా నేను ఒక ప్లాటును త్వరగా కొనాలని, ఆ తరువాత మంచి ఇల్లును నిర్మించుకోవాలని చూస్తున్నాను. హౌసింగ్ లోన్ కూడా తీసుకోవాలనే యోచనలో ఉన్నాను. స్వామివారు ఈ క్రింది లీలను ప్రసాదించారు.

**28-04-04 కల :** నేను ఒక హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలోకి ఉద్యోగ రీత్యా వెళ్ళానట. నాకు అప్పుడే నూతనంగా అపాయింట్మెంట్ జరిగింది. ఆ ఆఫీసులో ఒకాయన చూపిన సీటులో కూర్చున్నాను. నాకు అప్పటికే ఈ రంగంలో మంచి అనుభవమున్నదని వారికి తెలుసు. ఇంతలో ఒకాయన ఒక ఫైల్ ను నాకిచ్చారు. దీనిని అర్జెంట్ గా క్లియర్ చేయాలి, చాలా రోజుల నుండి పెండింగ్ లో ఉన్నదని అన్నారు. ఈ ఫైల్ ను తీసుకున్నంతనే "దానిని ఒక్క క్షణములో క్లియర్ చేస్తాను చూడు, దీని గురించి నాకు బాగా తెలుసు అన్నాను. ఇది నా ఫైల్, చూడండి అని ఆ ఫైల్ ను తిరగేసి ముందు, వెనక, ప్రక్కన చూపెట్టాను". దానిపై పి.సాయిరెడ్డి, 9848157932 అని నా పేరు, దానిక్రింద అప్పటి నా సెల్ నెంబర్ వ్రాసి ఉన్నది. నేను ఆ కంపెనీలో చేరకముందే హౌసింగ్ లోనుకు అప్లై చేశానట. అది ఎందుకో పెండింగులో ఉంది. ప్రస్తుతం క్లియర్ కాబోతోంది. ఇది కల. అంటే నేను ఇల్లు కట్టుకునే కాలం దగ్గర పడ్డదని అర్థం.

ఒకప్రక్క నేను చూచిన ప్లాట్ ఇంతవరకు కొనలేదు. బేరసారాలు జరుగుచున్నాయి. ప్లాట్ ఇప్పించవలసిందిగా తీవ్రంగా స్వామివారిని స్మరిస్తూ ప్రార్థిస్తున్నాను.

**భూ సమస్య :** మరోప్రక్క నా భూ సమస్య మరింత ముదిరింది. దుండగులు నన్ను రకరకాలుగా బాధలు పెడుచున్నారు. నా భూమిని వదిలి ప్రభుత్వభూమిలో ప్లాట్లు చేసి అమ్ముకొందుమని ముందు చెప్పారు. కాని అది ప్రభుత్వ భూమి అని ఎవ్వరూ కొనుటకు ముందుకు రాని కారణంగా మళ్ళీ నా సొంత భూమిలోనికి వచ్చుటకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. వారి బోర్డులు, ఫెన్సింగులు పెట్టుచున్నారు. నేను ఈ భూసమస్యతో ఉన్న కారణంగా 01-05-2004 నుండి 25-06-2004 వరకు ఎన్నో స్వామివారి అనుభూతులను పొందినప్పటికీ వాటిని వ్రాయలేదు. ముఖ్యంగా ఈ మధ్యన వచ్చిన చాలా అనుభూతుల అర్థములను కల కన్నప్పుడు గ్రహించలేకపోయాను. కాని కొంత యోగ్యత సిద్ధించిన తరువాత వాటి అర్థమును గ్రహించాను. అవి ఈ విధంగా ఉన్నవి.

మా ఊరిలో ఊరి ప్రక్కన పొల్కంబావి అనే పేరుగల మాదొక బావి ఉన్నది. ఊరిలోనివారు ప్రతిరోజు ప్రొద్దున ఈ బావి వద్దకు వచ్చి స్నానాదులు చేస్తుంటారు. ఇది చిన్నపిల్లలు కూడా దిగేవిధంగా ఉంటుంది. వర్షాకాలములో ఈ బావి నిండుగా నిండి ప్రక్క పొలములోని నీటి మట్టానికి సమానంగా కనిపిస్తుంది.

**06-05-04 కల :** ఈ కలలో రోడ్డు ప్రక్కన ఉన్న మా పొల్కం బావి, నీటితో నిండి యున్నది. దీని గడ్డిమీద కరెంట్ రూమ్ ఒకటి ఉంది. ఈ రూం ప్రక్కన ఒక పెద్ద రాయి ఉన్నట్లు కనబడ్డది. మా ఊరి పెద్దలు మరియు నేను అక్కడ ఉన్నాము. అందరి సమక్షంలో శివలింగమును ఈ రాయి పైననే స్థాపించాలని చెప్పుచూ

అప్రయత్నంగా నా అరచేతితో ఆ రాయిపై కొట్టుచున్నాను. ఇక్కడ ప్రతిష్ఠ చేస్తే రోడ్డుపై పోవు వారు చూస్తారని నా అభిప్రాయంగా ఉన్నది. కల చెదిరింది. దీని అర్థం గ్రహించలేదు.

## డబ్బులు వృథా చేయుట

**భూ సమస్య :** మియాపూర్ భూమిలో ముందే దుండగులు ప్లాట్లు చేసి అమ్మారు. వాటిని తిరిగి తక్కువ మొత్తంలో కొనుచు ఆ భూమి మాదని మమ్మల్ని బెదిరిస్తున్నారు. అయితే నేనే వాటిని తిరిగి కొందామనే ఆలోచన వచ్చింది. దుండగులకు ఆ యజమానులచే ముందే ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఏదో విధంగా కొనాలని భావించాను.

**08-05-04 కల :** బాబూరావుకు (తెలిసిన వ్యక్తి) తన ప్లాటును ఒకరికి అగ్రిమెంట్ లాంటిది, మరొకరికి ముందే అమ్మినట్లు సేల్ డీడ్ ఒకే వ్యక్తి ఇద్దరికి అమ్మినట్లు తెలిసినప్పటికీ మా అడ్వకేట్ సలహామీద నేను వారివద్ద కొనుటకు ప్రయత్నించాను. ఇంతే కల. పాత తేదీతో అగ్రిమెంట్ చేసుకొని దానిని వ్యాలిడేషన్ చేయించాను. ఇలాంటి ప్లాట్లు కొని నా డబ్బులను వృథాగా ఖర్చు చేశాను.

## భూ సమస్య పెద్దదగునని చూపుట, రథయాత్రకు విధి విధానాలను సూచించుట

గతంలో నా భూమిని వదలి ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి అమ్ముకొందుమని దుండగులు చెప్పారు. ఒక 45 రోజులు అమ్మటుకు ప్రయత్నించారు. కాని కొనుటకు ఎవ్వరూ ముందుకు రాలేదు. నిరాశతో ఉన్న దుండగులు మళ్ళీ నా భూమిపైకి వచ్చుటకు ప్రయత్నించారు. దీనిని గమనించిన నేను వారిపై కోర్టులో కేసు వేశాను. యథాస్థితి కొనసాగించమని ఆర్డరిచ్చారు. వారు కూడా నాకు తెలియకుండా నాపై చిన్న కోర్టులో కేసు వేశారు. వారికి కూడా 'యథాస్థితి' కొనసాగించమని అదేరోజు ఆర్డర్ వచ్చింది. ఒకరికి ఆర్డర్ వచ్చిన విషయం మరొకరికి తెలియదు. కానీ శ్రీవేంకటేశ్వరుడు మాత్రం భవిష్యత్తులో మరిన్ని పెద్ద సమస్యలు వచ్చునని, ధైర్యంగా ముందుకు సాగమని చెప్పుచు రెండు కలలను చూపాడు. ఒకటి భూ సమస్య గురించి, మరొకటి రథము గురించి.

**11-05-04 కల :** ఈ కలలో నేను మా సొంత ఊరు చిన్నగుండవెల్లిలో ఉన్నాను. ఉదయం మా తోటబావి వద్దకు కాలినడకన పోయాను. కొంత సమయము బావి వద్ద గడిపి తిరిగి ఇంటికి వచ్చునప్పుడు దగ్గరగా ఉంటుందని భావించి మా పక్కనున్న గొల్ల రాజయ్య భూమిగుండా అడ్డదారిలో వస్తున్నాను. నిజానికి వీరిది కుష్కి పొలము కాని ఈ కలలో అది తరి పొలములాగా కనబడ్డది. మా భూమినుండి వీరి భూమిలోనికి అడుగిడునప్పుడు వారిది తరిపొలము లాగా, అందులో ఆరు ఇంచుల నీరు ఉన్నట్లు కనబడ్డది. వరి వేయుటకు పొలమును




సిద్ధం చేశారనుకున్నాను. ఈమధ్యన నేను హైదరాబాదులో ఉంటున్నాను. వీరు ఈ పొలమును ఈమధ్యన తరిపొలము చేశారనుకున్నాను. ఇందులో నీరు కొద్దిగా ఉన్నాయని భావించి, అందులోనికి దిగి నాలుగైదు అడుగులు వేశాను. ఇంతలో పెద్ద నీరు వచ్చింది. ఎడమనుండి కుడివైపుకు పోవుచున్నది. నా మోకాలు కంటె ఎక్కువ లోతు వరకు నీరు వచ్చింది. డేంజర్ గమనించి తిరిగి ఒడ్డుకు వచ్చాను. మొదటి స్థానము వద్దకు వచ్చాను. నా ముందు నుండి చాలా పెద్ద నీటి ప్రవాహం పోవుచున్నది. కొద్ది సమయంలోనే నీటి ప్రవాహం ఇంకా పెరిగింది. ఒక చెరువు గట్టు తెగిపోతే ఏవిధమైన నీటి ప్రవాహం ఉండునో ఆ విధంగా ఉన్నది. నేను ఉన్నచోటే నిలబడి నవ్వుచూ దీనిలో నుండి ఎలా వెళ్ళాలని అనుకుంటున్నాను. ఇంతలో నా వెనకనుండి వచ్చిన ఒక తెల్లని అంబాసిడర్ కారు ఏమీ కాదు అనుచు ఒడ్డును ఆసరాగా చేసుకొని ఆ వరద గుండా ముందుకు సాగిపోతున్నది. "నీవు భయపడకు ఏమీకాదు. ఈ కారులాగా ముందుకు సాగిపో" అనే ఒక భావం నా హృదయాంతరంగంలో ఏర్పడ్డది. కల చెదిరింది. ఇది ఈనాటి మొదటి కల.

**ఈనాటి రెండవ కల :** ఈ కలలో అమ్మవారి భక్తులు ఆమె రథమును షావ తీయుచున్నారు (ఊరేగింపు). ఒక 50-60 మంది భక్తులు ప్రతివారు పసుపురంగు చొక్కా, ప్యాంటుతో పైన సెల్లా కప్పుకుని ఉన్నారు. వీరు ఒక సంస్థవారని తెలిసే విధంగా ఉన్నాను. వీరు ఎంతో ఉత్సాహముతో కొత్తగా తయారు చేసిన రథమును షావ తీయుచున్నారు. నేను వారి వద్దకు వెళ్ళాను. నేను కూడా శ్రీవేంకటేశ్వరుని దివ్యరథమును ఇంతకన్నా బాగా చేయుచున్నానని వారితో చెప్పాను. వారి రథం ఎలా ఉందా అని లోనికి చూచాను. అమ్మవారు కనబడలేదు. కాని ఆ రథంలో అమ్మవారిని నిలబెట్టుటకు సిద్ధంగా ఉన్న గొడుగు, పాదాల పీటపై ఒక స్ప్రింగును మాత్రమే చూచాను. కల చెదిరింది.

మొదటి కల అర్థం ఏమిటనగా నీకు భవిష్యత్తులో పెద్ద పెద్ద సమస్యలు వచ్చునని, వీటిని చూచి పిరికివాడిగా భయపడకుమని, ధైర్యంగా ముందుకు వెళ్ళమన్నాడు. ఆ సమస్యలు నిన్నేమీ చేయలేవు. నీవు ధైర్యంగా ముందుకు వెళ్ళినచో శుభం జరుగునని సూచించాడు. ఈ కల ప్రకారం మాకు కొద్ది రోజులలో పెద్ద

సమస్య రాబోతోందని నేను మరియు నా భార్య అనుకున్నాము.

**ఇక రెండవ కల అర్థం :** 'నమో వేంకటేశాయ' రథంతో పాటు ఉండు వ్యక్తులు మంచి పసుపురంగు డ్రెస్ వేసుకోవాలని, వారు 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్వామి సేవకుడు' అనే ఒక బ్యాడ్జి ధరించి అత్యంత ఉత్సాహంగా ఉండాలనే అభిప్రాయమును కలిగించారు. ఇలా యాత్ర నిర్వహణకు విధి విధానాలు సూచించారు.

**భూ సమస్య :** అనుకున్నట్లుగనే తేది 16-05-2004 నాడు ఈ దుండగులు నా భూమిని ఆక్రమించుకున్నారు. ఒక 60-70 మంది నా భూమిలోని దాదాపు 30 అడుగుల ఎత్తు పెరిగిన 550 టేకు చెట్లను నరికి వేశారు. అలా నరికిన చెట్లను వారి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించారు. నరికిన టేకుచెట్ల మొదళ్ళలో తిరిగి మొలకెత్తకుండా ఆసిడ్ పోశారు. ఆరోజు నేను హైదరాబాదులో లేను. విషయము తెలుసుకొని పోలీసులకు ఫోన్ చేశాను. కాని వారు స్పందించలేదు. చివరికి మా ఆఫీసులోని ఒకరి ద్వారా పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇప్పించాను. చెట్లను నరికిన ప్రాంతము వారిదని చూపుచు, దాదాపు ఒక ఎకరం భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. సర్వం బాధాకరంగా ఉంది. మహా భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఆ సమయాన మా వాచ్ మెన్ ను తన రూంలో బంధించి భయపెట్టారు. ఆరోజు పోలీసులు వచ్చి పంచనామా చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

ఈ అనుకోని ఘటన నన్ను కలచివేసింది. తేది 24-11-03 నాడు నా భూమిని స్వామివద్ద భద్రపరచాను. కాని ఆయన కాపాడలేదు. ఈ ఘటన శ్రీవేంకటేశ్వరునిపై విశ్వాసము సన్నగిల్లేలా చేసింది. ఆయన చూపే లీలల పైన అపనమ్మకము కలుగుట ప్రారంభమైంది. ఈ తగాదా ముదురుటకు మీరే కారణము, మీపై ఉన్న విశ్వాసముతో సంప్రదింపులు జరపలేదు. వారు కోరిన దానిలోఎంతో కొంత ఇచ్చినచో వెళ్ళిపోవుటకు ఆ దుండగులు ఎన్నోసార్లు సిద్ధమైనారు. కాని నేనే, నాకు ముందు వెనక మీరున్నారని భావించి ఒప్పుకోలేదు. చిన్న విషయం పెద్దదైంది. దీనికంతటికీ కారణం శ్రీవేంకటేశ్వరుడే అని భావించి బాధపడ్డాను.

## కాకతీయనగర్‌లో మా ఇల్లు ఉండునని సూచించుట

ఇలా ఆస్తి గొడవల వలన నా మనస్సు బాగా లేదు. భయం భయంగా ఉంది. ఏమవుతుందో నన్నే భయము మాటి మాటికీ వెంటాడుతోంది. ఈస్థితిలో స్వామివారు కొన్ని కలలను చూపెట్టారు. అందులో ఒకటి మా ఇంటి గురించి, నేను కట్టుకోబోయే ఇల్లు ఉండే కాలనీ పేరు కూడా చెప్పారు. అందులో పూజలు, హోమాలు జరుగునని సూచించారు. నమో వేంకటేశాయ రథం గురించి, మంచి ఉన్నత వ్యక్తులు దీనిని ఆదరిస్తారని చూపెట్టాడు. ఈ మొత్తం నాలుగు లీలలను క్లుప్తంగా వివరిస్తాను.

**ఇంటి గురించి :** అసలు స్వామివారు నాకు ఇంటిస్థలమును ఎక్కడ ప్రసాదిస్తారని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. కాకతీయ నగర్ అనే కాలనీలో మా ఇల్లు ఉండునని ఈ లీల ద్వారా చూపారు.

**15-05-04 కల :** ఒక మంచి కాలనీలో చక్కని ఇల్లు ఉంది. ఆ ఇంటిలో గృహప్రవేశం లేదా మరో శుభకార్యం జరుగుతోంది. ఆ ఇంట్లో పూజారులు, బ్రాహ్మణులు, పండితులు, భజన చేసేవారు చాలామంది ఉన్నారు. ఆ ఇల్లు మాదేనట. ఆ కాలనీపేరు కాకతీయ నగర్ అని కలలోనే తెలిసింది. జీయరు స్వామిలాంటి ఒక యతీంద్రుడు వచ్చాడు. వారికి ఒక ప్రత్యేక రూమ్ లో బ్రాహ్మణులు వంట చేస్తున్నారు. మేము సంపూర్ణంగా ఈ ఇల్లును రెండు రోజుల పూజ నిమిత్తమని ఈ యతీంద్రులకు ఇచ్చేశామట. ఆ పూజారులు వండుకున్న అన్నమును అడిగి తీసుకుని నేను కొంత తిన్నాను. ఇల్లంతా హడావిడిగా ఉంది. కల చెదిరింది.

ఈ కలలో నేను కాకతీయనగర్ అనే పేరు గల కాలనీలో ఇల్లు కట్టుకోబోతున్నానని, ఆ ఇంట్లోకి యతీంద్రులు, బ్రాహ్మణులు వచ్చెదరని, పుణ్యకార్యాలు జరుగునని సూచించారు.

## ఉన్నత వ్యక్తులు పరిచయమగుదురని సూచించుట

**26-05-04 కల : రథం గురించి :** అది ఒక పెద్ద హాలు. పూజా కార్యక్రమము జరుగుచున్నది. నేను పూజా దుస్తులతో ఒక ప్రక్కన కూర్చున్నాను. నా ప్రక్కన శ్రీమతి సోనియా గాంధీ కూర్చున్నారు. ఆమె నాకు మంచి పరిచయమున్న దానిలా మాట్లాడుచున్నది. ఆమె ప్రక్కన నా భార్య సురేఖ కూర్చుంది. ఇంతలో పూజారులు పిలవగా పూజకై అక్కడినుండి లేచి వెళ్ళాను. కల చెదిరింది.

ఈ క్రింది విధంగా మరో కల కన్నాను.

**24-06-04 కల :** అది ఒక సభ. అందులో నేను ఉన్నాను. మాజీ ప్రధానమంత్రి కీ.శే. అటల్ బిహారీ వాజపాయ్ గారు నాతో సన్నిహితంగా మాట్లాడుచున్నారు. ఆయన ముఖమును చాలా దగ్గరగా చూశాను. ఆయనతో ఏదో విషయం మాట్లాడుచు నేను తిరుమల శ్రీవారికి సంవత్సరానికి 7 కోట్ల జప సమర్పణ విషయం చెప్పాను. ఈసారి మీరు మీ స్వహస్తాలతో జప సమర్పణ చేయండి. తిరుపతికి రండని అన్నాను. ఆయన మౌనం వహించారు. కొంచెం సమయం తరువాత మళ్ళీ అడిగాను. అప్పుడు ఆయన రాను వీలు కాదు అని చెప్పారు. కల చెదిరింది.

బహుశా రాబోవు జప సమర్పణకు పెద్ద వ్యక్తులు రావాలని ప్రయత్నించుచునని చూపారు. ఆ పెద్ద వ్యక్తులతో మంచి సంబంధాలు ఏర్పడగలవని సూచించారు. నేను ఇంతే అర్థం చేసుకున్నాను. దీని తరువాత మరో కల.

**కల :** ఒక రిమోట్ ఊరికి కుటుంబంతో పాటు నేను వెళ్ళానట.

ఉండుటకు వసతి చూస్తున్నామట. ఒక రోడ్డుపై కూర్చున్నాము. మొత్తం మీద మేము ఒక స్వామివారిని చూచుటకు ఒక క్షేత్రానికి వెళ్ళాము. కల చెదిరింది.

బహుశా నమో వేంకటేశాయ రథయాత్రలో మేము రిమోట్ ప్రాంతాలకు వెళ్ళుదుమని, అక్కడ వసతి కొరకు చూచెదమని, ఫుట్ పాత్ ను ఆశ్రయించి ఉండవలసి వచ్చునని, సూచిస్తూ రథయాత్రకు నియమాలను సూచించారు.

నా ఆస్తి విషయములో ఎన్నో గొడవలతో మనస్సు బాగా లేనప్పటికీ నమో వేంకటేశాయ రథం తయారీలో ఏ చిన్న లోపమునూ జరుగనీయలేదు. నేను ఈ రథం నిర్మాణం ఇంచు ఇంచు పరిశీలించేవాడిని. రోజుకు నాలుగుసార్లు పని వద్దకు వెళ్ళేవాడిని. అత్యంత సూక్ష్మ దృష్టితో గమనించేవాడిని. ఈవిధంగా నేను రథం పనిని గమనించు సమయాన దుండగులు నా భూమిపైకి వచ్చారని, తనను తిడుతున్నారని, వారి బోర్డును పెడుతున్నారని చెప్పుచు మా వాచ్ మెన్ నన్ను వెంటనే రమ్మని ఫోన్ చేసేవాడు. కాని 'నమో వేంకటేశాయ' రథం పనులను వదలలేక నా భూమి పోయినా సరే అని భావించి భూమి వద్దకు పోని సందర్భాలు ఎన్నో ఉన్నాయి. స్వామివారు రెండింటిలో దేనికి విలువనిస్తాడు అని పరీక్షించుచున్నట్లుండేది. మొత్తం మీద రథం అత్యంత సుందరంగా అద్భుతంగా తయారవుతోంది. ఈ రథాన్ని తిరుపతిలో ప్రారంభించి, 2వ జపసమర్పణ, అంటే గోకులాష్టమి తేది 07-09-04 కంటే ముందు 11 రోజులైనా తిప్పాలనే ఉద్దేశ్యంతో అత్యంత వేగంగా నిర్మించాము. కాని పనివారు సకాలంలో సహకరించక తీవ్రమైన బాధ కలిగించారు. ప్రతిక్షణం స్వామివారిని ప్రార్థించాను. ఒకప్రక్క ఈ రథం పనులు సకాలంలో చక్కగా జరగాలని, మరోప్రక్క నా భూ సమస్య తీరాలని పదే పదే వేడుకున్నాను. బహుశా నాలోని నిరాశను తీర్చి ఆనందం నింపుటకు స్వామివారు లీలలను చూపుతున్నారని మొదట్లో చాలాసార్లు భావించాను. కాని తరువాతి కాలంలో వీటి సరైన అర్థమును తెలుసుకున్నాను. ఈ లీలలలో రథయాత్ర నిర్వహించుటకు కొన్ని విధి విధానాలను విధించాడు, మరో అద్భుత నియమాన్ని ఈ విధంగా సూచించారు.

**20-07-04 కల :** ఈనాటి కలలో నేను ఒక అజ్ఞాత భక్తుడిగా స్వామివారి రథమును వీధులలో త్రిప్పినానట. నన్ను నాలుగు వీధుల మధ్యన చూచినవారు గుర్తుపట్టారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే నేదురుమల్లి జనార్దన్ రెడ్డి గారు గుర్తుపట్టారు. వారింటికి తీసుకెళ్ళి మర్యాద చేశారు. ఆ తర్వాత ఒక గుడికి స్వామివారిని దర్శించేందుకు వెళ్ళాము. ఆ గుడిలో భక్తుల క్యూ పెద్దగా ఉంది. ఒక తిరునామం ధరించిన శ్రీవైష్ణవ స్వామి ఆ భక్తుల తలలపై శఠగోపం పెట్టి ఆశీర్వదిస్తున్నాడు. ఆ గుడిలో అండర్ గ్రౌండ్ రూంలో (పాతాళ వినాయకుడి లాగ) శివలింగం దానిపై నాగేంద్రుని పడగతో ఉన్నదట. నేను అంతకుముందే దర్శించానట. ప్రస్తుతము భక్తులు ఎక్కువగా ఉన్న కారణంగా మళ్ళీ నేను వెళ్ళలేదు. ఆ ఆలయంలోని శ్రీవారిని ఏవిధంగా ఉన్నది ఊహించుకుని నమస్కరించాను. మా రథాన్ని వదిలి వెళ్ళలేదు. కల చెదిరింది.

బహుశా నేను రోడ్లు, కూడళ్ళు, దేవాలయాలు, తెలిసిన ఆహ్వానితుల ఇంటి వద్దకు రథాన్ని తీసుకుని త్రిప్పగలనని స్వామివారు సూచించారు. మరియు ఒక అజ్ఞాత భక్తుడిగా, అహంకారాన్నివిడిచి రథయాత్ర నిర్వహించమన్నారు. గొప్పవారు ఆహ్వానించి మర్యాద ఇచ్చినప్పటికీ పొంగిపోవద్దన్నారు.

అత్యంత కష్టం మీద అవుతుందో కాదో అనే ఆందోళన మధ్య స్వామివారి కృపావిశేషం చేత 'నమో వేంకటేశాయ' రథం పనులు చివరి దశకు చేరాయి. ఈ నమో వేంకటేశాయ రథ నిర్మాణ సమయంలో "భవిష్యత్తులో ఒక పెద్ద నిర్మాణం చేయాల్సి ఉంది, ఇది "ట్రైనింగ్ మాత్రమే" అనే ఒక హృదయాంతరంగ భావం ఎన్నోసార్లు వచ్చింది.

రథయాత్రకు స్వామివారు సూచించిన విధి విధానాలు (1) రథము వద్దకు వచ్చిన భక్తులకు పత్రం, పుష్పం, ఫలం, తోయం సమర్పించి, ప్రదక్షిణ చేసి స్వామివారి పాదములపై తలపెట్టి ప్రార్థించమంటూ చెప్పాలి. ఆ తరువాత సమర్పణ క్రతువును పొంది వారి వారి కోరికలను మనస్సులోనే తీర్చమని ప్రార్థించి, స్వామివారి మహామంత్రం వ్రాసి, సమర్పణ భావంతో, శరణాగత భావంతో రథానికి అమర్చిన శంకులలో 'మీరు తప్ప మాకు దిక్కెవ్వరూ లేరనే' భావంతో సమర్పించాలి. (2) నేను ఒక అజ్ఞాత వ్యక్తిగా, ఎలాంటి ఆర్భాటాలు, అహంకారం లేకుండా యాత్ర నిర్వహించాలి. పెద్దవారు గౌరవించినప్పటికీ పొంగిపోకూడదు. (3) దూరపు ప్రాంతాలు రథయాత్ర చేయునప్పుడు, వసతికోసం చింతించక, ఫుట్ పాతే మా వసతిగా భావించి యాత్ర నిర్వహించాలి. క్షణము వ్యర్థము చేయరాదు. (4) రథము వెంటనుండే మా వ్యక్తులు పసుపుపచ్చ రంగు డ్రెస్ కోడ్ తో పాటు శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్వామి సేవకుడనే బ్యాడ్జీ తప్పక ధరించాలి. ఈ నియమాలను విధించారు. ఇక నేను కూడా ఈ రథాన్ని ఉపయోగించి స్వామివారి సేవ తృప్తిగా చేయాలనుకున్నాను. వీలైనంత ఎక్కువ మంది స్వామివారిని సేవించేలా ఎక్కువ ప్రాంతాలు త్రిప్పాలనుకున్నాను. సాధ్యమైనంత వరకు ఆహ్వానించిన ప్రతి భక్తుని వద్దకు వెళ్ళాలనుకున్నాను. దీనిద్వారా ఎంతోమంది భక్తులకు వారి కాలనీలలో త్రిప్పే బాధ్యత వారిపై పెట్టుచు స్వామి సేవాభాగ్యం లభింపచేయాలనుకున్నాను.

ఈ విధంగా నమో వేంకటేశాయ రథమును తయారు చేసిన తరువాత ఒక డీసీయం లారీని రెంటుకు తీసుకున్నాము. ఆ లారీ వెనకాల ఛేసిస్ పైన ఈ 7 X7 సైజు గల రథమును ఫిక్స్ చేశాము. దీనిముందు 7 X 5 సైజుతో ఒక భజన మండపమును ఏర్పాటు

చేశాము. ఈ రథానికి క్రింది భాగంలో మూడు ప్రక్కల స్వామివారి నాలుగు యుగాలలోని వివిధ రూపాలను చూపెట్టాము. ఎప్పటికీ ఒక బ్రాహ్మణుడు ఈ రథం ముందు కూర్చుని, వచ్చిన భక్తులకు పూజలు నిర్వహించే విధంగా చేశాము. టెంకాయలు కొట్టుట, పూజలు నిర్వహించుట రథం ముందు భాగంలో మాత్రమే జరుగును. ఇక భక్తులు స్వామివారిని నాలుగు ప్రక్కల సేవించుకోవచ్చును. వారు స్వయంగా పూజలు, హారతి నిర్వహించుకోవచ్చు. క్రతువుపై మహామంత్రము వ్రాయుటకు పెన్నులను కూడా స్వామి పాదాల వద్ద ఏర్పాటు చేశాము. రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తుడు సమర్పణ క్రతువును పొంది, వారి వారి కోరికలను తీర్చుమని, స్వామివారిని స్మరించి, క్రతువుపై మహామంత్రమును వ్రాసి, ప్రత్యేకముగ అమర్చిన శంకులలో శరణాగత భావంతో సమర్పించాలని, వీటిని తిరుపతిలో జప హోమాదులు నిర్వహించి స్వామివారికి సమర్పించెదమని తెలిపే ఒక బోర్డును సహితం రథానికి ఇరుప్రక్కల ఏర్పాటు చేశాము. రథం చుట్టూ లైట్లు, మైకు, ఒక జనరేటర్ మరియు రథం పైన ఒక చక్కని గొడుగు ఏర్పాటు చేశాము. ఈ విధంగా రథం పూర్తిగా సిద్ధం అయింది.

## తిరుపతిలో నమో వేంకటేశాయ రథము ప్రారంభోత్సవం

తేది 11-08-04 నాడు తిరుమలలోని ధ్యాన మందిరము ముందు అప్పటి టిటిడి ఈవో శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు ఈ రథాన్ని ప్రారంభిస్తారని నిర్ణయం జరిగింది. దాని ప్రకారం తేది 09-08-04 నాడు హైదరాబాద్ లో బయలుదేరి ఒకరోజు ముందు అంటే 10-08-04 ఉదయం రథంతో పాటు మేమందరం తిరుపతి చేరుకున్నాం. కాని తేది 10-08-04 నాటి మధ్యాహ్నం 2 గంటలకు మా రథమును కొండపైకి తీసుకుపోవుటకు తిరుమల సెక్యూరిటీ ఆఫీసర్ గారు నిరాకరించారని తెలిసింది. దీనికి ఈవో గారు కూడా ఏమీ చేయలేనన్నారు. రథ ప్రారంభోత్సవాన్ని ఎస్.వి.డైరీ ఫామ్ లోనే ఏర్పాటు చేసుకోండని చెప్పారు. కాని నాకు ఈ రథం ప్రారంభించిన తరువాత కొండపై స్వామి గుడి చుట్టూ బస్సు రూటులో ఒక ప్రదక్షిణ చేయాలనే కోరిక బలంగా ఉన్నది. ఇది నెరవేరదని చాలా బాధపడ్డాను. దుఃఖమొచ్చింది. చేయునది లేక స్వామివారిని వేడుకున్నాను. దుఃఖముతో కాళ్ళు చేతులు వణికాయి. సర్వము కోల్పోయినట్లు బాధ కలిగింది. గత కొన్ని రోజుల క్రితం రథం సరైన సమయానికి తయారు కాదేమోనని చాలా బాధపడ్డాను. మనోవేదన అనుభవించాను. అందువల్ల నా షుగర్ పెరిగింది. చివరికి రథాన్ని పూర్తి చేసి తిరుపతికి తెచ్చిన తరువాత స్వామి చెంతకు అనుమతి నిరాకరించారు. నా కష్టం వ్యర్థమైందనే బాధ దహించి వేసింది. చేసేది లేక స్వామివారిని వేడుకుంటూ ఉన్నాను. అంతా ఆయన దయ. నేను చేయాల్సింది చేశాను, పిదప నీ దయ ప్రభూ అని అనుకున్నాను. నాకు తెలిసిన టిటిడి అధికారులను సహాయము చేయమని ఆర్తితో వేడుకున్నాను. ఎవ్వరూ ఏమీ చేయలేమన్నారు. ఈమధ్యన డైరీఫాం డైరెక్టర్ గా డా॥ కొండారెడ్డి గారు రిటైర్ కాగా వారి స్థానములో డా॥ కె.హరనాథ్ రెడ్డి గారు నియమితులైనారు. వీరు కూడా ఈ విషయంలో ఏమీ చేయలేనన్నారు. చివరికి ఒక ఆశతో సాయంత్రం 4 గంటలకు ఈ.వో గారి ఆఫీసుకు వెళ్ళి వారిని కలిశాను. ఈ.వో శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు కూడా సెక్యూరిటీ ఆఫీసర్ ఒప్పుకోనందున తను ఏమీ చేయలేనన్నారు. నేను ఈ.వో ఛాంబర్ లో ఆయన ముందు కూర్చున్నాను. ఆయన నా వైపు చూస్తున్నారు. ఈ.వో వెనకాల గోడకు పెద్ద శ్రీవారి ఫోటో ఒకటి ఉంది. నేను ఆ ఫోటో వైపు చూచుచు, అంతరంగాన ఆయనకు నమస్కరించుచు ఈ.వోతో మాట్లాడాను. నేను దాదాపు 9-10 నెలలు రాత్రింబవళ్ళు ఎంతో కష్టపడి ఈ రథాన్ని తయారు చేశామని, దయతో అనుమతించమని అడిగాను. నా కళ్ళలో నీరు సుడులు తిరిగాయి. ఒక్కసారి భోరుమని గట్టిగా అరుస్తూ ఏడవాలనిపించింది. చివరికి నా కళ్ళనుండి వచ్చు నీరును చూచిన ఈ.వో గారు జాలితో చూద్దాం అన్నారు. కొండపైకి ప్రైవేటు హోటల్స్ వారి లారీలు వెళ్ళుచున్నవి. ఇది వెళితే తప్పేంటని అడిగాను. మేము దీనిని సుమారు 9-10 నెలలు కష్టించి చేశాము. పైగా బస్ రూట్ లో కొండపై స్వామిచుట్టూ తిప్పుదుమని మళ్ళీ అడిగాను. అయితే ఈసారి బస్సు రూట్ లో అయితే సరే అన్నట్లు అన్నారు. మరియు ఈ ప్రారంభోత్సవాన్ని అలిపిరి పాదాల మండపము వద్ద చేసుకొమ్మని చెప్పారు. నా ప్రార్థన ప్రకారం ఈ.వో గారు స్వయంగా పాదాల మండపము వద్దకు వచ్చి ప్రారంభించెదనన్నారు. దీనిని కన్ఫర్మ్ చేయుటకు నా సెల్ నెంబర్ తీసుకున్నారు. చివరికి నేను ఈ.వో గారికి నమస్కరించి అక్కడినుండి వెళ్ళిపోయాను. నేను నా స్వామివారిని అత్యంత ఆతురతతో ప్రార్థించాను. రథం కొండ పైకి అనుమతించనందున సర్వం కోల్పోయిన వాడిగా అనుభూతి చెందాను. శరీరం మొత్తం నిస్సత్తువ ఆవహించింది. నా కష్టం వృధా పోయిందని బాధపడసాగాను. ఇంతలో దాదాపు సాయంత్రం 6 గంటల ప్రాంతమున ఈ.వో గారు స్వయంగా నాకు ఫోన్ చేశారు. కొండపై స్వామి చుట్టూ రథమును త్రిప్పుటకు అంటే రథంతో ప్రదక్షిణ చేయుటకు ఒక అనుమతి, మరియు అలిపిరి పాదాల మండపము వద్ద ప్రారంభోత్సవము చేసుకొనుటకు మరో అనుమతి ఇచ్చారు. వారు స్వయంగా వచ్చి ప్రారంభిస్తామని అన్నారు. దీనితో నా మనస్సు కుదుటపడ్డది. శాంతి లభించింది. స్వామివారికి శతకోటి నమస్కారములు చేశాను. ఈ విషయం నా భార్య విని ఎంతో సంతోషించింది. ఆమె ఈ రథమును స్వామివారి పాదాలకి సమర్పించుదునని తేది

09-08-04 నాడు, రథం హైదరాబాద్ నుండి బయలుదేరు సమయాన మనస్సులో అనుకున్నదట. ఇప్పుడు ఈ విషయం విని చాలా సంతోషించింది. ఈ విధంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఈ రథాన్ని తన పాదాల వరకు మాత్రమే అనుమతించాడు. (ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుండి రథయాత్ర చేసి పాదాల మండపము చేరుట ఆనవాయితీగా మారింది)

తెల్లవారి తేది 11-08-04 నాడు ఉదయం సుమారు 8 గంటల ప్రాంతమున శ్రీవారి పాదాల మండపము వద్దకు ఈ రథమును తీసుకుపోయాము. టిటిడి వారే ఈ రథమును పూలతో చక్కగా అలంకరించారు. నేను నాలుగు మూర్తుల వద్ద కొబ్బరికాయ కొట్టిన తరువాత శిల్పి శ్రీమాన్ సెల్వకుమార్ గారు నాలుగు స్వామివార్ల మూర్తులకు 9.30 గంటల ప్రాంతమున నేత్రాలను తెరచాడు. చివరికి ఈ.వో గారు 11 గంటలకు వచ్చారు. రావటంతోనే ఈ రథమును చూచి ఎక్సలెంట్ అని ఒకే ఒక మాట అన్నారు. తరువాత బ్రాహ్మణులు పూజలు జరుపుచుండగా, ఈ.వో శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు నాలుగు ముఖములను ప్రారంభించారు. నాలుగు వైపుల సమర్పణ క్రతువులను వ్రాసి శంకులలో సమర్పించారు. ఈ.వో గారు ఎంతో సంతోషించారు. స్వామి స్మరణకు, ప్రచారానికి ఎంతో బాగుందన్నారు. పెద్ద పెద్ద పీఠాధిపతులు చేయలేని పనిని చేస్తున్నావన్నారు. అక్కడికి వచ్చిన ప్రతి దేవస్థానపు అధికారులు మెచ్చుకున్నారు. వారు దీనిని స్వామివారి బంగారు రథం అని పేరు పెట్టారు. స్వామివారి భక్తి ప్రపంచంలో నూతన ఘట్టం అన్నారు. ఇక ఈ రథం వద్దకు వచ్చి ప్రార్థించిన ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించమని స్వామివారిని వేడుకున్నాను. అక్కడ ఈ.వో గారితో దిగిన ఒక ఫొటోతో పాటు మొత్తం విషయం 12-08-04 నాడు వార్తా దినపత్రికలో రాష్ట్రం మొత్తం ప్రచురితమైంది. దీనిని స్వామివారి ప్రచార రథంగా వర్ణించారు.

ప్రారంభోత్సవం తరువాత రథాన్ని కొండపైకి తీసుకెళ్ళాము. కొండపైకి అప్పటికే మాకోసం ఎదురు చూస్తున్న కొన్ని భజన సంఘాల వారితో కలిసి భజన చేసుకుంటూ స్వామి గుడి చుట్టూ రథంతో ప్రదక్షిణ చేశాము. తర్వాత స్వామిని దర్శించుకుని





చివరికి సాయంత్రానికి తిరిగి కొండ క్రిందికి వచ్చాము.

ఇది నా జీవితంలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన రోజుగా నాది నేను వర్ణించుకున్నాను. స్వామి సేవలో ఇది ఒక మైలురాయిగా ఊహించుకున్నాను. నా జీవితంలో స్వామి సేవలో అత్యంత తృప్తిని కలిగించింది ఈ రథమే. ఈ జీవితంలో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా స్వామిసేవలో అలసిపోవాలన్న నా కోరికను తీర్చింది ఈ సేవనే. తిరుమల స్వామివారిని తీసుకొని ప్రతి సంవత్సరం 25 రోజులు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, చెన్నై మొదలగు వివిధ ప్రాంతాలు తిప్పే భాగ్యాన్ని ప్రసాదించింది ఈ సేవనే. ఎంతోమంది భక్తుల ఇంటి, వీధి వద్దకు తీసుకెళ్ళే భాగ్యాన్ని ప్రసాదించింది ఈ సేవనే. ప్రతి సంవత్సరం, రథయాత్ర ప్రారంభించాలన్న ఆలోచన వచ్చినప్పటి నుండి మొదలుకొని 25 రోజులు పూర్తి రథయాత్ర చేసి స్వామివారిని దర్శించుకొని ఆయన ప్రసాదమును తినేంతవరకు ఏదో ఒక రకమైన స్వామివారి గురించిన తపన చెందుతూనే ఉండేవాణ్ణి. ఎంత తపన చెందితే చివరికి అంత ఆనందం కలిగించేవాడు.

**నా దశ :** హబ్సిగూడ కాకతీయ నగర్ లో నాకు ఒక ఇల్లుని ప్రసాదించుచున్నారని చెప్పారు. భూ సమస్యలను పట్టించుకోవద్దన్నారు. రథయాత్రకు విధి విధానాలు ఏర్పరచారు. నమో వేంకటేశాయ రథ ప్రారంభోత్సవం ఎంతో ఆనందంగా జరిగింది.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన. **(సశేషం)**

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్.**


**ఫోన్: 040-27175050**

**Visit: www.srivenkatesham.org**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# హరిహర స్వరూపం

– మందరపు
వి.జి.శంకరాచారి

**హరిహరులు...**

శివకేశవులు... ఇద్దరు కాదు. ఒక్కరే. ఇరువురిగా కనబడుతున్న ఒకే ఒక దివ్య భవ్య స్వరూపం.

పార్వతీదేవి కన్నా ముందుగా ఈశ్వరుడిలో అర్ధభాగాన్ని తన యొక్క అకుంఠిత భక్తితో సంపాదించుకున్నవాడు.. వైకుంఠ వాసుడైన శ్రీహరి. అటువంటి శ్రీహరికి సాక్షాత్తూ సోదరి పార్వతీదేవి (నారాయణ అంటే అన్నగారు, నారాయణి అంటే సోదరి).

అన్నగారైన శ్రీమహావిష్ణువు పరమశివుడిలో అర్ధభాగాన్ని పొందినట్లుగా తనుకూడా తన పతియైన ఈశ్వరుడిలో సగభాగాన్ని పొందాలని తలపోసింది అమ్మవారు. ఏవిధంగా తన అన్నగారు పరమశివుడిలో అర్ధభాగాన్ని పొందారో... అందుకొరకు తనయొక్క భక్తిని ఏవిధంగా వ్యక్తం చేశారో... ఏవిధంగా స్తోత్రాలతో స్తుతించి పరమశివుడి అనుగ్రహానికి కారకులయ్యారో తెలుసుకోవాలని అమ్మవారు ఒకసారి వైకుంఠమునకు వెళ్ళి అక్కడ ఉన్న శ్రీమహావిష్ణువుతో తన యొక్క కోర్కెను వెలిబుచ్చుతూ ఇలా అంది.

“అన్నగారికి... మీ సోదరియైన పార్వతీదేవి నమస్కారములు. సోదరా... నా పతిదేవుడిలో సగభాగాన్ని నీవు ఏవిధంగా సంపాదించుకోగలిగావు. అందుకొరకు ఏవిధంగా స్తుతించావు... ఏ స్తోత్రాలను పఠించి పరమశివుడి అనుగ్రహానికి పాత్రుడవైనావు... నాకు కూడా నా పతిదేవుని అనుగ్రహం కలుగవలెనంటే ఏమి చేయాలి.

ఆయన శరీరంలో సగభాగంగా నేను కూడా మిళితమవ్వాలి.

ఇదే నా కోరిక అన్నయ్యా... కాబట్టి నాకు దివ్యమైన భవ్యమైన సలహాను ఇచ్చి నా కోర్కె నెరవేరినట్లుగా చేయవలసింది'' అని విష్ణుమూర్తిని ప్రార్థిస్తుంది.

అందుకు శ్రీహరి ''సోదరీ! నేను మీ ఆయనలో సగభాగంగా మారడానికి కారణం... నీ పతిదేవుని కరుణాపూరితమైన భిక్షయే తల్లీ...

సృష్టి ఆదిలో పరమశివుని వ్యాపకత్వం తెలుసుకోవడానికి వరాహావతారుడినై అతడి పాదము ఎంతవరకు వ్యాపించిందోనని అన్వేషించాను. అయితే ఆ అన్వేషణలో నేను గ్రహించినది ఏమిటంటే విశ్వమంతా నిండియున్న పరమేశ్వరుడి అంతు తెలుసుకోలేకపోయాను. ఇదే విషయాన్ని ఈశ్వరుడి ముందు ఒప్పుకున్నాను. కానీ హంసరూపుడైన విధాత... ఈశ్వరుడి ముఖభాగం నుండి పైకిపోయి ఆ ముఖం యొక్క అంతం ఎక్కడ ఆగిందో దానిని నేను చూశానంటూ అసత్యమాడాడు. ఈ కారణం వలననే పంచముఖుడైన బ్రహ్మ – పరమశివుడి ఆగ్రహానికి గురై ఒక ముఖాన్ని ఈశ్వరుడి గోటితో పోగొట్టుకొని చతుర్ముఖ బ్రహ్మగా మిగిలాడు.

ఆవిధంగా పరమశివుడి ఆది... అంతాలను చూస్తానని బ్రహ్మ ఒకదిక్కుగా (ఈశ్వరుడి ముఖం వైపు హంసరూపుడై పయనించి) నేను వరాహరూపాన్ని ధరించి పరమేశ్వరుడి పాదాల వెంట పయనించి ఆది... అంతాలను తెలుసుకోలేకపోయాను.

ఈ స్థితిలో పరమశివుడి విశ్వవ్యాపకత్వాన్ని గుర్తెరిగిన నేను



ఆయనకు భక్తుడిగా మారిపోయాను. స్థితికర్తగా స్థానమిచ్చిన నాకు, లయకారుడైన నీ పతిలో సగభాగాన్ని పొందాలనే కోరిక కలిగింది. అందుకే భక్తితో... అనురక్తితో... మహదేవుణ్ణి ప్రసన్నం చేసుకోవాలని... తపించి... తపించి ఆయన అనుగ్రహం కొరకు తపస్సే చేశాను.

ఒకనాడు నా భక్తికి మెచ్చిన పరమశివుడు ప్రత్యక్షమై... నా కోరిక తీరవలెనంటే ఏవిధంగా తనను స్తుతించి ప్రసన్నం చేసుకోవాలో అందుకు సంబంధించిన అష్టోత్తర నామములతో కూడిన స్తోత్రమును (ఇది చాలా రహస్యమైనది. ఎవరికో తప్ప అందరికీ చెప్పదగినది కాదు) చెప్పడం జరిగింది.

ఆవిధంగా పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకున్న నేను వెయ్యి (1000) నామములతో అర్చించడం మొదలుపెట్టాను. ఇందుకొరకు 1000 తామర పువ్వులను లెక్కగా పెట్టుకొని ఒక్కొక్క పుష్పంతో ఈశ్వరుణ్ణి స్తుతిస్తూ పూజ చేయసాగాను.

నేను లెక్కగా పెట్టుకున్న వేయి పుష్పాలతో, తొమ్మిది వందల తొంభై తొమ్మిది నామములు పూర్తయి... వెయ్యవ నామాన్ని పలుకుదామనేసరికి పుష్పం లేకుండా పోయింది. అప్పుడు నేను అది శివ మాయయని గ్రహించగలిగాను.

వెంటనే నా కుడికన్ను ఒకటి పెకిలించి (విష్ణుమూర్తి నేత్రాలను తామరపువ్వులుగా చెబుతారు) వెయ్యవ పుష్పంగా సమర్పించి... పరమశివుణ్ణి స్తుతించాను. అప్పుడు మంగళకరుడైన పరమశివుడు ప్రత్యక్షమై...

శ్రీమన్నారాయణా! నీయొక్క ఆంతర్యమును గ్రహించాను. నేటినుండి నీవు నాయొక్క ఎడమభాగంలో ప్రవేశించి నా శరీరంలో అర్ధభాగాన్ని పొందుదువు గాక. నేటినుండి నీకు నాకు భేదం లేదు. హరిహరులు ఇద్దరూ ఒక్కరే. ఎటువంటి భేదభావం లేక భక్తితో నిన్ను స్తుతించినా లేక నన్ను స్తుతించినా ఒక్కటే.

ఈ రహస్యం తెలుసుకుని భూలోక ప్రజలు ఏకత్వభావంతో పూజిస్తే వారికి ముక్తిని, కైలాస ప్రాప్తిని అనుగ్రహిస్తాను'' అని చెప్పి తన శరీరంలో అర్ధభాగమును అనుగ్రహించాడు.

అలా తను ఏవిధంగా పరమశివుడిలో సగభాగాన్ని పొందినది వివరించి చెప్పాడు శ్రీమన్నారాయణుడు.

పరమేశ్వరుడు తనకు ఉపదేశించిన అతి రహస్యమైన ఆ అష్టోత్తర నామములను పార్వతీదేవికి అనుగ్రహించి అర్ధనారీశ్వర స్థితిని పొందమని ఆశీస్సులు అందజేశాడు. తదనంతరం పార్వతీదేవి పరమేశ్వరుణ్ణి భక్తితో ప్రార్థించి సదాశివుడిలో సగభాగాన్ని పొందడం జరిగింది.

**(పరమశివుడిని సదాశివుడి అంశగా చెబుతారు. సదాశివుడు అను పదమునకు అర్థమేమనగా అన్నివేళలా, అన్నికాలాలయందు, విశ్వచైతన్యంతో నిండి ఉండేవాడు సదాశివుడు మాత్రమే. అటువంటి సదాశివుడిలో సగభాగాన్ని పొంది పార్వతీ పరమేశ్వరులయ్యారు. ఆది దంపతులయ్యారు).**



# మహత్తర శివమంత్రం

## ప్రణవ పంచాక్షరీ మంత్రం

చిల్లర సీతారామారావు

ప్రణవము అనగా ప్రస్తుతిని అందుకొనడం అని అర్థం. సమస్త విద్యలకు మూలమైన బీజమే ప్రణవము. తృణము మొదలు బ్రహ్మ పర్యంతము గల జీవకోటి సమస్తానికి ప్రాణము వంటిది కావడం చేత ప్రణవము అని పిలవబడుతున్నది. ప్ర, నవం అను రెండు శబ్దముల కలయిక ప్రణవము. ప్ర అనగా ప్రకృతి నుంచి జన్మించిన సంసారము అనే సముద్రము. నవం అనగా సముద్రమును దాటించేవాడు అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో || ప్రోహి ప్రకృతి జాతస్య సంసార స్స మహా దధేః**
**నవం నావాంతరమితి ప్రణవం వై విదుర్బుధాః"**

మోక్షము వైపు తీసుకునిపోయేది ప్రణవము. ఇది రెండు రకాలు. ఒకటి స్థూలము. రెండవది సూక్ష్మము. స్థూలము అంటే అయిదు అక్షరములు గలది. సూక్ష్మము అంటే ఒక్కటే అక్షరము గలది. 'నమఃశివాయ' అను అయిదు అక్షరములు స్థూలము. ఒక అక్షరమైన 'ఓం' సూక్ష్మము. 'ఓం' కారము నిరాకార పరబ్రహ్మానికి సంకేతము. మరల ప్రణవము రెండు రకాలు. మొదటిది హ్రస్వము. రెండవది దీర్ఘము.

**శ్లో || "అకారశ్చ ఉకారశ్చ మకారశ్చ తతః పరమ్**
**బిందునాదయుతం తద్ధి శబ్దకాల కలాన్వితమ్"**
**"దీర్ఘ ప్రణవమేవం హి యోగినామేవ హృద్గతమ్**
**మకారం తంత్రి తత్త్వం హి హ్రస్వ ప్రణవ ఉచ్యతే"**
**"శివః శక్తి యోరైక్యం మకారంతు త్రికాత్మకం**
**హ్రస్వమేవం హి జాప్యం స్సాత్సర్వ పాపక్ష యైహిణామ్"**

అకారము, ఉకారము, మకారము, బిందునాదము, శబ్దము, కాలము, కల – వీటితో కూడిన ప్రణవమును దీర్ఘ ప్రణవము అని అంటారు. అ, ఉ, మ – అను మూడు తత్త్వములతో కూడియున్న దానిని హ్రస్వ ప్రణవము అని అంటారు. దీర్ఘ ప్రణవము యోగుల హృదయములలో ఉంటుంది.

అ – శివుడు, ఉ – శక్తి, మ – శివ శక్తుల కలయిక. వీరి ఐక్యత శుభములను కల్గిస్తుంది. అందువలన భవబంధముల నుండి విముక్తిని వాంఛించువారు హ్రస్వ ప్రణవమును జపిస్తారు. కాశీపురిలో అవసాన దశలో ఉన్నవారికి పరమేశ్వరుడు

బోధించేదీ ప్రణవ మంత్రమునే అని ప్రజల నమ్మకము.

ప్రణవమునే 'ఓం'కారమని అంటారు. అ, ఉ, మ అను బీజాక్షరముల కలయిక చేత వచ్చిన ధ్వనియే 'ఓం'కారము. ఓం కారము నుండి సప్త వ్యాహృత్తులు ఉత్పన్నమయ్యాయి. భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యః – అనునవి సప్తవ్యాహృత్తులు. ఈ సప్తవ్యాహృత్తుల నుండియే గాయత్రీ, గాయత్రీనుండియే మంత్రరూపమైన చతుర్వేదములు ఉత్పన్నమైనట్లు శాస్త్రములు పేర్కొంటున్నాయి. ప్రణవము నుండే పంచాక్షరీ మంత్రము ప్రభవించింది. పంచాక్షరి నుంచి త్రిపాదగాయత్రి, అందులోనుంచి సర్వవేద సారస్వతం ఆవిర్భవించాయి. మంత్రాలు ఉత్పన్నమయ్యాయి. ఒక్కొక్క మంత్రారాధన వలన దానికి చెందిన కోరికలు మాత్రమే పరిపూర్ణమవుతాయి. అన్ని మంత్రాలూ భోగప్రదాతలే. పంచాక్షరీ మంత్రము ఒక్కటే భోగాలతో పాటు మోక్షమును కూడా ప్రసాదించగల ఏకైక మంత్రము.

**శ్లో || పంచాక్షరస్య మహాత్మ్యం వర్షకోటి శతైరపి**
**అశక్యం నిస్తరాద్వయుక్తం తస్మోత్సం క్షేపతః శృణు"**

పంచాక్షరీ మంత్రము చాలా విశిష్టమైన మంత్రము. పంచాక్షరీ మంత్రము యొక్క మహిమను విపులముగా, సంపూర్ణముగా, వందకోటి సంవత్సరాల కాలంలోనైననూ వర్ణించడము సులభము కాదు అని ఉపమన్యుడు పంచాక్షరీ మహాత్మ్యమును వివరిస్తూ శ్రీకృష్ణుడితో అన్నాడు. పంచాక్షరీ మంత్రమునందు అల్పమైన అక్షరములు ఉన్ననూ, గొప్ప అర్థమును కలిగించునవి. ఈ అక్షరములలో వేదసారము ఇమిడి ఉన్నది. ఈ అక్షరములు మోక్షమును ప్రసాదించునవి. శివాజ్ఞచే సిద్ధమైనవి. సంశయ రహితమైనవి. రచనాత్మకమైనవి అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో || అల్పాక్షరం మహార్థంచ – వేదసారం విముక్తిదం**
**ఆజ్ఞాసిద్ధమ సందిగ్ధం వాక్యమే తచ్ఛివాత్మకమ్"**

సంసార బంధనములలో చిక్కుకొని యమయాతనలు పడుతున్న దేహధారుల హితమును గోరి శివుడు ఓం నమః శివాయ అను మంత్రమును ఉపదేశించాడు. ఈ మంత్రమునందు 'ఓం'కారము పరబ్రహ్మస్వరూపము. 'న'కారము పృథ్వి, బ్రహ్మ. 'మ' కారము జలము, విష్ణువు. 'శి'కారము తేజస్సు, మహేశ్వరుడు. 'వ'కారము వాయువు, జీవుడు. 'య'కారము ఆకాశము, దైవము. ఈవిధముగా ఈ మంత్రము పంచభూతములను, బ్రహ్మాది మూర్తులను సూచించుచున్నది. ఈ మంత్రమునందు 'నమః' అను పదమునకు జీవాత్మ, శివ అను పదమునకు పరమాత్మ, 'ఆయ' అను పదమునకు ఐక్యము అను అర్థములు ఉన్నాయి. అనగా జీవాత్మ పరమాత్మ యందు ఐక్యము పొందును అని అర్థము. ఓం నమః శివాయ అనునది షడక్షరీ మంత్రము. ఓం కార రహితమైన నమఃశివాయ అనునదీ పంచాక్షరీ మంత్రము. ఓంకార స్వరూపమే అనంతకోటి సృష్టికి మూలకారణము.

మనస్సు చంచలమై అల్లకల్లోలముగా నున్నప్పుడు, ఆ మనస్సును ఏకాగ్ర పరచుటకు జపము ఎంతగానో ఉపయోగపడుతుంది.

**శ్లో || "జకారో జన్మవిచ్ఛేదః సకారో పాపనాశనః**
**జన్మపాప వినాశిత్వాత జప ఇత్య భిధీయతే"**

'జప' యను శబ్దము నందలి 'జ' జన్మ విచ్ఛేదనము చేయునది. 'ప' పాపములను నాశనము చేయునది. గావున జపము అను పేరు కలిగినది. శివనామ జపము వలన లభించు ఫలమును వివరించడం ఎవ్వరివలననూ సాధ్యము కాదు. మంత్ర జపమునకు దీక్ష, హోమము, సంస్కారము, తర్పణము, సమయము, శుద్ధి, గురూపదేశము మున్నగునవి అవసరము లేదు. శివనామ స్మరణము, జపము పుణ్యప్రదము. ఎవరు ఎంతగా శివనామమును స్మరిస్తారో, జపిస్తారో అంతగా వారు ఉద్ధరింపబడతారు. శివనామ జపమును పదిలక్షల మార్లు గావించినట్లయితే సర్వార్థ సిద్ధి ప్రాప్తిస్తుంది. అయిదు లక్షలు శివపంచాక్షరీ జపము గావించిన శివుడు ప్రసన్నుడై సాక్షాత్కరిస్తాడు. నాలుగు లక్షల జపము గావించిన స్వప్న సాక్షాత్కారము ప్రాప్తిస్తుంది. మూడు లక్షలు జపము చేసినచో అభీష్టఫలసిద్ధి ప్రాప్తిస్తుంది. రెండు లక్షలు జపము చేస్తే సభాగౌరవం లభిస్తుంది. లక్షసార్లు జపం చేస్తే శరీరం పవిత్రత నొందుతుంది.

**శ్లో || "సర్వేషామపి పుణ్యానాం సర్వేషాం శ్రేయసామపి**
**సర్వేషామపి యజ్ఞానాం జపయజ్ఞః పరః స్మృతః"**

సమస్త పుణ్యాలు, శ్రేయస్సు, సమస్త సాధనములు, సమస్త యజ్ఞాలు – వీటికన్నా శివమనామ జప యజ్ఞము సర్వోత్తమము అని స్కాంద పురాణమున పేర్కొనబడింది.

'ఓం నమః శివాయ' అను మంత్రము మంత్రములలోకెల్లా రాజతుల్యమైనది. ఇది సర్వవేదాంత శిరోమణి. సర్వజ్ఞానములకు మూలాధారము. సదానంద పదవిని ఇవ్వగల సామర్థ్యము గలది. మహా పాతకములను నాశనము గావించునది. అజ్ఞానాంధకారము అను సముద్రమును దాటించగల శక్తి గలది. మోక్షమును ప్రసాదించునట్టిది. 'ఓంనమః శివాయ' అను షడక్షరీ మంత్రమును బ్రాహ్మణులు 'నమః శివాయ' అను పంచాక్షరీ మంత్రమును ఇతరులు చివర ఓం ఉండేలా జపించాలి. అనగా నమః శివాయ ఓం అని జపించాలి. స్త్రీలు, శూద్రులు, వర్ణసంకరులు మున్నగువారందరూ పంచాక్షరీ మంత్రమును జపించుటకు అర్హులే. ఈ మంత్రములను జపించువారికి ఇతర మంత్రముల జపములు మున్నగువాటి అవసరము లేదు. భక్తి శ్రద్ధలతో జపించినవారికి స్వర్గ మోక్షములు తప్పక లభిస్తాయి.

★ ★ ★

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా।। పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## ఇంద్రద్యుమ్నోపాఖ్యానము

సూతమహర్షి వేదిక వద్దకు రాగానే, అప్పటికే వచ్చి ఉన్న మునులందరూ లేచి నమస్కరించారు. వ్యాసమహర్షిని స్తుతించి మహర్షి ఆసీనుడు కాగానే మునులు తమ తమ స్థానాల్లో కూర్చుని ఈరోజు గురువుగారు ఏం చెప్పబోతున్నారో అని ఆలోచించసాగారు. సూతమహర్షి వారందరినీ చూస్తూ ''నాయనలారా! ధర్మ కార్యాలను ఆచరిస్తే కలిగే పుణ్యం భోగభాగ్యాలనిస్తూ ఎంతకాలం స్వర్గలోక వాసాన్ని కలగజేస్తుందో అనే విషయం ఇప్పుడు చెప్పుకుందాం'' అని చెప్పడం ప్రారంభించాడు. శ్రోతలందరూ ఆసక్తితో వినసాగారు.

''ఇంద్రద్యుమ్నుడనే మహారాజు తాను చేసిన అనేకానేక పుణ్యకార్యాల వల్ల చాలాకాలం స్వర్గలోకంలో బహువిధ సుఖాలతో సంతోషంతో గడిపాడు. చేసుకున్న పుణ్యం తరిగిపోవడంతో లోకంలో – ఆతని కీర్తి కూడా మాసిపోయింది. అది గమనించిన అమరులు (దేవతలు) 'నీవిక ఇక్కడ ఉండలేవు. ఎందుకంటావేమో! నీవు ఆర్జించిన పుణ్యం నేటితో తరిగిపోయింది' అని అంటూ ఇంద్రద్యుమ్నుని భూలోకంలో పడేటట్లు త్రోసివేశారు.

అప్పుడా మహారాజు – చిరంజీవి అయిన మార్కండేయ మహర్షి వద్దకు వెళ్ళి – ''మహాత్మా! నేను పుణ్యమూర్తినైన ఇంద్రద్యుమ్న మహారాజును. నేను మీకు తెలుసా? నా పేరు ఎప్పుడైనా విన్నారా? తెలిస్తే చెప్పండి. నా కీర్తి మీరెప్పుడైనా, ఎక్కడైనా ఎవరి వల్లనైనా విని ఉంటే చెప్పండి. అది నాకు లాభింప చేస్తుంది. నా పేరు ప్రఖ్యాతులు భూలోకంలో ఉన్నంతకాలం, నా గురించి ప్రజలు ధర్మవర్తనుడనని, ఉత్తముడనని చెప్పుకున్నంతకాలం నేను స్వర్గలోకవాసిగా ఉండగలుగుతానని అమరులు చెప్పారు. నేను ఎవరికీ తెలియనివాడినైతే స్వర్గలోకవాసం లభించదని నన్ను భూమిపైకి పడత్రోశారు. అందుకని అడుగుతున్నాను – మార్కండేయ మహర్షీ! నేను మీకు తెలిసి ఉంటే కనుక చెప్పండి'' అని ఇంద్రద్యుమ్నుడు ఆయన వైపు చూశాడు.

వెంటనే మార్కండేయుడు ''అయ్యా! నిన్ను నేను ఎఱుగను. కాని ఒక విషయం మాత్రం చెప్పగలను. హిమవత్పర్వత శిఖరం దగ్గర 'ప్రావారకర్ణుడు' అనే గుడ్లగూబ నివసిస్తోంది. అది వయసులో నాకంటే కూడా చాలా పెద్దది. ప్రావారకర్ణుడికి నీ గురించి తప్పక తెలిసి ఉండవచ్చు. నీ గురించి ఒకవేళ నాకు తెలియకపోయినా అతడికి తెలుసునేమో. అతడి దగ్గరకు పోతే నీ

సమస్య తీరవచ్చు. మహారాజా! ప్రావార కర్ణుడి వద్దకు వెంటనే వెళ్ళు'' అని సలహా ఇచ్చాడు.

ఒక ముని లేచి ''అయితే మహాత్మా! ఇంద్రద్యుమ్నుడు – ఆ గుడ్లగూబ దగ్గరకు వెళ్ళాడా? తమాషాగా ఉంది. పూర్వకాలంలో పక్షులు, పశువులు మానవులకు ప్రతీకలుగా ఉండేవన్నమాట. వాటికి మనుష్య భాషలు వచ్చు. గుణగణాలలో కూడా మానవులను పోలి ఉండేవి. రాజడిగిన దానికి ప్రావారకర్ణుడు సమాధానం చెప్పే ఉంటాడు''.

నాయనా! ఆ గుడ్లగూబ దగ్గరకు ఇంద్రద్యుమ్నుడు ఒక్కడే వెళ్ళలేదు. మార్కండేయుని కూడా తనతో రమ్మని కోరాడు. అందుకు మార్కండేయుడు ''అయ్యా! నేను వృద్ధుడను. అనారోగ్య కారణంగా ఔషధం సేవించాను. కదలలేకుండా ఉన్నాను. రాలేను'' అని చెప్పడంతో ఇంద్రద్యుమ్నుడేం చేశాడో తెలుసా? వెంటనే అశ్వరూపాన్ని పొంది మార్కండేయుని ఎత్తుకొని గుడ్లగూబ వద్దకు వెళ్ళాడు. మహర్షిని అడిగినట్లే ప్రావారకర్ణుని కూడా అడిగాడు ఇంద్రద్యుమ్నుడు 'నేను నీకు తెలుసా!' అని. ఆ గుడ్లగూబ కొంతసేపు ఆలోచించి ''మహారాజా! నిజంగా నువ్వు నాకు తెలియదు. కాని నాకంటే వయసులో పెద్దదైన ఒక బకం (కొంగ) ఉంది. ఆ కొంగ పేరే 'నాళీకజంఘుడు'. ఇంద్రద్యుమ్నమనే పేరుగల కొలనులో దాని నివాసం. ఆ కొంగకు నీవు తెలిసి ఉండవచ్చు. అక్కడకు వెళ్ళి నాళీకజంఘుని అడిగి తెలుసుకో'' అని చెప్పింది. ఇంద్రద్యుమ్న మహారాజు మార్కండేయ మహర్షితో పాటు గుడ్లగూబను కూడా మోసుకుంటూ నాళీకజంఘుని వద్దకు వెళ్ళాడు. ఆ కొంగకు రాజు తన పేరు చెప్పి 'బకరాజా! నన్ను నీవు ఎరుగుదువా?' అని అడిగాడు. నాళీకజంఘుడు కూడా కొంతసేపు ఆలోచించి, 'రాజా! నువ్వు నాకు తెలియదు. కాని ఒక విషయం చెబుతాను శ్రద్ధగా విను. నాకంటే చాలా పెద్దదైన ఒక తాబేలు ఉంది. దాని పేరు – అకూపారుడు. ఆ తాబేలు కూడా ఈ సరస్సులోనే ఉంటోంది. ఆ కచ్ఛపానికి నీవు తెలిసి ఉండవచ్చు. అడిగి తెలుసుకుందాం' అని ఆ తాబేలును పెద్దగా పిలిచింది. 'కచ్ఛపరాజా! అకూపారా పూజ్యులైనవారు కొందరు ఒక సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి నీవద్దకు వచ్చారు. నీవిక్కడకు వచ్చి వారి అనుమానాన్ని తీర్చు' అని పిలిచింది.

"కొలను వెలువడి చనుదెంచె కూర్మవిభుడు
వారలడిగిఁ రింద్రద్యుమ్న ధారుణీశు
నెఱుగుదే?' యన నదియు నొక్కింత తడవు
తలచికొని కన్నుగవ నశ్రు జలము లొలుక"

**-364 ప – 4వ ఆశ్వాసము – అరణ్య పర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

నాళీజంఘుని పిలుపు వినబడగానే అకూపారుడు (తాబేలు) సరస్సు బయటకు వచ్చి మహారాజును, ఆతనితో ఉన్న కొంగ మొదలైన వాటిని చూసింది. మార్కండేయ మహర్షిని చూసి నమస్కరించింది. నాళీజంఘుడు ఇంద్రద్యుమ్న మహారాజును చూపించి అకూపారునితో 'ఈ మహారాజును నీవెరుగుదువా?' అని ప్రశ్నించాడు. మహారాజును చూస్తూ ఆ తాబేలు కొంతసేపు ఆలోచించింది. ఏదో గుర్తుకురాగా ఆ తాబేలు మెల్లగా దుఃఖించింది. కళ్ళవెంబడి నీళ్ళు కారుతుండగా, గొంతు బొంగురుపోగా వాళ్ళనందరినీ చూస్తూ చెప్పసాగింది తాబేలు. అందరూ కుతూహలంగా తాబేలు చెప్పేది వింటున్నారు.

"అక్కట! నేనెఱుంగనె మహాగుణభూషణు నమ్మహాత్ము న
న్నిక్కడ పెక్కుమాఱులు ననేక భయంబులఁ బొందకుండగా
నక్కటకంబుతోడ తగనాతడు గైకొనికాచెఁ గాదె! పెం
పెక్కిన యన్నరోత్తముని నెన్నటికిన్ మఱవంగ వచ్చునే?"

**-366 ప – 4వ అశ్వాసం – అరణ్యపర్వం – శ్రీమదాంధ్ర మహాభారతము**

''అయ్యో! సకల సద్గుణాలతో విరాజిల్లే ఆ మహాత్ముని, ఆ ఇంద్రద్యుమ్న మహారాజును నేను ఎఱుగకపోవటమేమిటి? ఆ కరుణామయుడు నన్నిక్కడ – అనేక భయాలను పొందకుండా అనేక పర్యాయాలు రక్షించాడు. ఆ విషయాలు మరచిపోవటం నాకు సాధ్యమా? నరోత్తముడైన ఆ మహోన్నతుడి పుణ్యకార్యాలు ఎన్నటికీ మరవరానివి కదా! ఆ ఇంద్రద్యుమ్న మహారాజు నా మదిలో ఎప్పుడూ మసలుతూనే ఉంటాడు. ఆయన ఘనత వేనోళ్ళ పొగడవలసినదే. ఎందుకంతగా చెబుతున్నానంటే – ఆయన జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా నా కళ్ళవెంట కృతజ్ఞతతో నిండిన ఆనంద బాష్పాలు కారుతుంటాయి. మీరెందుకంత ఆశ్చర్యంగా నావైపు చూస్తున్నారు? నేను చెబుతున్న మాటలన్నీ యథార్థాలు.

"అమ్మహాత్ముండు బహువిధ యజ్ఞ దక్షి
ణార్థముగ విప్రవరులకు నర్థి నిచ్చు
గోగణంబుల గొరిజల గ్రొచ్చి యయ్యెఁ
గాదె యీ సరోవరము జగన్నుతముగ"

**-367 ప – 4వ ఆశ్వాసము – అరణ్యపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

మహాత్ముడైన ఇంద్రద్యుమ్న మహారాజు అనేక యజ్ఞాలు చేశాడు. యజ్ఞంలో భాగంగా అసంఖ్యాకమైన గోవులను బ్రాహ్మణోత్తములకు, వేదవేదాంగ విదులకు దక్షిణగా దానం చేశాడు. ఆ మహారాజు ధర్మనిరతికి హద్దులు లేవు. ఆ పుణ్యాత్ముడు దానం చేసిన గోవుల రాపిడి వల్లనే పుణ్యప్రదమైన ఈ సరోవరం ఏర్పడింది. ఈ సరస్సుకు లోకులందరూ వచ్చి స్నానమాచరించి పవిత్రులౌతుంటారు. మీకో విషయం తెలుసా? ఈ సరస్సు పేరు కూడా ఆ మహారాజు పేరు మీదనే 'ఇంద్రద్యుమ్న సరోవరమ'ని ఖ్యాతి చెందింది. అవును. ఈ మహారాజే కదా ఇంద్రద్యుమ్న మహారాజు. నాకు ప్రాణభిక్ష పెట్టి అనేకానేక పర్యాయాలు రక్షించిన నీకు శత సహస్ర నమస్కారాలు'' అని ఆ అకూపారుడు (తాబేలు) ఇంద్రద్యుమ్నుడికి నమస్కరించాడు.

తాబేలు చెపిపన విషయమంతా విన్న దేవతలు సంతృప్తి చెందినవారై విమానం తీసుకొని ఇంద్రద్యుమ్నుడి వద్దకు వచ్చారు. “మహానుభావా! నీవు చేసిన పుణ్య కార్యాల గురించి విన్నాము. నీ త్యాగనిరతికి, యజ్ఞ నిర్వహణకు, నీ దాన వైభవానికి – ఇప్పటికీ మెచ్చుకుంటున్నవారున్నారంటే భూలోకంలో నీ కీర్తి శాశ్వతంగా నిల్చిందనే అర్థం. మహాత్మా! నీకు స్వర్గలోక వాసం స్థిరమయింది. నీవు సంపాదించిన పుణ్యానికి తిరుగులేదు. వచ్చి ఈ దివ్య విమానాన్ని అధిరోహించు. స్వర్గలోకానికి తీసుకొని వెళతాము. ఈ సందర్భంలో నీకు మరో ముఖ్య విషయం చెప్పాలని వుంది. అదేమంటే –

**“తన కీర్తి యెంతకాలము**
**వినబడు నిజ్జగమునందు వెలయగ నందా**
**కను బుణ్యలోక సౌఖ్యం**
**బున నెంతయు నుల్లసిల్లు పురుషుండనఘా!”**

**-369 ప – 4వ ఆశ్వాసం – అరణ్యపర్వం – శ్రీమదాంధ్ర మహాభారతము**

తన కీర్తి ఈ లోకంలో ఎంతకాలం వినబడుతుందో (ఇతరులు తలపోస్తుంటారో) అంతకాలం వరకు మానవుడు, సంపాదించిన పుణ్యం వల్ల స్వర్గలోక సౌఖ్యాలను సంతృప్తిగా అనుభవిస్తాడు. ఎప్పుడైతే ఆతడు సముపార్జించిన పుణ్యం క్షీణిస్తుందో (అంతరిస్తుందో) వెంటనే భూలోకానికి తరమబడతాడు'' అని చెప్పి దేవతలు ఇంద్రద్యుమ్నుని విమానం ఎక్కమని మరోమారు ఆహ్వానించారు.

దేవతల ఆహ్వానాన్ని విన్న ఇంద్రద్యుమ్నుడు తన మనసులోని ఆలోచనను తెలియజేశాడు. “సురలారా! వృద్ధుడైన మార్కండేయ మహర్షిని, ముసలిదైన ఈ గుడ్లగూబను, నాకు సహాయార్థం నాతో ఇక్కడిదాకా తీసుకువచ్చాను. వారిని వారి వారి నివాస స్థానాలలో దించి తిరిగి మీ వద్దకు వస్తాను. నాకందుకు అనుజ్ఞ ఇవ్వండి'' అని చెప్పి వారిని యథాస్థానాలలో దింపి, అశ్వరూపాన్ని విడిచి ఇంద్రద్యుమ్నుడు దేవతల కడకు వచ్చాడు. దేవతలు ప్రీతితో ఇంద్రద్యుమ్నుని విమానం ఎక్కించి, స్వర్గలోకానికి తీసుకువెళ్ళారు.

“మునులారా! ధర్మకార్యాచరణల వల్ల లభించే పుణ్యం మానవుని ఎంత సౌఖ్యవంతుని చేస్తుందో విన్నారు గదా! నీతిమంతమైన మరో ఉపాఖ్యానం చెబుతాను. సావధానులై వినండి'' అనడంతో సూతమహర్షి వైపు కృతజ్ఞతా భావంతో చూశారు మునులందరూ.

## వాయుదేవుడు – బూరుగు చెట్టు

హిమాలయ పర్వతం మీద ఒక పెద్ద బూరుగుచెట్టు ఉంది. ఆ చెట్టు ఎప్పటికాలం నుంచో ఉండటం చేత బాగా ముదురుదై అనేక శాఖలతో చాలా ప్రదేశం ఆక్రమించి ఉన్నది. ఆ చెట్టు మొదలు కూడా చాలా గట్టిగా ఏర్పడింది. చూడటానికా చెట్టు చాలా ఆకర్షణీయంగా ఉంది. ఒకనాడు నారద మహర్షి హిమవంతం మీదగా వెడుతూ ఆ చెట్టును చూసి ఆశ్చర్యపోయాడు. చెట్టుకు దగ్గరగా వెళ్ళి కుతూహలంతో దానితో మాట్లాడసాగాడు.

“ఓ బూరుగుచెట్టూ! నిన్ను చూస్తుంటే నాకొక సందేహం కలిగింది. ఏ చెట్టుకూ లేనంత పొడుగును కలిగి ఉన్నావు. వైశాల్యం చూడబోతే అంతే కనబడకుండా ఉన్నావు. నీ ఎత్తు ఆకాశాన్ని అంటుతోందా! అన్నట్లుంది. అదీకాక ఎన్నో పక్షులకూ, జంతువులకూ ఆశ్రయం కల్పిస్తున్నావు. నీ ఔన్నత్యం చూస్తుంటే నాకు ఎంతో సంతోషంగా ఉంది. కాని, ఏ చెట్టయినా సరే, ఎంత గట్టిదైనా సరే వాయుదేవుడు వీచేగాలికి పడిపోతుంది. నేను మహావృక్షాలనెన్నిటినో చూశాను. అవన్నీ ప్రభంజనుడి (వాయుదేవుడి) ప్రతాపానికి లొంగిపోయినవే. నీవు ఏ కారణం చేత పడిపోకుండా నిలిచి ఉండగలిగావు? పవనుడి తాకిడి నీకు తగలదా?

బూరువా!

**“పవనునకును నీకును బాం**
**ధవము గలదొ? యతడు నిన్ను దయ రక్షింపన్**
**సవినయ వృత్తిని బ్రతికితొ?**
**చెవులకు నింపెసగ నిజము సెప్పుము నాకున్”**

**-384 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

“ఏమిటేమిటి? నీకూ, వాయుదేవుడికీ ఏమైనా చుట్టరికముందా? వాయుదేవుడికి దయ కలిగిందంటే – నీవాయన పట్ల వినయంతో మెలగుతూ, ఆయనను పూజించావా? పవనుని కరుణ వల్లనే ఇంతకాలం బ్రతికి ఉన్నావా? ఓ వృక్షరాజమా! నా చెవులకు సంతోషం కలిగే విధంగా నిజం చెప్పు'' అని నారద మహర్షి అడగగానే బూరుగు చెట్టు ధైర్యంగా చెప్పసాగింది.

“మహర్షిసత్తమా! నీ ప్రశ్న నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

**“అనిన విని బూరువిట్లను**
**‘నలుని బలమస్మదీయమైన బలముతో**
**నెనగా దేర్పడ : విను పదు**
**నెనిమిదియగు నంశమునకు నెనయ దరయగన్”**

**-385 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

బూరుగుచెట్టు చిరునవ్వుతో వాయుదేవుని బలం – నా బలంతో ఎక్కడా దేనితోనూ సాటిరాదంటే నమ్మండి. నారదమునీంద్రా! నిజం చెప్పాలంటే నా బలంలో పదునెనిమిదివ వంతుకు కూడా ఆయన బలం సరిపోదు'' అని ఆ వృక్షం చెప్పగానే – దాని సాహసానికి నారదమహర్షికి కొంచెం ఆశ్చర్యం, కొంచెం కోపం కలిగాయి. “మహాబల సంపన్నుడయిన వాయుదేవుడితోనా

ఈ చెట్టుకు పోటీ! దూదిని, అతి తేలికయిన ఫలితాన్ని అందించే బూరుగుచెట్టెక్కడ? సృష్టినే కదిలించివేసే మహాబలు (వాయుదేవు) డెక్కడ?'' అని అనుకొంటూ – ఆ చెట్టును చూస్తూ నారదుడు –

"అమ్మ చెల్ల! యిట్టులనకుము కొండలు
లోనుగాగ పవను చేనపాస్త
మహిమ గలుగు టెఱుగుమా భూతముల చేష్టి
తములు వాయు వశగతములు కావె?"

**-387 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

''ఆహా! వృక్షమా! ఏమన్నావు? ఏమన్నావు? వాయుదేవుడు నీతో సరిసమానుడు కాలేదని అనకు. పవనుని బలానికి మహా మహా పర్వతాలే ఎగిరిపోతాయని తెలుసుకో. ఆ ధాటికి చెట్ల బలమెంత? వాటి మహిమ ఎంత? అర్థం చేసుకోకుండా మాట్లాడుతున్నావు. ఒక విషయం చెబుతాను విని గ్రహించు. సృష్టిలో ఉన్న సమస్త జీవరాశుల నడకలు, పోకడలు వాయుదేవుని వశంలో ఉండేవే. గాలికి తట్టుకొని శాశ్వతంగా నిలబడగలిగేది ఒక్కటీ లేదు'' అన్న మాటలు వినీ వినడంతోనే బూరుగుచెట్టుకు ఆవేశం ముంచుకొచ్చింది. కోపంతో గొంతు పెద్దది చేసింది. ''అనంతమైన, సువిశాలమైన మూలం (బోదె), చుట్టుప్రక్కల దిగంతాల వరకూ వ్యాపించిన పెద్ద పెద్ద కొమ్మలతో మహావృక్షంగా ఖ్యాతి గడించిన నాతో గనక ఢీ కొడితే, వాయుదేవుడికి ఇప్పటివరకూ ఉన్న ప్రభంజనుడనే పేరు (తన గాలిచేత అన్నిటినీ విఱిచేవాడు) తొలగిపోతుంది'' అని గర్వంతో ఉద్ధృతంగా బూరుగు పలికేటప్పటికి నారదుడికి సహనం నశించింది.

"మఱవకయుండు నీ బిరుదు మాటలు నీ విటులంట మారుతం
డెఱిగెడు నెట్లునంచు వెసనేగి సమస్తముఁ జెప్ప నాతడే
డ్తెఱ చనుదెంచి నీవటు కడింది మగండవు! నిన్ను తాకినన్
జెఱు తటి పేరు? బూరుగ నశించితి గాకిట పల్కు లేటికిన్?"

**-390 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

''వృక్షమా! అహంకారంతో నిండిన నీ పలుకులు నీ గర్వానికి ప్రతీకలు. ఇప్పుడు నీవన్న ఈ బిరుదు మాటలను మఱచిపోకు. నీవన్న మాటలు వాయుదేవుడికి ఎలాగూ తెలుస్తాయి. తెలియవనుకోకు'' అని చెప్పి, నారద మహర్షి దిక్పాలకుడైన వాయుదేవుడి వద్దకు వెళ్ళాడు. పవనుని బలం కన్న తన బలం అత్యధికమని అహంకరించిన బూరుగుచెట్టు అన్న మాటలన్నీ పూస గుచ్చినట్లు చెప్పి ఆ దిక్పతిని కోపోద్రిక్తుని చేశాడు నారదుడు. నారదుడు వెళ్ళిపోగానే వాయుదేవుడు బూరుగు చెట్టు దగ్గరకు వెంటనే వచ్చాడు. వచ్చి ''ఓ బూరుగుచెట్టూ! నీవు మహాబలశాలివా? నీపైకి వస్తే ప్రభంజనుడనే నా పేరు చెరిగిపోతుందా? నిన్ను పడగొట్టలేనంత నీచబలమా నాది?



నీవు చెఱిపితే చెరిగిపోయేదా నా బలం? వృక్షరాజా! ఇలాంటి పిచ్చి పిచ్చి మాటలు పలుకకు. నా మాట వినకుండా ఇంకా ప్రేలావనుకో. చెడిపోతావు సుమా! నీకు హాని చేకూర్చే ఇటువంటి మాటలెందుకంటావు? జాగ్రత్తగా మసలుతుండు. నా మాటలు వినలేదనుకో! నీవు నాశనమైపోతావు'' అని వాయుదేవుడు కోపంతో బూరుగును హెచ్చరించాడు. అయినా ఆ వృక్షం యొక్క బింకం తగ్గలేదు. ధైర్య సాహసాలతో వాయుదేవుడికి ఎదురు తిరిగి మాట్లాడింది.

''వాయుదేవా! నీవు దిక్పతివే. కానీ, అమాయకుడివి. లేకపోతే నా గురించి నీకేం తెలుసని ఇంత గట్టిగా నన్ను కోప్పడుతున్నావు? నీది తెలివి తక్కువతనం కాకపోతే, నన్ను నీవు మందలించే పాటివాడివా? నేను నీవన్నట్లు అంత క్షీణబలుడినా? లేక శక్తిహీనుడినా? భూమిపైన మిగిలిన చెట్లలాగా నన్ను లెక్కవేయకు. నిన్నెదిరించగల వృక్షరాజును నేనొక్కడినే అని తెలుసుకో'' అని గర్వంతో పలుకుతున్న బూరుగుచెట్టు అల్పత్వానికి, చిరునవ్వుతో సమాధానం చెప్పాలని నిశ్చయించాడు ప్రభంజనుడు.

''ఓ వృక్షరాజా! నీవన్నది ఒకరకంగా నిజమే అనుకో. కాని, మరో విషయం కూడా నీవు గుర్తించాలి. అదేమంటే –

"ఒకనాడజుండు నీ నీ
డకు డబ్బాటరుగు దెంచుటకు నమ్మే లా
త్మకు ప్రేగై మన్నించి న
మెక మెక పడితిట్ల పలుకుమీ తగరేపున్"

**-392 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము**

''ఒకనాడు బ్రహ్మదేవుడు నీ చెంతకనుకోకుండా వచ్చాడు. గుర్తుందా? నీ నీడలో కొంతసేపు విశ్రమించాడు. నీవల్ల పొందిన ఉపకారాన్ని పెద్దగా (బరువుగా) భావించి, నిన్నాదరించి, 'కీర్తి పొందుదువు గాక' అని దీవించాడు. దానితో నీవు అహంకరించావు. గొప్పవాడిగా మిడిసిపడ్డావు. రేపు కూడా

నాతో ఈవిధంగానే మాట్లాడు. చూస్తాను – నా ప్రతాపాన్ని రేపు చూద్దువుగాని'' అంటూ వాయుదేవుడు క్రోధంతో వెళ్ళిపోయాడు. వాయుదేవుని కోపంతో నిండిన రూపం చూసి బూరుగుచెట్టు ఎంతగానో భయపడింది. తనను తాను నిందించుకుంది. నిజానికి తన బలం ఎంత అని పశ్చాత్తాప పడింది. అయినా ఏ విధంగానైనా వాయుదేవుని గెలవాలని తలపోసింది. ప్రభంజనుని మాటలు తలచుకుంటే భయం కలుగుతోందని ఒక్క క్షణం పాటు జంకింది'' అని సూతుడు చెప్పటం ఒక్క క్షణం ఆపాడు. ఆ క్షణం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురు చూస్తున్న ఒక ముని లేచి –

''మహాత్మా! వాయుదేవుని అన్నేసి మాటలన్న ఆ వృక్షం భయపడిందంటే ఆశ్చర్యంగా ఉంది. అయినా చెట్టేమిటి? వాయుదేవుడంతటి మహాబలునితో పోటీపడటమేమిటి? తానే గొప్పదానినని అనటమేమిటి? ఎప్పుడూ వినలేదు'' అని అనడంతో సూతమహర్షి ''అక్కడే ఉంది మనం తెలుసుకోవలసిన అంశం'' అని మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు. ''ఎవరికైనా లేనిది ఉన్నదని చెప్పుకోవటం; అంతటితో ఆగక అహంకరించటం చేటు తెస్తుందని గుర్తించకపోవటం నాశనానికే దారి తీస్తుంది. ఇంతకూ ఆ చెట్టు ఏం చేసిందో, ఏమయిందో వినండి'' అన్న సూతుని మాటలతో ఆయన వైపు తదేకంగా చూశారు ఆసక్తితో మునులందరూ.

''అప్పుడా బూరుగుచెట్టు తన జీవితం ఏమైపోతుందో అని బాధపడింది. తన మనుగడ సాగుతుందా, సాగదా అని చింతించింది. నారదమహర్షి అంత గట్టిగా చెప్పినా కూడా వినక అహంకరించానే? తనకు తెలియదా? వాయుదేవుడి ధాటికి తాను నిలవలేనని! మహా భయంకరంగా గాలి తనమీదకు వస్తే తాను ఓర్వలేనని, పడిపోతానని అనుకోవద్దా? తనకసలా గర్వం ఎందుకు కలిగింది? గర్వాన్ని తొలగించుకోవద్దా?'' అని అనుకొంటూనే, మళ్ళీ 'ఆ వాయుదేవుని ఎలా గెలవాలా?' అని ఆలోచించింది. ఒక ఉపాయం తోచగానే సంతృప్తి పడింది. ఈ పని గనక నేను చేస్తే – నేను గెలిచినట్లే. ఆ ప్రభంజనుడు ఓడినట్లే'' అని కాసేపు నవ్వుకొంది ఆ బూరుగుచెట్టు'' అన్నాడు సూతమహర్షి. ''స్వామీ! అయితే బూరుగు నిజంగా వాయుదేవుని ప్రతాపాన్ని ఆపగలిగిందా? అంత గొప్పదా ఆ చెట్టు? లేకపోతే బ్రహ్మదేవుడు ఆ వృక్షాన్ని కాపాడాడా? అంతా వింతగా ఉంది. పవనుడేమిటి? ఒక చెట్టు చేతిలో ఓడిపోవటమేమిటి? అసంభవం'' అని ఒక శ్రోత లేచి తన అనుమానాన్ని వెలిబుచ్చాడు. దానికి చిరునవ్వు నవ్వుతూ సూతముని చెప్పసాగాడు.

''వాయుదేవుని గెలిచి తాను స్థిరంగా నిలవాలని తలపోసిన బూరుగు వెంటనే తనకున్న ఆకులను, చిన్ని చిన్ని కొమ్మలను, ఆకులతో నిండిన గుబుర్లను, చిగుళ్ళను, పొడుగాటి పెద్ద పెద్ద కొమ్మలను – పూర్తిగా రాత్రి అయిందా లేదా అని అటూ ఇటూ చూసి తనకు తానే విరిచేసుకుంది. తాను చేసిన పని ఈ నిశీధిలో ఎవరూ చూడలేదులే అని తృప్తి చెందింది. ఇక ప్రభంజనుడు రేపు వస్తానని చెప్పి వెళ్ళాడు గదా! వచ్చి మాత్రం ఇక తననేం చేయగలడు? మోడును విరిచేస్తాడా? లేదే! దానివల్ల అతడు గెలిచినట్లు కాదు గదా! ఫలభరితమైన నా సంపదనంతటినీ ఛిన్నాభిన్నం చేస్తే – అప్పుడు నేను ఓడినట్లు, ఆతడు గెలిచినట్లు'' అని అనుకొంటూ నిశ్చింతగా మిగిలిన రాత్రంతా నిద్రపోయింది. సూర్యభగవానుడు రానే వచ్చాడు. పూర్తిగా తెల్లవారింది. అన్నమాట ప్రకారం వాయుదేవుడు వస్తుండటం దూరం నుంచి చూసింది బూరుగు. ఇప్పుడు తననా బలశాలి ఏం చేయగలడులే అని నవ్వుకుంది.

**''ప్రతినకు నీడుగా భయద భంగి ప్రభంజనుడేగుదెంచి యా క్షితిరుహమ్ము గనుంగొని 'యిసీ! యిది నాపని నీవ చేసి తీ ధృతిమతి సంతసింపుమిట తేజము పొందుము నీదు బాంధవ ప్రతతికి నివ్విధంబు సదుపాయము మేలెఱిగింపు పెంపునన్''**

–396 ప – తృతీయాశ్వాసము – శాంతిపర్వము – శ్రీమదాంధ్ర మహాభారతము

''తాను చేసిన ప్రతిజ్ఞ ప్రకారము భయాన్ని కల్పిస్తూ ప్రభంజనుడు తీవ్రాతి తీవ్రమైన గాలిని ప్రసరింపజేస్తూ బూరుగుచెట్టును సమీపించాడు. ఆ వృక్షరాజును క్రిందినుంచి పైదాకా ఎగాదిగా చూశాడు. మోడుగా ఉన్న చెట్టును చూసి హాయిగా నవ్వాడు. 'ఛీ! ఛీ! వృక్షరాజా! ఇంత సిగ్గుచేటు పని ఎందుకు చేశావు? నేను చేయాల్సిన పని నీవు చేశావా? ధైర్యంతో ఇంత గొప్ప పనిని చేశావని నీవు సంతోషపడాల్సిందే! నీవు చేసిన పని నీకు గెలుపు నిచ్చిందని భావిస్తున్నావా? లేదు. నాకు భయపడి నీకు నీవే ఫలాది నీ ఐశ్వర్యాన్ని పాడు చేసుకున్నావు. నీ అందాన్ని చెడగొట్టుకున్నావు. ఎందుకూ పనికిరాని మోడుగా నిలిచావు. నీ ఆలోచనకు, కార్యసిద్ధికి నీవే గర్వపడాలి! ఇంకో విషయం. నీ చుట్టాలందరికీ నీవు సాధించిన ఘనతను తెలియజెప్పి, వాళ్ళను కూడా ఈ మార్గంలోనే నడవమని, అందువల్ల మేలు కలుగుతుందనీ చెప్పు. సంతోషిస్తారు. నేను విధ్వంసం చేయకుండా, ఎవరో వచ్చి తెగనరకకుండా మీకు మీరే ధ్వంసం చేసుకుంటే – అంతకంటే కావల్సిందేముటుంది? ఆ పని చేయండి' అంటూ, పరిహాసిస్తూ వాయుదేవుడు వెళ్ళిపోయాడు'' అని సూతమహర్షి క్షణం ఆగాడు.

''మునులారా! తెలుసుకున్నారు గదా! బలశాలితో నిర్బలుడు పగ వహించినా, మత్సర గ్రస్తుడై ఎదిరించినా ఆ బలహీనుడికి దక్కేది అపజయం, అవమానం, వల్లమాలిన దుఃఖం. వైభవాన్ని అంతా కోల్పోయి మోడులాగా జీవితాన్ని నిరర్థకంగా గడపాల్సి ఉంటుంది'' అని సూతమహర్షి వేదిక దిగి ఆశ్రమానికి నడవసాగాడు. మునులందరూ గురువుగారిని అనుసరిస్తూ అడుగులు వేశారు.

**(సశేషం)**

# హోలీ పండుగ

– డా|| మరుదాడు అహల్యాదేవి

(25-03-2024)



జీవితం రంగుల హరివిల్లు. జీవితం రంగులమయం. ఈ జీవితాన్ని సౌందర్యమయం చేసే పండుగ హోలీ. ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసంలో పూర్ణిమ నాడు యావద్భారతదేశం ఆనందోత్సాహాలతో జరుపుకునే రంగుల పండుగ. ఇది మొదట్లో ఉత్తర భారత దేశంలోనే ఎక్కువ ప్రాచుర్యంలో ఉండేది. ప్రసార మాధ్యమాల ద్వారా ఇది దక్షిణ భారతావనికి వ్యాపించింది.

**హోలీ విశిష్టత**

హోలీ పండుగ రోజు ఉదయం నుంచే అనేక రంగులను నీటిలో కలిపి ఒకరిమీద ఒకరు చల్లుకుంటూ ఆనందించడం కనిపిస్తుంది. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నా ఎవ్వరూ ఎలాంటి కోపతాపాలకూ గురి కాకుండా క్షమాగుణంతో వ్యవహరిస్తారు. ఇదే హోలీ పండుగలోని గొప్పదనం. ఇది వసంతాగమనాన్ని సూచిస్తుంది.

**హోలీ పురాణగాథ**

పూర్వం హోళిక అనే రాక్షసి పిల్లలను పొట్టన పెట్టుకుంటూ ఉండేదిట. ఆ హోళిక రాక్షసి వల్ల ఆ గ్రామంలో అందరూ కడుపు కోతకు గురై శోకిస్తూ ఉండేవారట. చివరకు రోజుకో ఇంటినుండి ఒక శిశువును హోళికకు సమర్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారుట. ఆ ఒప్పందం ప్రకారం ఒక వృద్ధురాలు తన ఒక్కగానొక్క మనవడిని సమర్పించుకోవాల్సి ఉంది. ఆ వృద్ధురాలు ఒక మహర్షికి తన బాధను వివరించుకోగా, ఆయన ఆమెను విచారించవద్దనీ, ఆ రాక్షసి ఒక శాపగ్రస్తురాలనీ, ఆ రాక్షసిని నోటికి వచ్చిన తిట్లు తిడితే అది తీవ్రంగా కలతచెంది ప్రాణాలు విడుస్తుందని చెప్పగా ఆ వృద్ధురాలు ఊళ్ళోకెళ్ళి అందరికీ ఆ విషయం చెప్పుకుందట. ఆ గ్రామంలోని వారందరూ తిట్లతో ఆ రాక్షసిని తీవ్ర మనోవ్యధకు గురిచేసి హోళిక ప్రాణాలు కోల్పోయేటట్లు చేస్తారు. హోళిక బాధనుండి విముక్తి పొందిన ఆ గ్రామప్రజలు సంబరంగా రంగులు చిమ్ముకుంటారనీ, అదే హోలీ పండుగలో ఉన్న రహస్యం అని తెలుస్తోంది.

**డోలికోత్సవం**

ఉత్తర భారత దేశంలో హోలీనే డోలికోత్సవం అని కూడా వ్యవహరిస్తారు. గోపాలకృష్ణుని ఉయ్యాల (డోలిక)లో ఊపి పూజలు చేయడం చేత దీనిని డోలికోత్సవం అంటారు. ఈ సందర్భంలో ఉత్సవంలో ఉత్తర భారత దేశంలో ప్రజలు ఒకరిని ఒకరు తిట్టుకోవడం, రంగులు చల్లుకోవడం, వారకాంతలతో ఊరేగడం, ఒకరిపై ఒకరు దుమ్మును చల్లుకోవడం చేస్తుంటారు. పొరుగు వారి ఇళ్ళలో దూరి పాలు, పెరుగు, భక్ష్యపదార్థాలు దొంగిలించి తినడం కూడా ఒక ఆచారం. అందుకే 'ధుల్లండీ' ఉత్సవం అంటారు. 'ధుల్లండీ' అంటే దుమ్ము చల్లుట. దీనినే డోలికోత్సవం అంటారు.

**కాముని పున్నమి – కామ దహనం**

హోలీ పండుగ ముందురోజు కామదహనం జరుగుతుంది. హోలీకికామునిపున్నమి,మదనపూర్ణిమఅనేపేర్లున్నాయి.పూర్వం సతీదేవి తన తండ్రి అయిన దక్షప్రజాపతి యజ్ఞానికి ఆహ్వానం లేకుండా వెళ్ళగా, దక్షుడు ఆమెను, భర్త అయిన పరమశివుని దూషించుట సహించలేక ఆత్మాహుతి గావించుకుంది. తర్వాత హిమవత్పుత్రికగా, పార్వతిగా అవతరిస్తుంది. సతీ వియోగ దుఃఖితుడైన పరమశివుడు తపస్సులో ఉండగా పార్వతి శివునికి పూజలు, సేవలు చేస్తుంది. చలించని శివుని చూచి దేవతలు పార్వతీ కళ్యాణం చేయదలచి మన్మథుని ఆశ్రయిస్తారు. పువ్వుల విలుకాడైన మన్మథుడు తన మరుల బాణాస్త్రాలను ప్రయోగించి శివుని మనస్సును పార్వతివైపు మళ్ళిస్తాడు. పార్వతీ కళ్యాణం జరుగుతుంది. అయినా తన తపస్సుకు భంగం కల్గించిన మన్మథుణ్ణి శివుడు భస్మం చేస్తాడు. రతీదేవి తనకు జరిగిన అన్యాయానికి దుఃఖితురాలై ఆత్మార్పణ చేయబోగా మన్మథుడు అనంగుడైననూ, దేవతలలో సాకారుడై ఉండగలడనీ వరాన్నిస్తాడు శివుడు. ఇదీ కామదహనం, మదనపూర్ణిమ, హోలీ పండుగ అంతరార్థం. అప్పటినుంచి ప్రజలందరూ ఈ పండుగను రంగుల మయంగా జరుపుకుంటున్నారు.

★★★

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

నీకు అనుక్షణం భయపడేవాడు సుగ్రీవుడు. రాముడు ఒకే బాణంతో చంపాడు నిన్ను. నీ తమ్మునిలో భయం పోయింది. కృతార్థుడైనాడు. నిన్ను కడసారి కౌగిలిద్దామంటే – ఈ బాణం అడ్డగిస్తోంది.

ఆ మాట విన్నాడు నీలుడు. అతడు సుగ్రీవుని సేనాపతి. వాలి దగ్గరికి వెళ్ళాడు. బాణాన్ని పట్టాడు. గట్టిగా లాగాడు. కొండ గుహలో దాగిన పాముని లాగినట్లుగా ఉంది. ఆ గాయం లోంచి రక్తం ఉబికి వచ్చింది. ధారలై పారింది. వాలి అవయవాలన్నీ రక్తంతో తడిశాయి. చేత్తో తడిమింది తార. కౌగిలించుకుంది. వాలి చనిపోయాడు. నిశ్చయించుకుందామె.

పక్కనే ఉన్నాడు అంగదుడు. చూసింది. 'నాయనా అంగదా! చూశావా నీ తండ్రి ముఖం. సూర్యునిలా ప్రకాశించేది. ఇపుడెలా కాంతి హీనమైందో. నాన్నగారికి నమస్కరించు. అన్నదమ్ముల వైరం – ఈరోజుతో ముగిసింది.

'నాన్నా! నేను అంగదుణ్ణి. నీ కొడుకుని – వాలి పాదాలు పట్టుకున్నాడు. తలవంచాడు. నమస్కరించాడు.

'ప్రభూ చూడు. నీ కొడుకు నమస్కరిస్తున్నాడు. దీర్ఘాయుష్మాన్ భవ– ఆశీర్వదించవా? – దుఃఖావేశంతో కుంగిపోయింది తార.

### సుగ్రీవుని వైరాగ్యం

తారను చూశాడు సుగ్రీవుడు. సోదరుని మృతదేహం చూశాడు. కళ్ళు చెమ్మగిల్లాయి. ముఖం వివర్ణమైంది. మనసు కుంగిపోయింది. రాముణ్ణి చూశాడు. ఒక చేతిలో గొప్ప విల్లు వుంది. మరో చేతిలో విషసర్పం లాంటి బాణం వుంది. ఆ పురుషోత్తముని సమీపించాడు. అంటున్నాడు 'నరేంద్రా! నీ ప్రతిజ్ఞ చెల్లించావు. భర్త వియోగంలో వుంది తార. పితృవియోగంలో ఉన్నాడు అంగదుడు. ఇద్దరూ రోదిస్తున్నారు. అంగదుణ్ణి చూస్తే భయంగా ఉంది. వాడు బతికి బట్టకట్టగలడా అనిపిస్తోంది' అన్నాడు.

'సోదరుని చంపాలన్నాను. నీవు ఆ పని చేశావు. నాకు రాజ్యం ఇప్పిస్తానన్నావు. రాజ్యం అక్కర్లేదు. మళ్ళీ ఋష్యమూక పర్వతానికి పోతాను. ఏది దొరికితే అదే తింటాను. చెట్లపై తిరుగుతుంటాను. అదే నాకు మేలు. వాలి ఏమన్నాడో తెలుసా రామా! ఒరేయ్ నిన్ను చంపను పో అన్నాడు. ఆ మాట వాడికే చెల్లు. వాణ్ణి చంపు అన్నాను. ఆ మాట నాకే చెల్లు. ఇందాక చెట్టు కొమ్మతో కొట్టాడు. ఆ దెబ్బ బాగా తగిలింది. అబ్బా అని అరిచాను. నా దగ్గరికి వచ్చాడు. ఓదార్చాడు. ఇక ఇలాంటి పని చేయకు అన్నాడు. వాడెంత వుదారుడో! కాని నాలో కోపం పెరిగింది.

చంపించాను. నాది కోతి బుద్ధి. నేను పాపం చేశాను. రాజ్యం వద్దు. ప్రజల సమ్మానం వద్దు. కులనాశకుణ్ణి. మహాపరాధిని. బంగారంలో మాలిన్యం ఉంటుంది. పుటం పెడితే మాలిన్యం పోతుంది. నా సంతాపాగ్నిలో నా దుర్బుద్ధి తగలబడిపోలేదు. భ్రాతృ వధ జనిత మహాపాపం వెంటాడుతోంది. రామా! నాకు రాజ్యం వద్దు. నేను రాజునైతే అంగదుని గతి ఏమిటి? తార ఏం అవుతుంది? అంగదుడంటే వాలికి ఇష్టం. వాడే రాజు. కానీ వాడికోసం అగ్నిప్రవేశం చేస్తాను. నేను పోయినా – నీ ఆజ్ఞ వానరులు పాటిస్తారు. సీతాన్వేషణ సాగిస్తారు'.

విన్నాడు రాముడు. సుగ్రీవుని బాధను గమనించాడు. ఏడుస్తున్నాడు. చూశాడు. 'ఏకం దుఃఖం సుఖంచనౌ' – అది రామ సుగ్రీవుల మైత్రి. 'వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః' – ప్రజలు కష్టాలపాలై – దుఃఖిస్తుంటే వారి కంటె అధికంగా దుఃఖిస్తాడు రాముడు. అది రాముని కళ్యాణ గుణం. సుగ్రీవుడి ఏడుపు చూశాడు. రామునికి ఏడుపు వచ్చింది. ఏడ్చాడు. అది ఆదర్శమైత్రి. ''రామా నేను పోతాను. వాలిని కల్సుకుంటాను. నేను పోతే అంగదుడు సంతోషిస్తాడు''.

**రాముని పరత్వం**

వాలి పోయాడు. శోక సముద్రంలో మునిగింది తార. ఆమెను చూశాడు రాముడు. ఓదార్చాలనుకున్నాడు. రెండు అడుగులు వేశాడు. అది గమనించారు వానర మంత్రులు. తార దగ్గరికి వెళ్ళారు. ఆమెను లేవదీయబోయారు. ఆమె వాలి కౌగిలి వదల్లేదు. బలవంతాన లేపారు. కూర్చుండబెట్టారు. రాముణ్ణి చూసిందామె. ధనుర్బాణాలు పట్టి ఉన్నాడు. శూరునిలా ఉన్నాడు. రాజలక్షణాలతో ఉన్నాడు. తెల్ల తామర రేకుల్లా ఉన్నాయి కనులు. అతడు రాముడే. పురుషోత్తముడే. గుర్తించింది తార. ఆర్తురాలైంది. దుఃఖంతో కుమిలిపోయింది. నడిచే శక్తి లేదు. అయినా లేచింది. తూలింది. నిలదొక్కుకుంది. అమితవేగంగా నడిచింది. అంగదుడు చెప్పింది ఇతడే. ఒకే బాణంతో కొట్టాడు. నా భర్తని చంపాడు. రక్తం ఉడికింది. కోపం ఎక్కువైంది. పరుషంగా మాట్లాడాలనుకుంది. రామ సన్నిధి చేరింది.

పుండరీకాక్షుని చూసింది. రజోగుణం అణగారింది. మనోమాలిన్యం మాయమైంది. కోపావేశం చల్లబడింది. సత్వగుణం పైకి వచ్చింది. ఎవరిని చూస్తే బాధలు సమసిపోతాయో – ఎవరిని చూస్తే మనసు ప్రశాంతత పొందుతుందో – వారే మహానుభావులు. వారే భగవత్ సమానులు. ఆ రామునిలో పరత్వాన్ని గుర్తించింది. రామతత్వం తెలిసిన స్త్రీలున్నారు. వారిలో తార ఒకతె. అంటోంది.

**త్వమ ప్రమేయశ్చ దురాసదశ్చ జితేంద్రియశ్శోత్తమ ధార్మికశ్చ ।**
**అక్షయ్య కీర్తిశ్చ విచక్షణాశ్చ క్షితిమావాన్ క్షతజోపమక్షః ॥**

''నీవు అప్రమేయుడవు. దురాసదుడవు. జితేంద్రియుడవు. విచక్షణుడవు. ఉత్తమ ధార్మికుడవు. అక్షయ కీర్తిమంతుడవు. భూదేవిలా క్షమావంతుడవు. కనుల్లో ఎర్రజీరలున్నవాడవు. ధర్మరక్షణ కోసం ధనుర్బాణాలు ధరించినవాడవు. మహాబల వంతుడవు. సర్వాంగసుందరుడవు. సర్వసమర్థుడవు. సకల లౌకిక సుఖాలు త్యజించినవాడవు. దివ్యమంగళ విగ్రహుడవు''.

దురాసదుడు అంటే ఇంద్రియాలకు మనసుకు అందనివాడవు అని అర్థం. భక్తిపరులకు అందగలవాడవు అని భావార్థం. ఇంతవరకు తన్ను తాను మరచిపోయింది తార. రాముని దివ్యవైభవ కళ్యాణగుణాల్ని వర్ణించింది. ఇపుడు తన సహజ శోకాన్ని ఆవిష్కరిస్తోంది.

''రామా! నా నాథుని చంపావు. ఒక బాణం తీసుకో. నన్ను కొట్టు. చంపు. నేను నా స్వామిని చేరుతాను. నా భర్త నన్నొదిలి వుండలేడు. సుఖపడలేడు. సంతోషంగా ఉండలేడు. స్వర్గంలో అందమైన అప్సరసలుంటారు. చిత్ర విచిత్రంగా అలంకృతులై ఉంటారు. వాళ్ళని కన్నెత్తి చూడడు. నాకోసమే నిరీక్షిస్తూ వుంటారు. నాకోసమే పరితపిస్తూ ఉంటారు''.

'నీ భార్య విదేహ కన్య సీత. నీ చెంత లేదు. దిగులుపడుతున్నావు. ఆమె కోసం పరితపిస్తున్నావు. అలాగే నేను వాలి సరసన లేకుంటే – ఆ విరహ వేదన నీకు తెల్సు. ఇపుడు నా ఎడబాటు పోగొట్టు. నన్ను చంపు. భర్త చెంతకి చేర్చు. మహాత్మా! నన్ను చంపితే స్త్రీ హత్యాపాపం చుట్టుకోలేదు. భార్యను భర్తకు దానం చేయటం – అది మహాదానం అంటారు. దాన్ని మించింది లేదు. అది జ్ఞానుల అభిప్రాయం. రామా! నన్ను చంపు. నా భర్తకు దానం ఇవ్వు. అది ధర్మసమ్మతమే. పాపం అంటదు. నా పతి గజరాజులా గంభీరంగా నడుస్తాడు. వానరశ్రేష్ఠుడు. బంగారు మాలాధరుడు. ఆ మహాత్మునికి దూరమైతే బతకలేను...' ఏడ్వసాగింది తార.

విన్నాడు రాముడు. ఓదార్పుగా అంటున్నాడు. 'వీరపత్నీ! నీవు విరక్తి చెందకు. సమస్త ప్రాణుల సృష్టికర్త బ్రహ్మ. సుఖ దుఃఖాల్ని చేకూర్చుతాడు ఆయనే. అది పండితులకు తెలుసు. పామరులకి తెలుసు. అది విధి విధానం. ఎవ్వరూ అతిక్రమించలేరు. నీ కొడుకు అంగదుణ్ణి చూడు. వాడికోసం జీవించు. త్వరలో యువరాజు అవుతాడు. వీరపత్నులు విలపించరాదు. అలా ఎన్నో హితవచనాలు చెప్పాడు రాముడు. ఆ మాటలు ఎంతో యుక్తి యుక్తాలు. వినింది తార. ఊరట చెందింది. ముఖంలో సంతృప్తి స్ఫురించింది.

**అంత్యక్రియలు**

తార అంగదుడు సుగ్రీవుడు ఇంకా దుఃఖిస్తున్నారు. అది గుండె లోతుల్లోంచి పొర్లి పొర్లి వస్తోంది. చూశాడు రాముడు. అంటున్నాడు సుగ్రీవునితో. ''బాణం దెబ్బతిన్నాడు వాలి. పశ్చాత్తాపం చెందాడు. పాపం పోయింది. పరిశుద్ధుడైనాడు. యుద్ధంలో చనిపోయాడు. అది వీర మరణం. ఫలం స్వర్గమే. ఇక అతడి కోసం శోకించవద్దు. ఏడిస్తే – మృతశరీరానికి లాభం లేదు. వాలికి దహన క్రియలు జరపాలి. ఊర్ధ్వలోక ప్రాప్తి కలిగించాలి.

త్వరగా అగ్ని సంస్కారం ఆచరించాలి.

కాలం అంటే దైవం. దాన్ని ఎవరూ ఆపలేరు. దాటలేరు. సర్వకర్మలకు కారణం దైవం. కార్యసాధన కూడా అదే. కాలానికి బంధుత్వం ఉండదు. మిత్రత్వం ఉండదు. శత్రుత్వం ఉండదు. పక్షపాతం ఉండదు. అది ఎవరికీ లొంగదు. లోకమంతా దైవాధీనం. ఆ దైవమే పరమగతి.

విన్నాడు లక్ష్మణస్వామి. సుగ్రీవుణ్ణి పురమాయించాడు. పూలమాలలు, నెయ్యి, గంధపు చెక్కలు తదితరాలు అంగదుణి తెమ్మన్నాడు. తారుణ్ణి పిలిచాడు. పల్లకీ తెమ్మన్నాడు. అది శవవాహనం. దానికి తగిన వాహకుల్ని సిద్ధం చేయాలన్నాడు. సుగ్రీవుణ్ణి పిలిచాడు. అంగదునికి ధైర్యం కల్పించమన్నాడు. సౌమిత్రి మాట విన్నారు అందరూ. అన్ని పనులూ చక చకా చేశారు.

ఓ రథంలా ఉంది పల్లకి. చక్కగా అలంకరింపబడింది. అందులోకి మృతదేహాన్ని చేర్చారు. తార ఎక్కింది. భర్త తలని తన ఒడిలో వుంచుకుంది తార. ఏడుస్తోంది. వానర స్త్రీలు విలపిస్తున్నారు. నడుస్తున్నారు.

కొండ దగ్గర ఆగారు. నదీతీరంలో ఇసుకతిన్నెల్లో – శవాన్ని దించారు. కట్టెలు గంధపు చెక్కలు పేర్చారు. చితి సిద్ధపరచారు. వానర స్త్రీలు చేరారు. తారని దించారు. వణికిపోతున్నాడు అంగదుడు. సుగ్రీవుడు సాయం చేశాడు. తండ్రి కళేబరాన్ని ఎత్తాడు. చితిమీద పెట్టాడు. యథాశాస్త్రంగా నిప్పు పెట్టాడు. 'బహు దూరంప్రయాణం చేస్తున్నావా తండ్రీ' అన్నాడు దుఃఖావేశంతో. అపసవ్యంగా ప్రదక్షిణం చేశాడు.

అందరూ నదీతీరానికి చేరారు. స్నానం చేశారు. జల తిల తర్పణాలు సమర్పించారు. అక్కడ ఉన్న నది తుంగభద్రా నది. అది సహ్యాద్రి కొండల్లో పుట్టింది. అక్కడ నుంచి ప్రవహించి కిష్కింధ పర్వతాల్లోంచి ప్రయాణించి చివరికి కృష్ణా నదిలో కలుస్తుంది. ఎడమ చేతివైపునుంచి కుడిచేతివైపు తిరిగి వస్తే – అది ప్రదక్షిణం. కుడిచేతివైపు నుంచి ఎడమ చేతివైపు తిరిగివస్తే అది అపసవ్యం. అప్రదక్షిణం అంటారు.

పశువులు పక్షులు వానరులు – ఇవి తిర్యక్ జాతిలోనివి. వాటికి శాస్త్ర ప్రకారం అగ్ని సంస్కారాలకు అర్హత లేదు. అయితే వాలి సుగ్రీవాది వానర ప్రముఖులు దైవాంశ సంభూతులు. మరణానంతరం శాస్త్ర విధ్యుక్తంగా దహన సంస్కారాది ఉత్తర క్రియలకు వారికి అధికారం ఉంది.

తార తెలివి కలది. అంగదుని కోసం బతకాలనుకుంది. వాలితో పాటు సతీ సహగమనం చేయలేదు. ప్రాయోపవేశం కూడా చేయలేదు. సుగ్రీవునితో విరోధం పెట్టుకోలేదు. అతనికి రాముని అండ ఉంది. కొడుకు కోసం ఓర్పు వహించింది. సుగ్రీవునితో అనుకూలవతి అయ్యింది. రామావతార తత్వం తెలిసిన నారీ రత్నాల్లో తార ఒకతె.

అసూయా ద్వేషాలు పగలు ప్రతీకారాలు సాధిస్తారు కొందరు. తర్వాత వారిలో వివేకం పొడసూపుతుంది. దానికి సుగ్రీవుణ్ణి చెప్పుకోవాలి. ఈర్ష్యాద్వేషాలు చివరికి దుఃఖపూరితాలవుతాయి. అది వాలి సుగ్రీవుల చరిత. ఆ అసుర గుణ సంపత్తికి అవకాశం ఇవ్వరాదని హెచ్చరిస్తున్నాడు వాల్మీకి మనల్ని.

**అనుమతి**

వాలి దహన సంస్కారాలు ముగిశాయి. వానర సచివులు సుగ్రీవునితో కలిశారు. అందరూ రామసన్నిధి చేరారు. అది ఋషులందరూ బ్రహ్మదేవుని సేవించినట్లుందిట అంటాడు వాల్మీకి. వాయుపుత్రుడు హనుమంతుడు నడిచాడు. చేతులు జోడించాడు. అంటున్నాడు రామునితో. "ప్రభూ! తాతముత్తాతలు పాలించారు కిష్కింధని. అంతటి వానర రాజ్యం ఇది. నీ అనుగ్రహం పొందాడు సుగ్రీవుడు. నీవు అనుజ్ఞ ఇస్తే – అందరం నగరానికి వెళ్దాం. సుగ్రీవుడు రాజ్యాభిషిక్తుడు అవుతాడు. వివిధ రత్నాలు పుష్పాలు తెస్తాం. నిన్ను సుగ్రీవుడు పూజిస్తాడు. ప్రభూ నీవు రావాలి. సుగ్రీవుణ్ణి రాజుని చేయాలి. ఇదే మా ఆహ్వానం. నువ్వు వస్తే అందరూ సంతోషిస్తారు".

విన్నాడు రాముడు. "హనుమా ఒక నగరంలో కాని గ్రామంలో కాని అడుగుపెట్టను. అది నా నియమం. అలా పద్నాలుగేళ్ళు ఉంటాను" అన్నాడు. వెంటనే సుగ్రీవునితో "నీవు సదాచార సంపన్నుడవు. రాజ్యాభిషేకం చేసుకో. అంగదుణ్ణి యువరాజుగా అభిషేకించు. ఇపుడు వానాకాలం. శ్రావణ భాద్రపద మాసాలు నాలుగు నెలలు వర్షాలు పడతాయి. అది యుద్ధ ఉద్యోగ సమయం కాదు. ఆ కనపడే పర్వత గుహ చూడు. అక్కడ లక్ష్మణునితో ఉంటాను. నాలుగు నెలల తర్వాత రావణ వధకు అన్ని ఏర్పాట్లు చూడు. ఇక నీవు పట్టణానికి పో. పట్టాభిషేకం చేసుకో. సమస్త సుఖాలు అనుభవించు. సంతోషించు. (అది సీతాన్వేషణకు సమయం కాదు అనలేదు. ఏకంగా రావణ వధకు ఏర్పాట్లు గావించు అన్నాడు. అది నరునిలోని నారాయణుని మాట.)

**పట్టాభిషేకం**

అంగీకరించాడు సుగ్రీవుడు. కిష్కింధ చేరాడు. వేలాది వానరులు వెంట నడిచారు. సుగ్రీవునికి సాగిలపడ్డారు. శిరసా నమస్కరించారు. అందరినీ లేవనెత్తాడతడు. అది వాలి వున్న అంతఃపురం. లోపలికి వెళ్ళాడు. తార కనపడింది. ఆమెని సముదాయించాడు. అంతఃపురం స్వాధీనం చేసుకున్నాడు.

వింజామరలు, రత్నాలు, పుష్పాలు, పూలమాలలు, అంగరాగాలు, అక్షతలు, తేనె, నెయ్యి, పెరుగు, పులితోలు, అడవిపంది చర్మపు పాదరక్షలు – రాజ్యాభిషేకానికి సర్వమూ సిద్ధం. జ్వలిస్తున్న అగ్నిహోత్రం మంత్రపూరితంగా హవిస్సులు సమర్పింపబడ్డాయి. తూర్పుముఖంగా కూర్చోబెట్టారు సుగ్రీవుణ్ణి. సముద్ర జలాలు నదీజలాలు బంగారు కలశాలలో నింపారు శుద్ధ జలాలతో అభిషేకించారు. అందులో జాంబవంత

హనుమంతాదులున్నారు. రాజ్యాభిషేకం అయ్యింది. వెంటనే అంగదునికి యువరాజ్యాభిషేకం గావింపబడింది. ఈ శుభకార్యానికి కారకులు రామలక్ష్మణులు. అన్నదమ్ముల్ని అందరూ కీర్తించారు.

సుగ్రీవుని భార్య రుమ. ఆమెతో పాటు ఇద్దరూ సందర్శించారు. రాజ్యాభిషేక విషయాలు చెప్పాడు. తర్వాత కిష్కింధ చేరాడు. దేవేంద్రునిలా రాజ్యపాలన సాగించాడు.

జన వ్యవహారంలో పక్షం అంటే 15 రోజులు. రెండు పక్షాలు ఒక నెల. శ్రావణ భాద్రపద మాసాలు రెండు. అవి వర్ష ఋతువులో చేర్తాయి. అయితే వేదప్రమాణానుసారం పక్షం అంటే నెల. శ్రావణ భాద్రపదాలు – నాల్గు పక్షాలు. నాలుగు నెలల కింద లెక్క.

**ప్రస్రవణ గిరి**

అది ఋష్యమూక పర్వతం. ఆ పర్వత శ్రేణుల్లో ఉంది ప్రస్రవణగిరి. దాని మాల్యవంతం అని కూడా పిలుస్తారు. రామలక్ష్మణులు అక్కడికి చేరారు. ఓ గుహని చూశారు. విశాలంగా ఉంది. తగినంత గాలి ఉంది. అక్కడే వారి నివాసం. పూలచెట్లు పండ్లచెట్లు. తూర్పువైపు నది. రకరకాల పక్షుల కిలకిలా రావాలు. చక్రవాకాల అన్యోన్య ప్రేమలు. నదిలో నల్ల కలువలు ఎర్ర కలువలు నీటిని కప్పేశాయి. ప్రకృతి చూడముచ్చటగా ఉంది. రమణీయంగా ఉంది.

అయితే రామునికి సంతోషం లేదు. నిదుర లేదు. సీతమ్మ మనసులో మెదులుతోంది. అనుక్షణం రాముడు పరితపించటం చూశాడు సౌమిత్రి. ఓదార్పుగా అంటున్నాడు.

'అన్నయ్యా! నీవు మహావీరుడవు. ఉదాత్త పురుషుడవు. కార్యశూరుడవు. ధర్మమార్గ నిరతుడవు. లక్ష్యసాధనే నీ కృషి. నీ కర్తవ్యం. ఆత్మవిశ్వాసం ఉన్నవారు ఇలా శోకించరు. ఇలా కృంగిపోతే శక్తిహీనుడవైపోతావు. శత్రువుని హతమార్చలేవు. శోకాన్ని విడిచిపెట్టు. కార్యోన్ముఖుడవు కమ్ము. రాక్షసుని సపరివారంగా సంహరించు. కాకుత్స్థా! నీవు తలచుకుంటే – సముద్రాలు అరణ్యాలు పర్వతాలు భూమండలమంతా తలకిందులు చేయగలవు. ఇక రావణుడు ఒక లెక్కా నీకు. ఇది వానాకాలం. శరత్కాలం వరకు ఓపిక పట్టు. తర్వాత ఆ రాక్షసుని, వాని రాజ్యాన్ని నాశనం చేయగలవు.

**(సశేషం)**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# తులసీదాసు జీవితగాథ

- బండారు పురుషోత్తం




ఉత్తరభారతదేశమున ఉండిన ఒక చిన్న గ్రామమున ఆత్మారామ్ అను బీద బ్రాహ్మణుడుండెను. అతడు ఇతరులకు సాయము చేయుచు, వారు ఆయాచితముగా ఇచ్చినది స్వీకరించి సంసారమును జరిపించుచుండెను. అతని భార్య హులసి ఉన్నంతలో శుచిగా ఆహారమును తయారు చేసి భర్తకు వడ్డించి, అతనిని తృప్తి పరచుచుండెను. ఆత్మారామ్ నకు అతని భార్యయే లోకము. ఇట్లు ఇద్దరూ అన్యోన్యముగా కాపురము చేయుచుండిరి. కాలక్రమమున వారికొక పుత్రుడు కలిగెను. వింత ఏమనగా ఆ బాలునికి తల్లి గర్భమందే దంతములు ఏర్పడి యుండెను. అట్లు దంతములతో శిశువు జననమైనచో అది తల్లితండ్రులకి గండమని జ్యోతిష్కులు చెప్పినారు. వారు చెప్పిన విధముగనే కొంతకాలమునకు ఆత్మారామ్ భార్య హులసి మరణించినది.

అప్పటినుండి ఆత్మారామ్ ఆ బాలుని తల్లిని హరించినవాడని చిన్నచూపు చూచుచు, అతనిపై ద్వేషముతో ఉండెను. ఆ కారణంగా పిల్లవానికి ప్రేమ కరువై పొరుగింటి దయా దాక్షిణ్యముల మీద బ్రతుకుచుండెను.

ఒకనాడు ఆ గ్రామానికి సన్యాసులు కొంతమంది వచ్చియుండిరి. ఒక సన్యాసి బాలుడైన తులసీదాసుని ఆప్యాయంగా పలకరించి, వారు తెచ్చుకున్న భోజనమును అతనికిచ్చి తినమని చెప్పినాడు. అప్పటివరకు ప్రేమ కరువైన తులసీదాసు, వారి వెంటే వారు గ్రామములో ఉన్న మూడు రోజులు తిరుగుచు కాలము గడిపినాడు. తరువాత నాల్గవరోజు వారితో కాశీయాత్రకు ప్రయాణమై వెళ్ళిపోయినాడు.

కాశీ చేరగానే ఆ సన్యాసి పిల్లవానిని ఒక పండితుని వద్దకు తీసుకుని వెళ్ళి అతనికి అప్పగించినాడు. సన్మార్గుడైన ఆ పండితుడు తన కుమారునితో పాటు ఆ పిల్లవానికి కూడా పాఠములు చెప్పుచూ, సంస్కృత భాషాశిక్షణను ఇచ్చాడు. మంచి తెలివితేటలు, సూక్ష్మగ్రాహ్యత ఉన్న తులసీదాసు సంస్కృతమును చక్కగా అభ్యసించినాడు. బాల్యం నుండే అతనిలో ఇమిడియున్న రామభక్తి వృద్ధి చెంది సంపూర్ణత్వమును పొందినది. ఆ ఇంటివారు అతనిని ప్రేమాభిమానాలతో ఆదరించసాగారు. అతని స్నేహశీలమునకు, సూక్ష్మగ్రాహ్యతకు మెచ్చిన ఆ పండితుడు తన కుమార్తె రత్నావళిని అతనికిచ్చి వివాహం జరిపించాడు. రత్నావళికి కూడా రామభక్తి మెండుగా ఉండేది. వారిరువురు అన్యోన్యముగా కాపురము చేయుచుండిరి. ఆమె సౌందర్యవతి. భర్తను ప్రేమగా చూచేది. చిన్నతనముననే తులసీదాసు తన తల్లి మరణించి, తండ్రి ద్వేషమును చవిచూచిన వాడగుటచే తన భార్య చూపుతున్న ప్రేమకు పరవశించిపోయాడు. ఒక్క క్షణము కూడా ఆమెను విడిచి ఉండలేకపోయేవాడు. ఎప్పుడైనా బయటి వ్యవహారము వలన పొరుగూరు వెళ్ళినా వెంటనే తిరిగి వచ్చి ఆమె సన్నిధిని చేరుకునేవాడు. తులసీదాసుకు భార్య అంటే చాలా ప్రేమ. ఈవిధముగా వారి కాపురము దినదినాభివృద్ధి అయింది.



> **“ మీరు నాపై చూపిన ప్రేమలో ఒక్కభాగమైనా జగన్నాథుడైన ఆ రాముని మీద చూపించి యుండిన ఈ సంసార సాగరమునుండి విముక్తి పొందియుండెడివారు. నా జీవితము కూడా ధన్యమై యుండెడిది. ఆ స్వామి కృప వలననే కదా మీరు సజీవులై ఉన్నారు.**

ఒకరోజు అతను మిత్రులతో విహారయాత్రకు వెళ్ళాడు. ఆ రోజంతా మిత్రులతో కాలక్షేపము చేయుచు, సాయంకాలము వరకు ఉండిపోయాడు. అదే రోజున రత్నావళి సోదరుడు వచ్చి రత్నావళిని తమ ఊరు రమ్మన్నాడు. ఇంట భర్త లేని సమయంలో ఆమె ఎలా వస్తుంది? సోదరునితో ఏమని చెప్పాలని ఆలోచిస్తుండగా “సోదరీ! బావగారు నా మాట కాదనరు. నేను తనకు ఉత్తరము వ్రాసిపెట్టి ఉంచుతాను. మనం ఊరు వెళ్ళిన తరువాత వీలు చూచుకుని బావ కూడా ఊరికి రాగలడు” అని ఆమెకు నచ్చచెప్పి, ఆమెను తన వెంట తమ స్వగ్రామమునకు తీసుకొని వెళ్ళాడు.

ఆరోజు సూర్యాస్తమయం తరువాత రాత్రి ఇంటికి వచ్చిన తులసీదాసు భార్య ఇంట లేకుండుట చూసి చాలా ఆదుర్దా పడ్డాడు. కానీ కొంత సమయానికి బావమరిది వ్రాసిన ఉత్తరం చూసుకున్నాడు. అతను ఇంటివద్ద ఉన్నచో ఆమెను పుట్టింటికి పంపేవాడుకాదు. రత్నావళి లేకుండా ఆ ఇంట్లో ఉండుటకు అతని మనసు అంగీకరించలేదు. వెంటనే తులసీదాసు ఆ ఊరికి బయలుదేరాడు. రాత్రి ప్రయాణం, మార్గమంతా చీకటిమయంగా ఉంది. ఊరు ఇంకా సగం దూరంలో ఉండగా వర్షం ప్రారంభమైంది. వేగంగా గాలి కూడా వీస్తున్నది. బట్టలు తడిసిపోయాయి. పొదల మధ్య వెళుతున్నప్పుడు అతని శరీరమునకు ముళ్ళు తగిలి గీసుకుపోయింది. బురదలో పడి లేచి అతను ఎలాగో బావమరిది ఇంటికి చేరుకున్నాడు. ఆ ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. వారి నిద్రను భంగం చేయడానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. ఆమె ఇంటి వెనుకవైపు గదిలో తరచూ నిద్రించటం అతనికి తెలుసు. వెంటనే ఆ ఇంటి వెనుకవైపు వెళ్ళాడు. ప్రహరీగోడకు ఒక త్రాడు వ్రేలాడుతున్నది. దానిని ఊతంగా చేసుకుని ప్రహరీగోడ దూకి లోపలికి వెళ్ళాడు. వెంటనే ఆమె నిద్రిస్తున్న గది తలుపు తట్టాడు.

రత్నావళి తలుపు తెరిచి ఎదుట ఉన్న భర్తను చూచి నిశ్చేష్టురాలైంది. “ఇంత రాత్రివేళ గాలివానలో ఈ ఊరు వచ్చారా? లోపలకు ఏ దారిగుండా వచ్చారు?” అని ప్రశ్నించింది. ఆ ప్రశ్నలోని హేళనకు అతని మనస్సు బాధపడింది. తన ప్రాణం కంటే మిన్నగా భావించిన భార్య ఆ మాటలనగానే అతని మనస్సు గాయపడింది. అయినప్పటికీ “ప్రియతమా! నేను రావాలనేగా నీవు ప్రహరీ గోడకు తాడును వ్రేలాడదీసింది?” అని అతను ప్రశ్నించాడు.

ఆమె అతని మాటలకు ఆశ్చర్యపడుతూ వెంటనే దీపం తీసుకొని వచ్చింది. ఇద్దరూ బయట ప్రహరీ గోడ వద్దకు వచ్చి చూచారు. అక్కడ ఉన్నది తాడు కాదు, నల్లత్రాచుపాము. తులసీదాసు నివ్వెరపోయి చూచాడు. అతని నోట మాట రాలేదు. ఆమె ఇచ్చిన పొడి దుస్తులు ధరించిన తరువాత ఆమె అతని ప్రక్కన కూర్చుని “మీరు నాపై చూపిన ప్రేమలో ఒక్కభాగమైనా జగన్నాథుడైన ఆ రాముని మీద చూపించి యుండిన ఈ సంసార సాగరమునుండి విముక్తి పొందియుండెడివారు. నా జీవితము కూడా ధన్యమై యుండెడిది. ఆ స్వామి కృప వలననే కదా మీరు సజీవులై ఉన్నారు” అని అన్నది. ఈ మాటలు ఉచ్చరించినప్పుడు ఆమె సాక్షాత్తు జగన్మాతగా గోచరించినది. ఆ ప్రవచనములు అతని మనస్సున గాఢముగా నాటుకొనినది. ఉదయము నిద్ర లేచి కాశీకి ప్రయాణమై వెళ్ళాడు. అచ్చట ఒక స్థిరమైన స్థలమున కూర్చుని రామనామము జపించుచు తపమొనరించాడు. తరువాత కాలమున ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన “రామ చరిత మానస్” అను రామాయణమును రచించి జగత్ప్రసిద్ధి చెందినాడు. ఈ కథ వలన భగవంతుని నామస్మరణమునకు ఎంతటి శక్తి ఉన్నదో విశదమగుచున్నది.

★★★

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

## 298.గోధూళి చ్ఛురితాంగకాయ నమః

– ఆవులు నడిచి పోవునపుడు రేగిన దుమ్ముచేత ధూసరితమైన దేహము గలవాడు కృష్ణుడు.

గోధూళి చ్ఛురితాంగుడైన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

## 299.గోసంఘ రక్షకాయ నమః

– ఆవుల మందను కాపాడినవాడు కృష్ణుడు.

ఒకనాడు బలరామకృష్ణులు, గోపబాలురు తమ ఆట పాటలలో మునిగి యుండిరి. అప్పుడు గోవులు స్వేచ్ఛగా తిరుగుచు లేపచ్చికలు మేయుచు ఇషీక (దట్టముగ అవురు గడ్డి గల) వనము లోనికి వెళ్ళినవి. ఇంతలో ఆ వనములో దావాగ్ని చెలరేగి ఆలమందను చుట్టుముట్టింది. అవి తాపమునకు భయపడి బిగ్గరగా అరవసాగినవి. అపుడు బలరామకృష్ణులు గోపబాలురు ఆలమంద కొరకు వెదకసాగిరి. వారు ఎంత వెదికినను ఆవులు కనిపించలేదు. ముంజేటడవి యందున్న ఆవులను కృష్ణుడు బిగ్గరగా మేఘ గంభీర స్వరముతో పేరు పేరునా పిలిచినాడు. ఆవులు కృష్ణుని పిలుపుకు స్పందించి సంతోషముతో అంబారవములు చేసినవి. వారమందరూ ఆలమంద దగ్గరికి వచ్చారు. ఇంతలో దావాగ్ని వారిని ఆలమందను చుట్టుముట్టింది. గోపబాలురందరూ తమ్ము కాపాడమని కృష్ణుని ప్రార్థించారు. అంత కృష్ణుడు వారికి అభయమిచ్చి మిత్రులారా! మీరు భయపడవద్దు. ఒక్క క్షణకాలము కనులు మూసికొనుడు అని చెప్పినాడు. వారు అట్లే చేసినారు. ఆ క్షణములో కృష్ణుడు ఆ దావాగ్నిని తన నోటితో త్రాగి గోపబాలురను ఆవులను పెను ఆపద నుండి కాపాడినాడు. కృష్ణుడు నిజయోగ వైభవముతో ఆ వనము నుండి గోపబాలురను, ఆవులను భాండీరక వటవృక్షము క్రిందికి చేర్చినాడు. గోపబాలురు కనులు తెరిచి చూచునంతలో వారు భాండీరక వటవృక్షము క్రింద నిలిచి యున్నట్లు గమనించారు. వారు సంతోషముతో కృష్ణుని యోగమాయా ప్రభావమున ఎరగలి చిచ్చు (కార్చిచ్చు) మ్రగ్గెనని కృష్ణుని పొగిడినారు.

మానవమాత్రునికి కార్చిచ్చు నార్పు శక్తి యుండునా? నేడు కృష్ణుడు కార్చిచ్చు నార్పి మనందరినీ రక్షించినాడు. ఇతడు బ్రహ్మయో, విష్ణువో, శివుడో? అని తలంచారు.


గోవర్ధనోద్ధరణము

ఒకనాడు నందాది గోపాలురు అందరు ఇంద్రయాగమును నిర్వహించుటకు సన్నద్ధులగుచుండుటను కృష్ణుడు చూచి అతడు నందాదులతో రజోగుణ ప్రేరణ చేతనే మేఘములు భూమిపై వర్షించుచున్నవి. ఆ నీటి వలన ఆహారోత్పత్తి జరుగుచున్నది. ఇందు ఇంద్రుని ప్రమేయము లేదు. కనుక మనము ఇంద్ర యాగము మాని మనకు జీవనాధారమైన గోవులను, మనకు నివాస స్థానమైన గోవర్ధనగిరిని పూజింతమని చెప్పినాడు. నందాదులు అందుకు సమ్మతించినారు. కృష్ణుడు చెప్పిన ప్రకారము ఇంద్ర యాగము మాని బ్రాహ్మణులను గోవులను పూజించారు. వాటికి మంచి మేతను ఇచ్చారు. పిమ్మట గోవులను ముందుంచుకుని గోవర్ధనగిరికి ప్రదక్షిణములు చేశారు. తాము తెచ్చిన ఆహార పదార్థములను, మధురమైన పిండివంటలను గోవర్ధనగిరిని పూజించి నివేదించారు. గోపాలురందరికీ విశ్వాసము కావించుటకై కృష్ణుడు గోవర్ధన పర్వతము పైకి చేరి ఒక మహారూపమున కన్పించినాడు. నివేదించిన పదార్థముల అన్నింటినీ తానే ఆరగించినాడు. కృష్ణుడు గోపాలురందరు గోవర్ధనగిరిని పూజించిన తర్వాత బృందావనం చేరినారు.

కృష్ణుని పర్యవేక్షణలో నందాది గోపాలురు అందరు తనను పూజించక, గోవర్ధనగిరిని పూజించినందులకు ఇంద్రుడు వారి యెడల కోపించినాడు. ఇంద్రుడు తానే త్రిలోకాధిపతిని అని భావించుచున్నాడు. అతడు బృందావనముపై జలప్రళయము సృష్టింపదలంచినాడు. ఇంద్రుడు సంవర్తక నామ మేఘములను పిలిచి మేఘములారా! మానవమాత్రుడైన కృష్ణుని నమ్ముకొని గోపాలురందరు ధనమదముతో దేవతలకు ప్రభువైన నన్ను అవమానించారు. మీరు వ్రజభూమిపై అత్యంత అధిక వర్షమును కురిపింపుడు. వీరి గోవులను గాలి వానలతో హతమార్చుడు. నంద గోకులమును రూపు మాపుటకై నేను ఐరావతమునెక్కి, మరుద్గణములతో కూడి మీ వెంటనే ఆ వ్రజభూమికి వచ్చెదనని చెప్పి, వాటిని వ్రజభూమిపైకి పంపినాడు.

సంవర్తకాది మేఘములు నంద గోకులముపై విజృంభించి పిడుగులతో, మెరుపులతో జడివాన ఎడతెరిపి

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము



లేకుండా కురిపించసాగినవి. వ్రజభూమి అంతా జలమయమైంది. కుంభవృష్టికి, పెనుగాలుల తాకిడికి తట్టుకొనలేక గోవులు చెల్లాచెదరై వణుకుచు పోసాగినవి. గోపాలురు గోపికలు తీవ్రమైన చలిబాధకు తట్టుకొనలేక కృష్ణుని శరణు జొచ్చినారు. కృష్ణా! నీవు భక్తవత్సలుడవు. మమ్ము, గోవులను జడివాన, చలిబాధల నుండి కాపాడమని ప్రార్థించినారు. కృష్ణుడు ఇదంతా కోపించిన ఇంద్రుని యొక్క నిర్వాకమే అని తలంచినాడు. ఇపుడు నా యోగమాయ చేత చక్కగా దీనికి ప్రతిక్రియ చేసి, నేను త్రిలోకాధిపతినని గర్వించుచున్న ఇంద్రునకు బుద్ధి చెప్పెదను అని నిశ్చయించినాడు. వెంటనే కృష్ణుడు ఒక చేతితో గోవర్ధన గిరిని అవలీలగా పైకెత్తి తన చిటికెన వ్రేలుపై నిలిపి, గోపాలులారా! గోపికలారా! వ్రజవాసులారా! మీరందరును మీమీ గోవులను, ఇతర వస్తువులను తీసికొని ఈ పర్వతము క్రిందికి చేరుడు. ఈ పెనుగాలుల నుండి, తెంపులేని జడివానల నుండి మిమ్ము రక్షించుటకు గోవర్ధనగిరిని ఎత్తి పట్టుకొన్నాను.

ఇతడు బాలుడు, కొండ పెద్దది. మహాభారమును మోయుటకు ఇతడు చాలునా? అని ఈ కొండ క్రింద నిలుచుటకు సందేహించవద్దు. ఈ పర్వతములు, సముద్రములు జంతువులతో కూడి యున్న భూమండలముపై బడినను నా చేయి అల్లాడదు. బంధువులారా! సంతోషముతో గోవర్ధన పర్వతము క్రిందికి రండు అని పలికినాడు.

అంత గోపాలురందరు కృష్ణుని మాటలు నమ్మి గోపాలురు, గోపికలు తమ గోవులతో వస్తువులతో గోవర్ధనగిరి క్రిందకు చేరి కృష్ణుని చూచుచు, ఆకలి దప్పులు లేక కృష్ణుని లీలలు చెప్పుకొనుచు వినోదించుచుండిరి. ఇట్లు వారందరూ ఈతి బాధలు లేకుండా ఏడు దినముల పాటు ఆ పర్వతము క్రింద నివసించారు.

పద్మాక్షుడగు కృష్ణుని చేతిలో గోవర్ధన పర్వతము ఒక పద్మము వలె విరాజిల్లింది. ఆ పర్వతము పైన ఉన్న మేఘముల సమూహము తుమ్మెదల గుంపు వలె ప్రకాశించింది.

అంతట ఇంద్రుడు కృష్ణుని యోగమాయా ప్రభావమును చూచి ఆశ్చర్యపడి, తన సంకల్పము నెరవేరకపోవడంతో అహంభావం వదిలివేసి సంవర్తాది మేఘములను పూర్తిగా నివారించెను. వెంటనే ప్రశాంత వాతావరణము ఏర్పడింది. ఆకాశమున మబ్బులు చెదరి పోవుటతో సూర్యదర్శనమయింది. అప్పుడు గోవర్ధనధారి యగు కృష్ణుడు గోపాలులారా! గోపికలారా! ఉపద్రవము తొలగిపోయింది. ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఇక మీరు కొండ నుండి బయటకు వచ్చి స్వస్థానములను చేరుడని చెప్పినాడు. కృష్ణుడు చెప్పినట్లుగా వ్రజవాసులందరూ తమ తమ వస్తువులతో గోగణముతో గోవర్ధన పర్వతము నుండి బయటకు వచ్చి సంతోషముతో స్వస్థానములను చేరి సుఖముగా జీవించారు. అంతట అందరూ చూచుచుండగా కృష్ణుడు గోవర్ధన గిరిని క్రిందికి దింపి యథాస్థానమున నిలిపినాడు.

ఇంద్రుడు తన అపరాధమును క్షమించమని ప్రార్థించుటకు వ్రజభూమికి వచ్చినాడు. కృష్ణా! వాసుదేవా! నీవు సాక్షాత్తు భగవంతుడవని నాకు తెలిసింది. నీవు భక్తవత్సలుడవు. నిన్ను శరణు వేడుచున్నాను అని కృష్ణుని పాదముల నాశ్రయించినాడు. అంత కృష్ణుడు నీవు దేవతలకు అధిపతివను గర్వముతో ఉన్నావు. నిన్ను అనుగ్రహించుటకే గోవర్ధనగిరి ఉద్ధరించబడి వ్రజవాసులందరు రక్షింపడినారు అన్నాడు. అంత ఇంద్రుడు వర్షోపద్రవము నుండి గోవులను రక్షించుటచే కృష్ణుని గోవిందుడని కీర్తించినాడు.

కామధేనువు పాలతో, ఐరావతము తన తొండముతో తెచ్చిన ఆకాశగంగా జలముతో అదితి మునుల సమూహముతో ఇంద్రుడు కృష్ణుని అభిషేకించి గోవిందుడని స్తుతించాడు. యుద్ధములో ఆక్రమించబడిన శత్రువు గలవాడు, పద్మపత్రముల వంటి నేత్రములు గలవాడు సాధువులను రక్షించే వాడగు కృష్ణుడు గోవిందుడను పేరుతో పిలువబడినాడు. నాటినుండి గోవింద శబ్దము భగవద్వాచకమై ప్రసిద్ధమయింది. గోవింద నామము భూమిని ఉద్ధరించుటచే వరాహ విష్ణుదేవునికి, గోవులను రక్షించుటకే కృష్ణునకు రూఢి అయింది.

గోసంఘ రక్షకుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

వేంకటాద్రిపై చింతచెట్టు క్రింద పుట్టలో నివసించి యున్న శ్రీనివాసునకు బ్రహ్మదేవుడు గోరూపమున పాలు పుట్ట లోనికి కార్చుచుండగా గోపాలుడు శరభయ్య కోపముతో చేతి గొడ్డలిని ఆవుపై విసరినాడు. ఆ దెబ్బ ఆవుకు తగలకుండా శ్రీనివాసుడు పుట్టలోనుండి లేచినాడు. ఆ గొడ్డలి దెబ్బ శ్రీనివాసుని తలపై తగిలింది. ఆవు రక్షింపబడింది. ఇందుచే శ్రీనివాసుడు గోవిందుడని కీర్తింపబడుతున్నాడు. వేంకటేశా! గోవిందా! నామ స్మరణముతో వేంకటాద్రి – తిరుమల హోరెత్తుచున్నది.



(2024 మార్చి 8
మహాశివరాత్రి సందర్భంగా)

# భక్త కవి నత్కీరుడు

- గోనుగుంట మురళీకృష్ణ

శివాలయంలో అర్చన ముగించుకుని ఇంటికి నడిచి వస్తున్నాడు శివశర్మ. శివుడికి నైవేద్యం పెట్టటానికి పండ్లు, ఫలహారాలు ఏమీ దొరకటం లేదు. కనీసం అభిషేకం చేయటానికి కూడా గుక్కెడు నీళ్ళు కనబడటమే గగనం అయింది. పూలతో అలంకరించుదాం అనుకున్నా చెట్లన్నీ ఎండి మోళ్ళు అయినాయి. ఏనాడూ కనీవినీ ఎరుగని కరువు వచ్చిపడింది. నాలుగు చుక్కలనీళ్ళు శివలింగం మీద చిలకరించి, ఒక దండం పెట్టి వస్తున్నాడు రోజూ.

సూర్యోదయం అయి ఎక్కువ సమయం కాలేదు. ఎండ మండిపోతున్నది. ఉదయం అయినా అపరాహ్నం అయినట్లు వేడిగాలులు వీస్తున్నాయి. శివశర్మ తలమీద నుంచీ స్వేదం చెంపలమీదకు జారివస్తున్నది. తల వంచుకుని ఆలోచిస్తూ వీధి వెంట నడుస్తున్నాడు.

“నమస్కారం పంతులు గారూ!” మాట వినబడి తలెత్తి చూశాడు. ఎవరో ఊరిలో వాడు, చూపులకి రైతులాగ ఉన్నాడు. “శుభమస్తు!” అన్నాడు శివశర్మ.

“స్వామీ! ఈ ఏడన్నా నాలుగు చినుకులు పడతాయంటారా! ఈ సేద్యాన్నే నమ్ముకున్నాను. ఏ ఏటికి ఆ ఏడు ఎదురు చూపులతోనే సరిపోతున్నది. ఆకాశంలో మబ్బుతునక కనిపించటం లేదు” అన్నాడు అతను.

“ఏం చేస్తాం నాయనా! శివకటాక్షం ఇలా ఉన్నది” నిట్టూర్చాడు శివశర్మ. ఇంటికి వచ్చేసరికి బావమరది ఊరునుంచీ వచ్చినట్లు ఉన్నాడు. ఉయ్యాలబల్ల మీద కుర్చుని ఉన్నాడు. భార్య పక్కనే నిలబడి మాట్లాడుతూ ఉన్నది. ఆమె నలిగిపోయి మాసికలు పడిన పట్టుచీర కట్టుకుని, కొంగు భుజంచుట్టూ కప్పుకుని ఉన్నది.

“బావగారా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకి? అంతా బాగున్నారా!” పలకరించాడు శివశర్మ.

"బాగానే ఉన్నాం బావా! కిందటిసారి సంవత్సరాదికి మీ ఇద్దరూ వస్తారని ఎదురుచూశాం." అన్నాడు బావమరది.


"రావాలనే అనుకుంటున్నాము. ఏవో పనులు. మీకు తెలియనిదేముంది? రెండేళ్ళనుంచీ కరువు."

"బావగారూ! ఈ దేశపురాజు సాహితీ ప్రియుడు. మంచిసాహిత్యం చెప్పిన వారికి శంఖపలకంమీద కూర్చోబెట్టి సన్మానం చేస్తాడట. ఆ శంఖఫలకాన్ని అగస్త్య మునీంద్రుడు ప్రసాదించాడని చెప్పుకుంటారు. అది పుష్పకవిమానంలా ఎంతమంది కవులు ఎక్కినా చోటు ఉంటుందట. మీరు కూడా వెళ్లి కవిత్వం వినిపించకపోయారా! కనీసం ఏవైనా నాలుగు పద్యాలు రాసి తీసుకువెళ్లినా ఏదో ఒక పారితోషికం ఇవ్వకపోడు. దానితో కొన్నిరోజులు గడిచిపోతాయి. ప్రయత్నించండి"

"కవిత్వం నాకేం వచ్చు? ఏదో నాలుగు మంత్రాలూ, శ్లోకాలూ నేర్చుకుని ఇలా నెట్టుకువస్తున్నాను. సరే, నీ మాట మాత్రం ఎందుకు కాదనాలి? చూద్దాం" అన్నాడు శివశర్మ.

"భోజనానికి రండి. అన్నయ్యా! నువ్వు కూడా లేచి కాళ్ళు కడుక్కో!" అన్నది శివశర్మ భార్య. శివశర్మ భార్య మొహంలోకి ప్రశ్నార్థకంగా చూసాడు. అర్థం అయినట్లు "అన్నయ్య ఊరినుంచీ కొంచెం ధాన్యం, కూరగాయలు తెచ్చాడు" అన్నది. శివశర్మ నిట్టూర్చాడు.

ఆ మర్నాడు శివాలయంలో శివలింగం ముందు మోకరిల్లి "స్వామీ! నాలుగు పద్యాలు రాసి పాండ్యరాజు మెప్పు పొందుదామంటే నాకు కవిత్వం రాదు, నీ సేవతప్ప ఇంకొకటి ఎరుగను. నీ దగ్గరనుంచీ పిలుపు వచ్చేదాకా ఈ జీవయాత్ర సాగించాలి కదా! నన్ను కరుణించు"



ప్రార్థించాడు. వెంటనే శివలింగం చుట్టూ మిరుమిట్లు గొలిపేటట్లు మెరుపులు మెరిశాయి. ఒక తాళపత్రం వచ్చిపడింది. "శివశర్మా! అదిగో! ఆ తాళపత్రం మీద పద్యం తీసుకువెళ్ళి పాండ్యరాజు దగ్గర చదువు. వెయ్యి మాడలు బహుమతిగా ఇస్తాడు. నీ కరువు తీరుతుంది. వెళ్లిరా!" అన్న మాటలు శివలింగంలో నుంచీ వినిపించాయి.

శివశర్మ ఆ తాటాకు తీసుకుని కళ్ళకు అద్దుకున్నాడు.

★★★

పాండ్యరాజు కొలువు తీరి ఉన్నాడు. చుట్టూ మంత్రులు, సేనాపతులు, కవులు, సభికులు కూర్చొని ఉన్నారు. ఇంతలో ఒక భటుడు వచ్చి "జయము జయము మహారాజా! మీ దర్శనం కొరకు ఎవరో విప్రుడు వచ్చిఉన్నాడు" అన్నాడు.

"వెంటనే ప్రవేశపెట్టు" ఆజ్ఞాపించాడు పాండ్యరాజు.

"ప్రభువుల వారికి నమస్కారం! నన్ను శివశర్మ అంటారు. నేనొక పద్యం మీకు వినిపించాలని వచ్చాను"

"అలాగా! ఇంకెందుకు ఆలస్యం? వినిపించండి" అన్నాడు పాండ్య రాజు.

(నత్కీరుడి కథ మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యం గ్రంథం లోనిది. ఇందులో పరమేశ్వరుడు రచించిన పద్యం గురించి ధూర్జటి కావ్యంలో చెప్పలేదు. కానీ సంస్కృతంలో రచించిన స్కాందపురాణంలో ఇలా ఉంది.

**"జానాసి పుష్ప గంధాన్ భ్రమర!**
**త్వం బ్రూహి తత్వతో నేద్య దేవ్యాః**
**కేశ శకలాసి తుల్యో గంధేన కిం గంధః?"**

–అంటే "పార్వతీదేవి కేశ శకలమునకు గల పరిమళముతో సమమైన పరిమళము ఎందైనా కలదా?" అని అర్థం.)

శివశర్మ పరమేశ్వరుడు తన కిచ్చిన తాళపత్రం లోని పద్యాన్ని రాగయుక్తంగా చదివి వినిపించాడు. ఆ సభలో నత్కీరుడు అనే పండితుడు ఉన్నాడు. ఈ పద్యం వినగానే పక్కున నవ్వాడు. "ఏమిటేమిటీ! 'సింధూర రాజ గమన ధమిల్ల బంధము సహజ గంధంబు' అని కదా నువ్వు చదివావు. సింధూరం అంటే ఏనుగు. గజరాజ గమనం గలిగిన ఆ స్త్రీ జుట్టుముడి (ధమిల్ల బంధం) సహజ సువాసనతో అలారారుతున్నది అని అర్థం కదా! ఎక్కడైనా జుట్టుముడికి సువాసన సహజంగా వస్తుందటయ్యా! కొప్పులో పెట్టుకున్న పూలవలనో, రాసుకున్న కేశతైలం వలనో సువాసన వస్తుంది గానీ! ఇదొక కవిత్వమా! చాలుచాలు. ఇక అపు" అంటూ పడీపడీ నవ్వసాగాడు.

"క్షమించండి. నేను కవిని కాదు. శైవాలయం అర్చకుడిని. నా దీనగాథ విని ఆ పరమేశ్వరుడే స్వయంగా ఈ పద్యం రచించి ఇచ్చాడు"

నత్కీరుడి నవ్వు ఇంకా ఇక్కువైంది. "భలే కథ కల్పించి వచ్చావు. నీ కాకమ్మ కథలు నమ్మటానికి

ఇక్కడ ఎవరూలేరు గానీ, వెళ్ళు. వెళ్ళు” అన్నాడు.

శివశర్మ బాధగా వెనుతిరిగాడు.

తిరిగి ఇంటికి వెళ్ళటానికి మనస్కరించలేదు శివశర్మ. తన భార్యాపిల్లల ముఖాల్లో ఆకలి చూస్తూ తను భరించలేడు. ఆలయానికి వచ్చి కూర్చున్నాడు. “స్వామీ! నీ మాట నమ్మి రాజాస్థానానికి వెళ్లి అవమానంతో తిరిగివచ్చాను. ఆ పద్యంలో తప్పు ఉన్నదట. అలాంటి తప్పులతడక పద్యం నాకెందుకిచ్చావయ్యా! కరువు వలన వచ్చిన బాధకన్నా ఈ అవమానం వలన వచ్చిన బాధే నన్ను అధికంగా వేధిస్తున్నది” అంటూ కన్నీరుకార్చాడు.

శివుడు బ్రాహ్మణరూపంలో ప్రత్యక్షమయ్యాడు. “ఏమిటీ నత్కీరుడా! ఈ పద్యంలో తప్పు ఉన్నదన్నాడా! ఎక్కడ తప్పుఉన్నదో చూద్దాం పద!” అంటూ శివశర్మను తీసుకుని మళ్ళీ రాజసభకి వచ్చాడు శివుడు. “ఈ బ్రాహ్మణుడు తెచ్చిన పద్యంలో తప్పు ఉన్నదని నత్కీరుడు చెప్పాడట. ఏదీ, ఎక్కడున్నది తప్పు? లక్షణంలోనా, అలంకారంలోనా, పదబంధం లోనా, రసము లోనా! చెప్పండి” అన్నాడు.

వెనుకటి లాగానే “ఎక్కడైనా స్త్రీల జుట్టుముడి సహజమైన సువాసన కలిగి ఉంటుందా! మోసపుమాటలు చాలు” అన్నాడు నత్కీరుడు.


“పార్వతీదేవి కొప్పు సహజమైన సువాసన కలిగిఉంటుంది” అన్నాడు బ్రాహ్మణుడు.

“పార్వతీదేవిని నువ్వు చూశావా! గగన ప్రసూనాల వంటి నీ మాటలు కట్టి పెట్టు” అంటూ ఫక్కున నవ్వాడు.

శివుడునిజరూపంలోప్రత్యక్షమయ్యాడు. “నేనెవరోచూశావా! త్రినేత్రుడిని” అన్నాడు. దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆయన్ని చూడగానే పాండ్యరాజుతో సహా సభలోని వారందరూ లేచి నమస్కరించారు.

“నీకు మూడుకళ్ళు కాదు, తలచుట్టూ కళ్ళుఉన్నా నువ్వు చెప్పిన కవిత్వం మాత్రం తప్పే! నీ మాయలు నా దగ్గర చెల్లవు”అన్నాడు నత్కీరుడు అహంకారంగా.

“ఓరీ మూర్ఖుడా! మొండిగా వాదిస్తూ పరమేశ్వరుడనైన నన్నే ధిక్కరించావు. నీ అహంకారానికి ఫలితం అనుభవించు. నేటినుండీ కుష్టువ్యాధితో పీడింపబడుతూ నలుగురితో అసహ్యించుకోబడుతూ జీవించు” అని శపించి అంతర్ధానమయ్యాడు. పాండ్యరాజు భయపడిపోయి దీనికంతటికీ మూలకారణమైన శివశర్మకు తగిన బహుమతిని ఇచ్చి వెంటనే పంపేశాడు.



నత్కీరుడికి ఒక్కసారిగా ఆకాశంలో నుంచీ పాతాళంలోకి వచ్చిపడినట్లు అయింది. కళ్ళు తెరిపినబడ్డాయి. శివాలయానికి వెళ్లి “అయ్యో! రాజగౌరవం పొందుతూ సుఖంగా జీవించకుండా అహంకారంతో దేవుడితో ఎందుకు వాదులాట పెట్టుకున్నాను? భయంకరమైన ఈ కుష్టువ్యాధిని ఎలా భరించను? పరమేశ్వరా! భక్తులను రక్షించటం లో కల్పవృక్షం లాంటి వాడివని అంటారే! నన్ను క్షమించు. పాపాత్ములైనా, పుణ్యాత్ములైనా అందరూ నీ బిడ్డలే కదా! బిడ్డ తెలియక తప్పుచేస్తే తల్లిదండ్రులు కోపగించుకుంటారా! నీవే దిక్కు” అంటూ పరిపరివిధాల వేడుకున్నాడు.

పరమేశ్వరుడు భక్తసులభుడు, భోళాశంకరుడు. నిండు మనసుతో వేడుకుంటే ప్రసన్నుడౌతాడు. ఆరోజు రాత్రి కలలో ప్రత్యక్షమై “నువ్వు వెళ్లి కైలాస శిఖరం దర్శించు. నీ వ్యాధి నయం అవుతుంది” అని చెప్పాడు.

“ధన్యుడను” అంటూ చేతులు మోడ్చి నమస్కరించాడు నత్కీరుడు. అప్పటికే అతని శరీరంలో మార్పులు వచ్చాయి. ఒంటినిండా పుళ్ళువచ్చాయి. జుట్టు ఊడిపోయింది. తనువులో పటుత్వం తగ్గిపోయి తూలుతున్నాడు. “అయ్యో! కైలాసపర్వతం ఎక్కడున్నదో ఏమిటో? ఏనాడూ విన్నది కాదు, కన్నది కాదు. అక్కడికి చేరుకోవాలంటే ఎన్ని మహానదులు, ఎన్ని పర్వతాలు, ఎన్ని జనపదాలు దాటాలి? ఈ స్థితిలో ఎలా నడవగలను?” అనుకుంటూ బయలుదేరాడు.

“హరి శార్దూల మదేభ ఖడ్గ శరభ వ్యాకీర్ణము ల్రాక్షసోత్కర సంచార నివాసముల్ హిమ పయోధారాళ వర్షంబులుద్ధుర సంఘర్షణ బాధ కోపలము లా త్రోవల్ సనన్ శక్యమే కరుణాసాగర! భక్త వత్సల! శివాగౌరీ! యెట్లో గదే!”

ఆ దారిలో సింహాలు, పులులు, ఏనుగులు, ఖడ్గమృగాలు, ఒంటెలు అనేక జంతువులు ఉంటాయి. రాక్షసులు తిరుగుతూ ఉంటారు. మంచుకురుస్తూ ఉంటుంది. రాళ్ళు రప్పలు నిండిన దారులలో ప్రయాణించటం ఎంతకష్టం? ఎలా చేరుకోవాలి? ఈశ్వరా! కరుణాసాగరా! దయచూపు అంటూ ప్రార్థించాడు.

కాళ్ళు తిమ్మిరెక్కక ముందే, చేతులు స్వాధీనం తప్పకముందే, ఒంటినిండా పుళ్ళువచ్చి చీమునెత్తురు కారకముందే, ఈగలు ముసరకముందే, భిక్షకోసం వెళ్ళినప్పుడు జనం అసహ్యంచుకోకముందే

ప్రయాణం సాగించాలి. ముందు ముందు నడవటానికి కూడా శరీరం సహకరించదేమో! త్వరగా కైలాసపర్వతం చేరుకోవాలి అనుకుంటూ బయలుదేరాడు నత్కీరుడు.

ఉత్తరదిక్కుగా ప్రయాణం చేస్తూ దారిలో కనిపించిన క్షేత్రాలను దర్శిస్తూ, పుణ్యనదులలో స్నానంచేస్తూ, కొండలు ఎక్కుతూ దిగుతూ, అరణ్యాలలో ప్రయాణిస్తూ కొద్దిసేపు కుర్చుని విశ్రాంతి తీసుకుని, మళ్ళీ నడుస్తూ, నదులను దాటుకుంటూ, దారిలో వచ్చే జనావాసాలను దాటుకుంటూ ఇలా చాలా రోజులు ప్రయాణంచేశాడు నత్కీరుడు.

అలా ప్రయాణం చేయగా చేయగా దారిలో ఒక వటవృక్షం కనిపించింది. దానికి యోజనం దూరం వరకు వ్యాపించిన విశాలమైన కొమ్మలు ఉన్నాయి. చెట్టునిండా సూర్యకాంతి చొరబడటానికి వీలులేనంత దట్టంగా ఆకులున్నాయి. వేలాది పక్షులు గూళ్ళు కట్టుకుని ఆ కొమ్మల మీద నివసిస్తూఉన్నాయి. నత్కీరుడు అలసటగా వచ్చి ఆ వృక్షం కింద కూర్చున్నాడు. చల్లటిగాలి సేద దీరుస్తున్నట్లు ఉన్నది. కళ్ళు మూసుకుని చెట్టుకు అనుకుని కూర్చున్నాడు.

ఇంతలో పెద్ద వికటాట్టహాసం వినిపించింది. కళ్ళుతెరిచి చూసేసరికి ఎదురుగ పెద్ద రాక్షసుడు నిలబడి ఉన్నాడు. అతడి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కనుబొమలు దట్టంగా ముళ్ళకంపల్లాగా ఉన్నాయి. నోటిలో నుంచీ కత్తుల్లాంటి కోరలు భయంకరంగా కనిపిస్తున్నాయి. మానవ కపాలాలు దండగుచ్చి మెడలో వేసుకున్నాడు. నత్కీరుడు కనబడగానే గభాలున చేతితో ఒడిసి పట్టుకుని పెద్దపెద్ద అంగలు వేస్తూ తన నివాసమైన కొండగుహకు చేరుకున్నాడు.

అక్కడ ఇంకా కొంతమంది మనుషులు ఉన్నారు. “నేను ఇప్పుడే స్నానం చేసి వచ్చి భోజనం చేస్తాను” అని చెప్పి కొండగుహకు పెద్ద బండరాయి అడ్డుపెట్టి బయటకు వెళ్ళాడు రాక్షసుడు.

“ఎవరు మీరంతా! ఈ రాక్షసుడు ఎవరు? మిమ్మల్ని అందరినీ ఎందుకు ఇలా నిర్బంధించాడు?” అని అడిగాడు నత్కీరుడు.

“ఏం చెప్పమంటావు? అంతా మా ప్రారబ్ధం. వందమంది అయితే గానీ వాడి నోటికి సరిపడదు. ఒక్కొక్కరిని తెచ్చి ఇక్కడ నిర్బంధిస్తున్నాడు. ఇప్పటికి తొంభైతొమ్మిది మంది అయ్యారు. నీతో కలిపి నూరుమంది పూర్తిఅయ్యారు. మాకు నూరేళ్ళు నిండిపోయాయి” అన్నారు వాళ్ళు విచారంగా.

“భయపడకండి. తారకాసురుడు వంటి అసురులను సంహరించిన వాడు, నెమలి వాహనంగా కలవాడు, శత్రు భయంకరమైన శక్తి శూలం గలవాడు, శివతనయుడు అయిన కుమారస్వామే మనలను కాపాడగలడు” అంటూ శివతనయుడిని అనేక విధాలుగా స్తోత్రం చేసాడు నత్కీరుడు.

కుమారస్వామి ప్రత్యక్షమై తన శూలంతో ఒక్కపోటుతో రాక్షసుడిని పరలోకగతుడిని చేశాడు. బిలద్వారానికి అడ్డుగా ఉన్న రాతిని తొలగించి “మీరందరూ మీమీ నెలవులకు యధేచ్ఛగా వెళ్ళండి” అని చెప్పాడు. అందరూ కుమారస్వామిని స్తుతించి వెళ్ళిపోయారు.

ఇంకా అక్కడే నిలబడిన నత్కీరుడిని చూసి “నువ్వు ఇక్కడికి ఎలా వచ్చావు?” అని అడిగాడు.

“నా రాత ఇలా కాలి ఒక చిన్నతప్పు వలన పరమేశ్వరుడి ఆగ్రహానికి గురి అయ్యాను. నన్ను కుష్టువ్యాధితో తపించమని శపించాడు. నేను వేడుకోగా కైలాస శిఖరం దర్శిస్తే నా వ్యాధి నయం అవుతుందని పరిహారం చెప్పాడు. స్వామీ! ఆ కైలాసగిరి ఎక్కడున్నదో! రోజురోజుకీ రుజాపీడితుడవుతున్న నేను అంతదూరం ఎలా ప్రయాణించగలను? నాలో శక్తి నశించి పోతున్నది. నన్ను నువ్వే రక్షించాలి” అని పాదాలమీద పడ్డాడు.

“కలవరపడకు. పరమేశ్వరుడు కైలాసగిరిని దర్శించమని అన్నారు గానీ ఉత్తర కైలాసం అని చెప్పలేదు గదా! ఇక్కడికి సమీపంలోనే దక్షిణ కైలాసం (శ్రీకాళహస్తి ) ఉన్నది. నిన్ను అక్కడికి చేరుస్తాను. నీ వ్యాధి నయం అవుతుంది. కళ్ళు మూసుకో!” అని చెప్పాడు కుమారస్వామి.

నత్కీరుడు కళ్ళు మూసుకున్నాడు. కళ్ళుతెరిచి చూడగానే తను ఒక కొలను గట్టున ఉన్నాడు. కొలని లోనికి దిగి మూడు మునకలు వేశాడు. తలెత్తి చూడగానే ఎదురుగా శ్రీకాళహస్తి ఆలయశిఖరం కనబడింది. తన శరీరం మీద పుళ్ళు మాయమై, సంపూర్ణ ఆరోగ్యంగా, కాంతివంతంగా మెరిసిపోతూ ఉంది. కొలనులో నుంచీ బయటకు వచ్చి తడిబట్టలతో పరమేశ్వర దర్శనం చేసుకున్నాడు.

“యోగుల మనసుల యందు కొలువైనవాడా! సర్వపాపాలను హరించువాడా! స్వర్ణగిరి (మేరు పర్వతం) విల్లుగా కలవాడా, వర్షాకాలపు మేఘము వలె గొప్ప తేజస్సు గలవాడా! మన్మధుని దహించిన వాడా! పరమేశ్వరా! నా అజ్ఞానాన్ని మన్నించు. నన్ను అనుగ్రహించు” అంటూ పరిపరివిధాల ప్రస్తుతించాడు. చివరిగా ఇలా వేడుకున్నాడు.

**“ఈ సంసారము, దుఃఖా**
**వాసానందంబు దీని వర్జింపగా**
**నే సుఖము గలుగు దయన్ న**
**న్నా సుఖమున గూర్పవే కృతార్థుడనగుదున్!”**

“ఈ సంసారం దుఖంతో నిండినది, దీనిని విడిచి పెట్టటం వలన ఏ సుఖము కలుగుతుందో నన్ను ఆ సుఖానికి చేర్చు పరమేశ్వరా!” అంటూ అంజలి ఘటించి వినమ్రుడై ప్రార్థించాడు.

పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఆశీర్వదించాడు. ఆయన నుంచీ ఒక వెలుగురేఖ వచ్చి నత్కీరుడిని తాకింది. అతని శరీరం మాయమై అందులో నుంచీ ఒక దివ్యజ్యోతి వెలువడింది. అది నిదానంగా వెళ్లి పరమేశ్వరుడిలో లీనమైంది.

★ ★ ★

ధారావాహికం



## శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ గరుడ పురాణాంతర్గతం

**1. నారాయణగిరి ప్రభావం :** పాండవ తీర్థానికి పడమటి దిక్కున 'నారాయణగిరి' అనే మహా పర్వతమున్నది. ఆ పర్వత దర్శనమాత్రం చేతనే సకల ప్రాణులు ముక్తిని పొందుతాయి. ప్రళయకాలంలో ఉదయించిన కనులకు మిరుమిట్లు గొలిపే కిరణాలు గల సూర్యుని వలె ప్రకాశించువాడు. తన కాంతి పుంజములతో దిక్కులను ప్రకాశింప చేస్తున్నవాడు, తామర కేసరముల వలె పచ్చగా విరాజిల్లుతున్నవాడు, దేవాధిదేవుడు, నారాయణగిరి నాథుడు అయిన శ్రీనివాసుడు అక్కడ నిత్య నివాసం చేస్తున్నాడు.

**2. అరుంధతి ప్రశ్న :** స్త్రీలందరిలో మహా పతివ్రత అయిన అరుంధతి లోకహితం కోరి తన భర్తయైన వసిష్ఠుని ''బ్రహ్మాత్మజా! మీకు నమస్కారం. నా ఈ విన్నపాన్ని వినండి. స్త్రీలకు పతిసేవకు మించిన ధర్మం మరొకటి లేదు. యజ్ఞ యాగాదులు కాని, కర్మ జ్ఞానాది యోగాలు కాని, తీర్థయాత్రలు కాని, దేవతాపూజలు కాని భర్తను సంప్రీతుని చేయుట కంటె గొప్పవి కావు. పతి సంతోషమే స్త్రీలకు పరమ ధర్మము. ఈ విషయాన్ని నేను మీ వలన ఇతర ఋషుల వలన కూడా విని యున్నాను. అయినప్పటికీ నాకొక గొప్ప కోరిక కలుగుతున్నది.

ఒక పవిత్రమైన విష్ణుక్షేత్రంలో, గొప్ప తీర్థంలో కొంతకాలం విష్ణువు గురించి తపస్సు చేసి, శ్రీమహావిష్ణువు ద్వారా, ఈ ప్రపంచానికి సర్వధర్మాలను మించిన ఉత్తమ ధర్మాన్ని తెలియజేయాలని నా అభిప్రాయం. స్త్రీలు భర్త అనుమతితో ధర్మాన్నాచరించడం ఉత్తమ పద్ధతి. కావున నాకు అటువంటి పుణ్య క్షేత్రాన్ని గురించి చెప్పండి అని అడుగగా వసిష్ఠ మహర్షి ఆమెతో దేవీ నీవు సర్వలోకహితం కోరి చక్కగా ప్రశ్నించావు. హృదయానికి ఆహ్లాదం, ఆనందం కలుగునట్లుగా చెబుతాను, శ్రద్ధగా విను. వినేవారికి శ్రద్ధ, ఆసక్తి లేకపోతే చెప్పేవారి మాటలు వ్యర్థమౌతాయి. గుడ్డివాడైన భర్త సన్నిధిలో స్త్రీల సౌందర్యమంతా వ్యర్థమైనట్లు శ్రవణాసక్తి లేని శ్రోతలకు చెప్పేదంతా వ్యర్థమౌతుంది. కావున నీవు నిశ్చల మనస్సుతో నేను చెప్పేది శ్రద్ధగా విను.

**3.భూలోక వైకుంఠం :** సువర్ణ ముఖరీ నదీతీరంలో ఒక గొప్ప పర్వతం ఉన్నది. దాని పేరు వేంకటాచలము. అది పర్వతాలన్నింటిలోను శ్రేష్ఠమైనది. శ్రీమహావిష్ణువుకు శ్వేతద్వీపం కంటె, వైకుంఠం కంటె, సూర్యమండల మధ్యం కంటె కూడా ఆ వేంకటాద్రి అంటే మిక్కిలి ప్రీతి. ఆ దేవదేవుడు పరమ ప్రీతితో ఆ వేంకటాచలంలో నివసిస్తున్నాడు.

ఆ పర్వత నామాన్ని ఉచ్చరించినా, కీర్తించినా, సర్వపాపాలు నశిస్తాయి. సకల శుభాలు కలుగుతాయి. అంతటి మహత్తరమైనది వేంకటాచలము. దూరంగా ఉండైనా ఆ పర్వతానికి నమస్కరించేవారు సర్వపాపాల నుండి విముక్తులౌతారు. అది అటువంటి పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం.

**4.దేవతా సార్వభౌముడు :** ఆ దివ్యక్షేత్రంలో 'స్వామిపుష్కరిణి'

అనే ఒక పుణ్యతీర్థం ఉన్నది. దానికి పడమటి తీరంలో దేవతా సార్వభౌముడైన వరాహస్వామి భూదేవితో విరాజిల్లుతున్నాడు ఆ వేంకటాచలంలో నివసించే వరాహస్వామి మహిమను వర్ణించడానికి ఎన్ని సంవత్సరాలకైనా నా తరం కాదు. అంతటి మహిమాన్వితుడు ఆ దేవదేవుడు.

స్వామి పుష్కరిణికి దక్షిణ తీరంలో నీరజ లోచనుడు, భక్తులకు వరప్రదాత, లక్ష్మీదేవికి ఆశ్రయమైనవాడు అయిన శ్రీవేంకటేశ్వరుడు విలసిల్లుతున్నాడు. ఆ అచ్యుతుడు నిత్యం అందరికీ సులభంగా దర్శనమిస్తున్నాడు. బ్రహ్మ, రుద్రాది దేవతలు ఆయనను సేవించాలని కోరుకుంటారు.

**5.పర్వతం పేర్లు :** ఆ వేంకట పర్వతానికి అనేక నామాలున్నాయి. వాటిని ఉచ్చరించినంతనే పాపాలను హరిస్తాయి. శుభాలను కలిగిస్తాయి. అటువంటి పవిత్రమైన పేర్లను చెబుతాను విను. అంజనాద్రి, శేషాద్రి, వృషాద్రి (ధర్మగిరి), వృషభాద్రి, నారాయణాద్రి, సింహాద్రి, శ్రీశైలం (శ్రీపర్వతం, తిరుమల), గరుడాద్రి మొదలగు ఈ పవిత్రమైన నామాలను ప్రతిరోజు ప్రాతఃకాలంలో స్మరించేవారికి అనంతమైన పుణ్యం లభిస్తుంది. ఈ కలియుగంలో ఆ వేంకటాచలపతి యందు భక్తి కలిగిన భాగ్యవంతులు, పుణ్యాత్ములు తమ తమ అభీష్టాలను పొందుతున్నారు అని వసిష్ఠ మహర్షి అరుంధతికి వేంకటాచల వైభవాన్ని వివరించాడు.

**6. శ్రీవేంకటేశ పంచాక్షరి :** అరుంధతి తన తపస్సుకు సంప్రీతుడై సాక్షాత్కరించిన శ్రీనివాసుని శేషాద్రి వైభవాన్ని తెలియజేయమని కోరగా ఆ వేంకటాచలపతి "అరుంధతీ! సర్వలోకోపకారకమైన నా మాట వినుము. శ్రీవేంకటాద్రి యందును, స్వామిపుష్కరిణి యందును, శ్రీవేంకటేశ్వరుడనైన నాయందును భక్తి కలవారు ఆయురారోగ్యైశ్వర్యాలతోను, పుత్ర పౌత్రాదులతోను తులతూగుతారు. తమ బిడ్డలకు వేంకటాచలం యొక్క, స్వామిపుష్కరిణి యొక్క, నాకు సంబంధించిన పేర్లను పెట్టుకొనిన వారు సకల సంపదలు పొందుతారు. 'శ్రీవేంకటేశ' అనే పంచాక్షరిని ఎల్లప్పుడు జపించేవారు బ్రహ్మాది దేవతలకు కూడా పూజ్యులే. ఇందుకు సందేహం లేదు" అని సాక్షాత్తు శ్రీనివాసుడే అరుంధతికి ఆ వేంకట పర్వత వైభవాన్ని వివరించాడు.

**శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలోని గరుడపురాణభాగం సమాప్తం.**

## శ్రీ హరివంశములోని శేషధర్మ భాగం

**7. వేంకటాద్రికి మహర్షు ల రాక :** ఒకానొకప్పుడు ధర్మరాజు భీష్ముని వద్దకు వెళ్ళి 'పితామహా! పరమపూజ్యా! గాంగేయా! ప్రవక్తలలో శ్రేష్ఠులైన మీరు శ్రీనివాసుని మాహాత్మ్యాన్ని నాకు వివరించండి. దేవదేవుడు, వైకుంఠవాసి, సర్వవ్యాపియైన శ్రీమహావిష్ణువు వృషాద్రికి (ధర్మగిరికి) ఎలా వేంచేశాడో దయతో నాకు తెలియజేయండి' అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుకు ఇలా చెప్పాడు.

నాయనా! పూర్వం బ్రహ్మ మానసపుత్రుడు, మహాతేజశ్శాలి అయిన నారదుడు శ్రీహరిని దర్శించుటకై వైకుంఠమునకు వెళ్ళి, అక్కడ శ్రీహరిని దర్శించి, ఆయనను సేవించి పాలసముద్రం సమీపానికి వస్తుండగా ఆయన్ని చూసి ఋషులంతా పరమానంద భరితులైనారు. అగస్త్యాది మహర్షులు, వ్యాసమహర్షి శిష్యులందరూ కూడా చాలా సంతోషించారు. అప్పుడా మునులందరి అనుమతితో మహాతేజోవంతుడైన వ్యాసమహర్షి నారద మహర్షితో మిక్కిలి వినయంతో మహర్షీ! ఈ ప్రపంచంలో నీవొక్కడవే ధన్యుడవు. నీవలె నిరంతరం హరినామ సంకీర్తన చేసే విష్ణుభక్తుడు మరొకడు లేడు.

ఆహా! మానవులకు మోక్షాన్ని ప్రసాదించేవాడు నాశరహితుడైన విష్ణువే కదా! మీరు నిత్యం ఆయన్ని సేవిస్తున్నారు కావున మీరు కృతకృత్యులు. ధన్యులు. ఈ జగత్తును సృష్టించేవాడు, పోషించేవాడు, లయింపచేసేవాడు ఆ జనార్దనుడొక్కడే. అటువంటి జగత్ప్రభువును మీరు నిత్యం ఆరాధిస్తున్నారు కావున మీరు ధన్యులు. అనంతుడు, జగన్మయుడు, సర్వప్రాణులకు సంసార సముద్రమును దాటుటకు సేతువు వంటివాడు, సంసార బంధాలను ఛేదించే వాడు అయిన శ్రీహరిని మీరు ఆరాధిస్తున్నారు. ఓ మునిశ్రేష్ఠా! పరమ ధార్మికా! మేమందరం ఆ జనార్దనుని దర్శించాలనే కోరికతో ఆయన యందే మనస్సులను లగ్నం చేసి ఇక్కడకు వచ్చి యున్నాము" అని చెప్పాడు.

**8.వైకుంఠ వార్త :** ధర్మజా! వ్యాసుడీ విధంగా పలికినంతనే విని వేదవేత్తలలో శ్రేష్ఠుడు, ధీమంతుడునైన నారదమహర్షి ఆ ఋషులతో 'ఓ మహర్షులారా! నేను ధన్యుడను. మీకందరకు శుభమగుగాక! మీరంతా సర్వజీవుల హితం కోరేవారు. శాస్త్రాలతోను, ధర్మాలతోను, భక్తితోను ఎల్లప్పుడు లోకములను, ప్రజలను రక్షించగోరే వారు. వైకుంఠ లోకంలో పుట్టిన ఒక పరమ పవిత్రమైన వార్తను నేను విన్నాను. ఓ సత్పురుషులారా! ఆ కథను మీకు చెబుతాను వినండి.

మహామాయావి (ఆశ్చర్యగుణ విశిష్టుడు), పరమానంద స్వరూపుడు అయిన శ్రీమన్నారాయణుడు ఉత్తమమైన వైకుంఠమును వదలి లక్ష్మీదేవితో స్వామిపుష్కరిణి తీరంలో విహరిస్తున్నాడు. అద్భుతము, ఆశ్చర్యకరమునైన ఈ వార్తను విని ఇంద్రునితో సహా మరుద్గణములు శ్రీవేంకటాచలంపై వేంచేసి ఉన్న శ్రీహరిని సేవించడానికి ఉద్యుక్తులయ్యారు. నేను కూడా జగద్గురువును దర్శించడానికి బయలుదేరాను. ఓ మహర్షులారా! మనమిక్కడ నుండి ఆయన్ని దర్శించలేము కదా! కాబట్టి మనమందరం అక్కడకు వెళ్ళుదామనుకొని వారంతా ఆకాశానికెగిరారు. తపోధనులైన అగస్త్య ప్రముఖులైన ఆ

మహర్షులందరు ఆకాశమార్గంలో పయనించి, శ్రీహరి వేంచేసి యున్న ధర్మగిరిని, వృషాద్రిని చేరారు.

**9. శ్రీవేంకటాద్రిపై మహాత్ములు :** ఆ మహర్షులంతా స్వామిపుష్కరిణి తీరాన్ని చేరి, అందులో స్నానమాచరించి, ఆ పవిత్ర జలాన్ని త్రాగి, శ్రీహరిని దర్శించుటకై అక్కడ సంచరిస్తూ వారంతా పశ్చిమ దిశకు వెళ్ళారు. విష్ణుతత్పరులైన ఆ మునులు అక్కడ మేరు మందర పర్వత సదృశమైన మహాకారాన్ని సందర్శించారు. ఆయన వేయి సూర్యుల కాంతితో ప్రకాశిస్తున్నాడు. ఆయన నేత్రాలు మెరపుల వలె మెరుస్తున్నాయి. సకలాయుధాలను ధరించిన ఆ దేవుని దర్శించి వారంతా మహాశ్చర్యాన్ని పొందారు.

ఆ తరువాత వారంతా ఆ పుష్కరిణీ తీరమునుండి దక్షిణ దిక్కుకు వెళ్ళారు. అక్కడ వారికి రాక్షసులు, అసురులు, దానవులు, మాంసాహారులైన భూతవిశేషాలు కనబడినవి. వారంతా భగవంతునికి నమస్కరిస్తూ ఆయన్నే ధ్యానిస్తూ ఆయన నామాన్ని జపిస్తున్నారు. వారిని చూచి ఆశ్చర్యచకితులై ఆ మహర్షులందరూ తూర్పు దిక్కునకు వెళ్ళారు.

**10. దేవేంద్రుని ధ్యానం :** అక్కడ వారు సమాసీనుడై ఉన్న దేవేంద్రుని చూచారు. ఆయన "జగత్ప్రభువు, సాక్షాత్తు శ్రీహరి స్వరూపుడైన శ్రీనివాసుని, ఎప్పుడు సందర్శిస్తాను? ఆయనను దేవతలంతా సేవిస్తుంటారు. యక్షులు, కిన్నరులు, గంధర్వులు, చారణులు మొదలగు వారు స్తుతిస్తుంటారు. సిద్ధులు, కింపురుషులు, ఋషులు, అప్సరోగణాలు స్తోత్రాలు చేస్తుంటారు.

యోగులకు కూడా దుర్లభమైన ఆయన దివ్య స్వరూపాన్ని సందర్శించే భాగ్యం నాకు ఎప్పుడు కలుగుతుందో! ఓ దేవదేవా! నా జన్మ ఎప్పుడు సఫలమౌతుందో కదా! ఓ ఆర్తత్రాణ పరాయణా! నీ దివ్య దర్శన భాగ్యాన్ని ప్రసాదించు. సర్వప్రాణులకు నీవే దిక్కు. దేవతలకు కూడా మోక్షప్రదాతవు నీవే. ఓ జగన్నాథా! రక్షించు. రక్షించు. నీకు మరల మరల నమస్కరిస్తున్నాను" అని ఆ దేవదేవుని స్తుతిస్తూ ప్రార్థిస్తున్నాను.

**11. ఆనంద పారవశ్యం :** వేంకటాద్రికి ముందుభాగంలో, స్వామిపుష్కరిణీ తీరంలో దేవతలతో కలిసి కూర్చుని ఆ పురుషోత్తముని ధ్యానిస్తున్న దేవరాజైన పురందరుని చూచి విస్మితులైన అగస్త్య ప్రముఖులైన మహర్షులందరు జనార్దనుని దర్శింపగోరి ఉత్తర దిక్కుకు వెళ్ళారు. అక్కడ సప్తద్వీప వాసులైన బ్రాహ్మణ శ్రేష్ఠులను, రాజులను, ముని సమూహములను, వేదవేత్తలైన భూసురులను, భూలోకవాసులైన మానవులను చూచి మహాత్ములు, శుద్ధజ్ఞాన స్వరూపులైన ఆ మహర్షులెంతో సంతోషించారు. వారిలో కొందరు భగవంతుని స్తుతిస్తున్నారు. మరికొందరు ఆనందపరవశులై నాట్యం చేస్తున్నారు. ఇంకొందరు స్వామికి నమస్కరిస్తున్నారు. కొందరు ఆనంద బాష్పాలను విడుస్తున్నారు. కొందరు దుముకుతూ గంతులేస్తున్నారు. కొందరు పాటలు పాడుతూ అంతటా కలయతిరుగుతున్నారు.

దేహధారులకు రాత్రివేళ చంద్రుడు నేత్రము. పగటివేళ దీనార్తిహరుడైన సూర్యుడు వెలుగును ప్రసాదిస్తున్నాడు. శ్రీమహావిష్ణువు ఒక్కడే అయినప్పటికీ అనేకవిధాలుగా విభిన్న రూపాలతో విరాజిల్లుతున్నాడు. ఆయన సకల జనులను, స్వర్గంలోని దేవతలను సృజించినవాడు. ఆ కృపానిధి సర్వలోక హితార్థమై ఆ పర్వతంపై వెలసి సర్వులకు ఆరాధ్యుడైనాడు.

**12. జగన్నాథుని ఆరాధన :** ఆ జనార్దనుని కొందరు అడవిలోని ఫలపుష్పాదులతోను, మరికొందరు వివిధ స్తోత్రాలతోను, జపాలతోను, వేదపారాయణాలతోను ఆరాధిస్తున్నారు. ఇంకొందరు ధూపదీపాలతోను, గంధమాల్యాదులతోను, మరికొందరు సామగానంతోను, ప్రకాశించే స్వర్ణ కుంభాలతోను, తోరణాలతోను, పతాకాలతోను ఆ దేవదేవుని సేవిస్తున్నారు.

మరికొందరు విచిత్ర కుసుమాలతోను, తులసీదళములతోను, గన్నేరుపూలతోను, జాజి, మల్లె, మొగలి, సంపెంగ పుష్పాలతో ఆ శ్రీనివాసుని పూజిస్తున్నారు. భూసురులు, ఋషులు కలశాలలో నీటిని నింపి, కమండలములతోను, నీటిని తెచ్చి వేద మంత్రాలను పఠిస్తూ, ఆ మంత్రాలతో పవిత్రమైన ఆ జలాలతో స్వామికి అభిషేకం చేస్తున్నారు.

ఇంకొందరు ఆకు కూరలతోను, కందమూలాలు, ఫలాలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తున్నారు. శుద్ధోదకంతో, మంత్రపుష్పాలతో, ధ్యానాలతో, స్తోత్రజపాలతో ఆ మధుసూదనుని అర్చిస్తున్నారు. ఆ జగత్ప్రభువు ఈవిధంగా వారందరి పూజలందుకుంటూ స్వామిపుష్కరిణి తీరంలో విరాజిల్లుతున్నారు.

అక్కడ కొందరు 'శ్రీహరీ! మురారీ! పురుషోత్తమా!' అని శ్రీహరిని కీర్తిస్తున్నారు. పరస్పరం ఆనందంతో ఆలింగనం చేసుకుంటున్నారు. కొందరు మౌనం వహించి ఉన్నారు. ఇంకొందరు సంతోషంతో నవ్వుతున్నారు. మరికొందరు స్వామిని ధ్యానిస్తున్నారు. కొందరు మురారికి అభిషేకం చేయడానికి పూర్ణ కలశాలను తెస్తున్నారు. సుగంధ పరిమళాన్ని వెదజల్లే పుష్పాలను, కర్పూరము, కస్తూరి మొదలగు సుగంధ పరిమళ వస్తువులను తీసికొని దేవతలు, మనుష్యులు, యోగులు మొదలైన వారందరూ కూడా ఆ వృషభాద్రి నాథుని కొరకు అన్వేషిస్తూ ఆ వేంకటాచలంపై సంచరిస్తున్నారు.

**13. దేవదేవుని దివ్యదర్శనం :** దేవతలు, మహర్షులు, గంధర్వులు ఆ విధంగా సంచరిస్తుండగా, వారంతా ఆ దేవునికై ప్రార్థిస్తూ, జపిస్తూ, తపిస్తుండగా ఆ పర్వతమందంతటా పుష్పవృష్టి కురిసింది. భేరీలు, మృదంగాలు, మద్దెలలు, తప్పెటలు మొదలగు వాద్య ధ్వనులతోను, శంఖధ్వానాలతోను, బాకాలు మొదలైన వాటి ధ్వనులతో ఆ పర్వతమంతా మార్మోగింది.

అప్పుడు మేరు మందర పర్వతముల వంటి, స్వర్ణమయములై

రత్నఖచితములైన దివ్య విమానాలతో ప్రకాశిస్తూ, కోటి సూర్యులకాంతితో వెలుగొందుతూ, కోటి చంద్రుల వలె మిక్కిలి చల్లని వాడై స్వర్గలోకము నుండి భూలోకం వరకు వ్యాపించిన రూపంతో స్వామిపుష్కరిణి తీరంలో సూర్య మండలం వలె ప్రకాశిస్తున్న దేదీప్యమానమైన దివ్య విమానంలో దేవతలచే సేవించబడుచు ఆ లక్ష్మీపతి, జగత్ప్రభువైన శ్రీనివాసుడు వేంచేసి సర్వులకు సాక్షాత్కరించాడు.

బ్రహ్మరుద్రేంద్రాదులు, సూర్యచంద్రులు, యముడు, అగ్ని, కుబేరుడు, వరుణుడు, నిర్‌ఋతి, వాయువు, అష్టవసువులు, అశ్వినీదేవతలు, బ్రహ్మాది దేవతా గణాలన్నీ ఆయన్ని సేవిస్తున్నాయి.

**14. జగదేక బంధువు :** ఆయన పితృదేవతలకు తండ్రి. దేవతలకుజనకుడు.బిడ్డలకుతల్లివంటివాడు.మహాత్ములకుమహా మహితాత్ముడు. ప్రియురాళ్ళకు భర్త వంటివాడు. జనులందరికీ జ్ఞానమనే తేజస్సును ప్రసాదించే సూర్యుని వంటివాడు. దారిద్ర్యంతో కృశించే వారికి నిధివంటివాడు, శాంతిస్వరూపుడు, జగదేకబంధువు, ప్రశాంత ధామమైన వైకుంఠవాసి, జగన్నివాసి అయిన ఆ వృషభాద్రినాథుడు దేదీప్యమానమైన దివ్యశరీరంతో, లక్ష్మీసహితుడై ఆవిర్భవించాడు.

**15. శ్రీనివాస సేవ :** కావున ఓ ధర్మరాజా! నీవు జగద్గురువు, సచ్చిదానంద స్వరూపుడు, భక్తి ముక్తి ఫలప్రదాత అయిన శ్రీనివాసుని ఆరాధించడానికి వేంకటాచలానికి వెళ్ళు. బ్రహ్మహత్యాది మహాపాతకాలు, ఇంకను సర్వపాపములు ఆయన స్మరణ మాత్రం చేతనే నశిస్తాయి. ఆ శ్రీనివాసుని సేవించుటకు వంశంలో ఎవరో ఒకరు వెళ్ళితే ఆ వంశంలోని వారంతా తరించి ముక్తిని పొందుతారనడంలో ఎట్టి సందేహం లేదు. భూలోకంలోని సకల పుణ్యక్షేత్రాలు సర్వతీర్థాలు, మందిరాలన్నీ కూడా ఆ జగన్మయుడైన శ్రీనివాసుని సేవిస్తున్నాయి.

**16. అనుగ్రహ భాగ్యం :** ఈ పుణ్యచరిత్రను శ్రద్ధగా వినే మానవులకు ముక్తి కరతలామలకంగా సిద్ధిస్తుంది. ఇక శ్రీవేంకటాచలమునకు వెళ్ళి, కరుణాపయోనిధి, ఆశ్రిత వత్సలుడు, ఆర్తిహరుడైన ఆ వేంకటేశ్వరుని సేవించి, ఆయన దివ్యానుగ్రహమునకు పాత్రులయ్యేవారి అదృష్టాన్ని, భాగ్యాన్ని, వైభవాన్ని ఏమని చెప్పాలి? అని భీష్ముడు ధర్మరాజుకు శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని, శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని వివరించాడు.

**శ్రీవేంకటాచల మాహాత్మ్యములో శ్రీహరి వంశాంతర్గతమైన శేషధర్మభాగం సమాప్తం**

# అంతర్యామి ఆ వేంకటేశుడే

**- బండారు పురుషోత్తం**

అంతటా వ్యాపించినవాడు, స్మరించినంతనే అభయమిచ్చువాడు, శరణు జొచ్చిన భక్తుని కాపాడుటే అతని మహోన్నత ప్రేమ. అట్టి శ్రీవేంకటేశ్వరుడే మా అంతర్యామి. వేరొక్క దైవము లేదు అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు.

ఇతరుల నెవ్వరినీ మేమడుగము. మేమడిగినది లేదనకుండా ఇచ్చే దాత ఇతడే. ఇతనిలాగా వేరెవ్వరూ ఇవ్వలేరు. ఇతడు దేవతలకు దేవుడు. ఆదిపురుషుడు శ్రీహరి. లక్ష్మీదేవిని వక్షమందు ఉంచుకొన్నవాడు. శ్రీవత్సమను పుట్టుమచ్చను రొమ్ముమీద గలవాడు. జగత్తు అంతటా వ్యాపించినవాడు. సముద్రాలకీవల గాని, ఆవల గాని అతనిదే అధికారము. మన్మథునికి తండ్రి, గురువు ఇతడే. మాకు దగ్గరైనవాడు.

విశ్వానికంతా ఏకైక దైవము. అతనికి నాశనం లేదు. శాశ్వతుడు. గజమును రక్షించి, వరములిచ్చినవాడు. అంతము లేనివాడు. మమ్ములను కాచిన దైవము. వేదములచే కీర్తింపబడిన వాడు. మాకు నిజమైన బంధువు.

కలిదోషము లెన్ని ఉన్నా నశింపచేయువాడు. కైవల్యమును ప్రసాదించువాడు. ఇన్నీ తానై ఉన్నవాడు శ్రీవేంకటేశ విభుడు. మమ్ము చల్లగా చూచువాడు. తన బలంతో రక్షించువాడు. మా తల్లి, తండ్రి కూడా అతడే. ఆతడే మా అంతర్యామి.

**ఇతరుల నడుగము యితడే మా దాత**<br>
**యితని యీలి వారు లియ్యగ గలరా (పల్లవి)**<br>
**దేవదేవుడాదిమ పురుషుడు హరి**<br>
**శ్రీవత్సాంకుడు, చిన్మయుడు**<br>
**యీవల, నావల ఇలవేలునతడు**<br>
**భావజ గురుడు, మాపాలిటివాడు (చరణం-1)**<br>
**జగదేక గురుడు, శాశ్వతుడచ్యుతు**<br>
**దగజకు వరదుడు, అనంతుడు**<br>
**తగి మము నేలిన దైవము యేలిక**<br>
**నిగమమూర్తి, మా నిజబంధువుడు (చరణం – 2)**<br>
**కలిదోషహరుడు, కైవల్యవిభుడు**<br>
**అలరిన శ్రీవేంకటాధిపుడు**<br>
**చలిమి, బలిమి, మా జననియు, జనకుడు**<br>
**అలమి యితడు, మా అంతరాయమి (చరణం – 3)**

**(అన్నమాచార్యుల, ఆధ్యాత్మ సంకీర్తనములు – సంపుటి– 3, కీర్తన నెంబర్. 526)**



# శివరాత్రి

- డాక్టర్ దేవులపల్లి పద్మజ

**ఓం కైలాస శిఖరావాసం**
**హిమవద్గిరి సంస్థితం!**
**నీలకంఠం త్రినేత్ర చ తస్మే**
**మనశ్శివ సంకల్పంతో!!**

మాఘమాస బహుళ చతుర్థి తిథి నాడు మహాశివరాత్రి పర్వదినం భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ప్రతీ నెలలోనూ బహుళ చతుర్థి తిథి సంభవిస్తుంది. ఆ రోజులలో మాసశివరాత్రి పర్వదినంగా జరుపుకుంటాము. పరమేశ్వరునికి చతుర్థి తిథి పూజలు అత్యంత ప్రీతికరం. ఈ పర్వదిన ప్రాశస్త్యాన్ని లింగపురాణము, పద్మపురాణము, స్కంధపురాణము వంటి ప్రముఖ పురాణాలలో విపులంగా వివరించబడినది.

భారతీయ సంస్కృతికి చెందిన అన్ని పండుగలకు భిన్నంగా ఈ మహాశివరాత్రి పర్వదినాన్ని రాత్రి సమయంలో జరుపుకుంటారు. మహాశివరాత్రి పర్వదినం అర్ధరాత్రి సంభవించే లింగోద్భవకాలం అజ్ఞాన, అంధకార నాశనానికి చిహ్నంగా చెబుతారు. శివ పార్వతులు కైలాసంలో ఆనంద తాండవం చేసే శుభ సమయాన అతి స్వల్ప ప్రయత్నంతో కోరిన అన్ని కోరికలు సిద్ధించి సుఖసంతోషాలు కలుగుతాయని నమ్మకం. శివరాత్రి నాడు జరిపే ప్రతీ పూజ, అభిషేకం, స్మరణ, దానం వంటివి మానవ కళ్యాణానికి దోహదం చేస్తూ శివ తత్వంలో మమేకమై పోవటానికి దోహదం చేస్తుంది. సకల ఐశ్వర్య ప్రదాత పరమేశ్వరుడు. అయినప్పటికీ ఆయన నిర్వికారుడు, నిరాడంబరుడు, ఆదర్శవంతుడు. అటువంటి పరమేశ్వరుని లీలావిభూతులు అర్థం చేసుకోవటం అంత సులభతరం కాదు. జ్ఞాన మార్గానికి తద్వారా చేకూరే మోక్ష మార్గానికి అవరోధంగా నిలిచే అజ్ఞానం రాత్రికాలం నాటి అంధకారము. దాన్ని అధిగమించి శివతత్వాన్ని మనలో జాగృతం చేసే పరమోత్కృష్ట పర్వదినం శివరాత్రి.

శ్రీమహావిష్ణువు మరియు బ్రహ్మ దేవుల మధ్య సంభవించిన కలహాన్ని అంతం చేయటానికి పరమేశ్వరుడు మొట్టమొదటిసారిగా లింగ రూపం ధరించినది ఈ రోజు అని పురాణాలు తెలియచేస్తున్నాయి. దీని సంకేతంగా ఈ రోజు అర్ధరాత్రి లింగోద్భవకాలంగా ఆచరిస్తారు. దేవ దానవులు జరిపిన సముద్ర మథనంలో ఉద్భవించిన హాలాహలం తన కంఠంలో ధరించి లోకాలను కాపాడిన రోజుగా కూడా శివరాత్రి ప్రసిద్ధి చెందినది. అంతేకాకుండా పార్వతిని పరిణయమాడిన రోజుగా కూడా మహాశివరాత్రిని భావిస్తారు.

ఉపసమీపే యో వాసః జీవాత్మా పరమాత్మనోః
ఉపవాసః సవిఘ్నేయ సర్వ భోగ విసర్జితః

**- వరాహోపనిషత్తు**

ఉపావృత్తస్య పాపేభ్యో యస్సవాసో గుణైః సహా
ఉపవాసః సవిఘ్నేయ సర్వ భోగ వివర్జితః

**- భవిష్య పురాణము**

ఉపవాసం అంటే వ్రతం చేసే వారి ఇష్ట దైవం దగ్గర నివసించటం. మహాశివరాత్రి నాటి ఉపవాసానికి అత్యంత విలువ సంతరించుకున్నది. మానవుడు తన దైనందిన జీవితంలో ఆహార విహారాలకు సమయాన్ని వెచ్చించి, అదే పరమావధిగా జీవిస్తూ ఉంటాడు. కనీసం ఈ ఒక్క రోజైనా వాటికి దూరంగా

ఉంటూ శివ నామ సంకీర్తనలతో కాలం గడిపినట్లయితే శివతత్వం జాగృతం అవుతుంది. అది లోక కల్యాణ కారకం అవుతుంది. స్నాన, సంధ్యానుష్ఠానాలను పూర్తి చేసుకుని శివుని మనసా ధ్యానించి పూజ నిర్వహించాలి. ఇంటి వద్ద నిర్వహించే పూజలో స్ఫటిక లింగం గాని, నర్మదా నది బాణ లింగాన్ని గాని, మట్టితో చేసిన పార్థివ లింగం గాని ఉపయోగించ వచ్చును. బిల్వ దళాలతో, సుగంధ జలాలతో, పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ విభూతితో పరమేశ్వరుని ఈ రోజు అర్చించటం జరుగుతుంది. అతి సులభంగా ప్రకృతిలో లభించే ఈ పదార్థాలన్నీ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికారకాలు మరియు ఔషధ గుణ సంపన్నమైనవి. ''ఓం నమశ్శివాయ'' అంటూ చేసే పరమేశ్వర నామ సంకీర్తన మనలోని సర్వేంద్రియాలను ఉత్తేజితం చేసి శరీరంలో ఉద్దీపనం కలుగ చేస్తుంది. బీజాక్షర సంయుక్తమైన ఈ నామ జపం ప్రకృతిలో సద్భావనలు ప్రేరేపించి వైకల్యాలను నిరోధిస్తుంది. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు మరియు భోళా శంకరుడు. కొద్దిపాటి నామ స్మరణతోనే సంతృప్తి చెంది సర్వదోషాలను, సమస్త పాపాలను, సర్వ రోగాలను పరిహరిస్తాడు. నమక, చమక, మన్యుసూక్త సహిత మహన్యాస పూర్వక రుద్రాభిషేక ఫలితం వర్ణించటం ఎవరి వలనా కాదు. ''శివా విశ్వాయ భిషజే'' అంటే విశ్వములోని అన్ని రోగాలకు శివుడే వైద్యుడు.

పరమేశ్వరునికి బిల్వదళాలు అత్యంత ప్రీతిపాత్రమైనవి. ''త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రిఆయుధం త్రిజన్మ పాపసంహారం ఏక బిల్వం శివార్పణం'' అంటూ భక్తులు ఈశ్వరుని అర్చిస్తారు. ఈ రోజు జరిపే బిల్వదళ పూజ అత్యంత ప్రాముఖ్యమైనది. బిల్వదళం త్రికాలాలకు, త్రిగుణాలకు, త్రిమూర్తులకు, పరమేశ్వరుని మూడు కన్నులకు, పరమేశ్వర ఆయుధమైన త్రిశూలానికి ప్రతీక. నిష్కల్మషమైన మనస్సుతో సమర్పించే బిల్వదళం పరమేశ్వర అనుగ్రహానికి దోహదం చేస్తుంది. స్కంద పురాణాన్ని అనుసరించి బిల్వదళం పార్వతీదేవి యొక్క స్వేదబిందువు నుండి ఉద్భవించినది అని చెబుతారు. పార్వతీదేవి ప్రతీక అయిన బిల్వదళ సమర్పణ పార్వతీ పరమేశ్వరులకు ప్రీతిపాత్రమైనది. అంతేకాకుండా శ్రీ మహాలక్ష్మీ కూడా బిల్వ వృక్షంలో కొలువై ఉంటుంది. అందుచేత బిల్వదళార్చన ప్రశస్తమైనది. ఈ బిల్వదళం ఔషధీ ఫలవంతమైనది. త్రిపురాసుర సంహారార్థమై పరమేశ్వరుడు చేసిన ఘోర తపస్సు కారణంగా ఆయన కంటినుండి ఉద్భవించిన నీరు భూమిపై రుద్రాక్షలుగా అవతరించాయని పెద్దలు చెబుతారు. ఈ కారణంగా శివునికి ప్రీతిపాత్రమైనదిగా చెప్పవచ్చును. రుద్రాక్షలలో అనేక రకాలున్నాయి. వీటితో శివుని అర్చించి, ధరించటం వలన అనేక శుభాలు కలుగుతాయని విశ్వాసం. రుద్రాక్షలకు కూడా అనేక ఔషధగుణాలున్నాయి. అన్ని పరమేశ్వరాలయాలలో లోక కల్యాణార్థమై పార్వతీ పరమేశ్వర కళ్యాణాలను వేడుకగా నిర్వహిస్తారు. దీనిని వీక్షించినట్లయితే అవివాహితలకు త్వరలోనే పరమేశ్వరుని వంటి ఆదర్శమూర్తి భర్తగా లభిస్తాడని, వివాహితల సంసారం ఆనందదాయకంగా సాగుతుందని విశ్వసిస్తారు. కన్నుల పండువగా సాగే శివ కళ్యాణ మహోత్సవం సర్వ మంగళకారకమైనదిగా భావించవచ్చును.

**"అహింసా ప్రథమం పుష్పం - పుష్ప మింద్రియ నిగ్రహః**
**సర్వ భూత దయా పుష్పం - క్షమా పుష్పం విశేషతం !!**
**శాంతి పుష్ప తపః పుష్పం - ధ్యాన పుష్పం తద్దైవచ**
**సత్యమీష్ట మిదం పుష్పం - శివ ప్రీతికరం భవేత్ !! "**

అహింస, ఇంద్రియ నిగ్రహం, సర్వభూత దయ, క్షమ, శాంతి, తప, ధ్యాన మరియు సత్యము వంటి అష్ట కుసుమాలతో సాగే అర్చన సర్వ శుభ శ్రేయోదాయకమైనది.

శివ మహాపురాణములో మానస అష్ట పుష్పములను సదాశివమూర్తికున్న అష్ట నామాలతో అనుసంధానము చేస్తూ వివరించటం జరిగింది.

**1.శివాయ నమః** – అన్నింటికీ శుభము కలిగించు వాడా ! నీకు ఇదే నా నమస్కారము

**2. మహేశ్వరాయ నమః** – సంధాన, తిరోధాన కర్తవైన నీకు నమస్కరిస్తున్నాను

**3. రుద్రాయ నమః** – సర్వ ఆపదలను నివారించువాడవైన నీకు అంజలి సమర్పిస్తున్నాను

**4. విష్ణవే నమః** – సర్వే సర్వత్రా వ్యాపించియున్నవాడవైన నీకు కైమోడ్పులివియే

**5. పితామహాయ నమః** – అన్నిటికీ మూలకారకుడైన వాడా! నీకు ఇదే నా నమస్కారములు

**6. సంసార భిషజే నమః** –సమస్త ప్రాపంచిక రుగ్మతలను దూరం చేసే వైద్యుడైన శివా! నీకు నమస్సుమాంజలి

**7. సర్వజ్ఞాయ నమః** – అన్నీ తెలిసిన మహావిద్యన్మూర్తీ! ఇవే నా నమస్కృతులు

**8. పరమాత్మాయ నమః** – అన్నిటికీ అతీతుడైనట్టి భగవంతుడా! ఇవే నా నమస్సుమాంజలి

పరమేశ్వర పూజలో కేతక, తులసి, చంపక పుష్పాలను ఉపయోగించరు. శివరాత్రి జాగరణ విశేష ఫలవంతమైనది. మంత్ర, తంత్ర, అభిషేక, అర్చన, హోమాలతో మహాశివరాత్రి శోభాయమానంగా సాగుతుంది.

శివ పూజ మనసా, వాచా నిర్వహించిన వారు మృత్యువును కూడా జయించవచ్చును. మార్కండేయ చరితమే ఇందుకు ఉదాహరణ. మనమందరము శివ సంకల్ప దీక్షను ధరించి పరమేశ్వరుని అర్చించి ఆయన కరుణా కటాక్ష వీక్షణలకు పాత్రులగుదాం. ఓంనమశ్శివాయ

**సర్వేజనాఃసుఖినోభవన్తు**

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

"జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం
పాణిద్వంద్వ సమర్చయాచ్యుత కథా: శ్రోత్రద్వయ త్వం శృణు।
కృష్ణం లోకయ లోచనద్వయ హరేర్గచ్ఛాంఘ్రి యుగ్మాలయం
జిఘ్ర ఘ్రాణ ముకుంద పాదతులసీం మూర్ధన్నమాధోక్షజమ్ "॥

ఇంద్రియ నిగ్రహం రెండు రకాలు. చేయకూడని వానినుండి మరలించుట, చేయవలసిన వానిని చేయుట. ఈ శ్లోకమందు జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనస్సులచే చేయదగిన వానిని చెప్పుచున్నారు.

ఓ నాలుకా! కేశవుడిని గురించి పాడుము. ఓ మనసా! మురవైరిని (మురుడు అనే అసురుడు యొక్క శత్రువైన శ్రీమహావిష్ణువుని) భజించుము. ఓ చేతులారా! శ్రీధరుడిని చక్కగా ఆరాధించుము. చెవులారా! అచ్యుతుని కథలు ఆలకించండి. కన్నులారా! శ్రీకృష్ణపరమాత్మను చూడండి. పాదములారా! శ్రీహరి సన్నిధికి నడవండి. ఘ్రాణమా (నాసికా)! ముకుందుడి పాదముల యందు సమర్పించిన తులసి పరిమళాన్ని ఆస్వాదించండి. ఓ శిరమా! అధోక్షజుని నమస్కరింపుము.

"జిహ్వే కీర్తయ కేశవం" - పరమాత్మ యొక్క కేశ సౌందర్యములను శ్రీమద్రామాయణంలో వాల్మీకి మహర్షి ఇలా చెప్తారు "కాక పక్ష ధరౌ వీరౌ" అందమైన జంపములు కలిగి ఉండడం అలాగే ఐశ్వర్య లక్షణము.

కృష్ణపరమాత్మ కేశసౌందర్యానికి ముగ్ధులైన గోపికలు "కుటిలకుంతలం" అని వర్ణిస్తారు. కాబట్టి ఓ నాలుకా మనసు

పరమాత్మ యందు లయించినంత మాత్రాన కీర్తిస్తుందా? ఆ పని నువ్వే చేయగలవు అత్యంత సుందరమైన కేశములు కలిగిన కేశవుడిని కీర్తించుము.

"మురరిపుం చేతో భజ" – ఓ మనసా ఇతర ఇంద్రియములను తలచి నిన్ను మరిచిపోయానను కోకు, నీవు మురాసురుడిని సంహరించిన శ్రీమహావిష్ణువుని భజించుము.

"పాణిద్వంద్వ శ్రీధరం సమర్చయ" – ఓ చేతులారా! కేవలం భగవత్కీర్తనము చేస్తే చాలదు శ్రీధరుడిని చక్కగా అర్చించండి.

శ్రీధరుడు అంటే – "తాం రత్నమివార్చిషం పుష్పమివ సురభిం ఇందురివ చంద్రికాం అమృత మివ స్వాదుతాం ఔత్పత్తికేన సమ్బన్ధేన ధరతీతి శ్రీధరః"– రత్నము కాంతివల్ల శోభించినట్లు, పుష్పము సువాసనచేత వాసికెక్కినట్లు, చంద్రుడు వెన్నెలతో వెలుగులు పొందినట్లు లక్ష్మీదేవిని తన యొక్క వక్షస్థలంలో ధరించడం వల్ల పరమాత్మకు ప్రకాశం కలగడంచేత శ్రీధరుడు.

"శ్రోత్రద్వయ అచ్యుత కథాః త్వం శృణు" – చెవులారా! పరమాత్మ (అచ్యుతుని) యొక్క కథలు వినండి అప్పుడే భక్తి కలిగి పూజించాలని కోరిక కలుగుతుంది.

అచ్యుతుడు అంటే అర్థాలు తెలుసుకుందాము "తేభ్యః ప్రపన్నేభ్యో నాపగతః అచ్యుతః" అంటే ప్రపన్నులైనవారిని ఒక్క క్షణమైనా విడిచి దూరముగా ఉండక అంటిపెట్టుకుని ఉండేవాడు అని అచ్యుత శబ్దానికి అర్థం.

"యస్మాన్నచ్యుత పూర్వోహ మచ్యుతస్తేన కర్మణా" – నేను ఎప్పటికి భక్తులను విడిచి ఉండను కనుక అచ్యుతః అని పరమాత్మే స్వయంగా పాంచరాత్రమున సెలవిచ్చారు.

"కృష్ణం లోకయ లోచనద్వయ" – ఎన్ని విధాలుగా విన్నా కూడా భక్తి కుదరదు సాక్షాత్కరించు కుంటే భక్తి బాగా కుదురుతుంది. కాబట్టి ఓ కన్నులారా! కృష్ణపరమాత్మ యొక్క రూపాన్ని దర్శిస్తూ ఉండండి.

ఏమిటి కృష్ణ అంటే "ఏవం విధ లీలారసేన నితాన్త నిర్వృతః ఇతి కృష్ణః" అంటే సృష్ట్యాదులనే వ్యాపారములను నిర్వహిస్తూ ఆ లీలతో మిక్కిలి తృప్తి లేదా ఆనందించువాడు. అటువంటి కృష్ణపరమాత్మను చూడండి కన్నులారా.

"హరేర్గచ్ఛాంఘ్రియుగ్మాలయం" – ఓ పాదములారా! మీరు నడిచి వెళ్తేనే కదా భగవద్దర్శనం కలిగేది కాబట్టి శ్రీహరి సన్నిధికి వెళ్ళండి.

చేతనాచేతనాత్మకమైన సమస్త ప్రపంచమున వ్యాపించువాడు, సమస్త దోషములను హరించు వాడు శ్రీమహావిష్ణువు.

"జిఘ్ర ఘ్రాణ ముకుంద పాదతులసీం" – ఓ నాసికా! శ్రీమన్నారాయణుడి సన్నిధికి వెళ్లిన తరువాత ఇతరమైన వాసనలు చూడకు కేవలం పరమాత్మ యొక్క పాదపద్మములపై ఉండే తులసి యొక్క పరిమళాన్ని సువాసించుము.

"మూర్ధన్నమాధోక్షజమ్" – అమృతపు సముద్రమువలె ఎంతమంది ఎంత ఉపయోగించుకున్న తరగని మాధుర్యము కలవాడు అయిన మనోవాక్కాయములకు అందనివాడు, ఇంద్రియముల చేత కలిగే జ్ఞానముకు గోచరించనివాడు, అధోక్షజుడికి వినయముతో ఓ శిరమా! నమస్కరింపుము. అంటూ కులశేఖరాళ్వార్లు ఆయా ఇంద్రియాలకు భగవద్ సంబంధం కలిగేటట్టుగా చెయ్యమని సెలవిస్తున్నారు.

అమృతపు సముద్రమువలె ఎంతమంది ఎంత ఉపయోగించుకున్న తరగని మాధుర్యము కలవాడు అయిన మనోవాక్కాయములకు అందనివాడు, పండరీపురం లోని పాండురంగడు. ఈ భక్తవత్సలుడు శిల్పి చెక్కిన శిల్పం కాదు భక్తులకోసం శిల్పంగా మారిన కరుణామూర్తి.

భక్తవత్సలుడైన పాండురంగని పరమభక్తిలో నడచి తరించిన భక్త పుంగవులలో ముఖ్యుడైన నామదేవుల వారు ఒకనాడు ఆలయంలో సంకీర్తన చేయుచుండగా విఠల నాథుని నేత్రముల వెంట కన్నీరు కారడం జరుగుతుంది. ఆ దృశ్యాన్ని గాంచి వ్యాకుల చిత్తుడైన నామదేవుల వారు, స్వామీ నీ నేత్రముల కంట కన్నీరు ఎందుకు కారుతోందని పాండురంగని ప్రార్థిస్తాడు.

అప్పుడు ఆ భక్తపెన్నిధి "నామదేవా! పరమ భాగవతుడు, భక్తాగ్రగణ్యుడైన చోఖామేళా, కూలి పనికి వెళ్లి అక్కడ ఒక గోడ కూలగా, తోట కూలీలతో పాటు తాను కొన్ని క్షణాల క్రితమే కన్నుమూశాడు. నిరంతరం నన్నే స్మరిస్తూ, సమభావంతో జీవిస్తూ, త్యాగమయ జీవనం కొనసాగించిన భక్తశేఖరుడు. అంత్యకాలంలో కూడా నా స్మరణతో తన జీవన యాత్ర సాగించాడు". అని చెబుతాడు.

తనవారి పట్ల భగవానునికి గల అపారప్రేమను, స్వామివారి అమృత వాక్కులలో విన్న నామదేవుల వారికి, తన్మయత్వం కలిగింది. గద్గదమైన కంఠ స్వరంతో "భగవాన్! అనంత కరుణానిధి వైన మీ చల్లని దీవెనలే నీ భక్తులకు శరణ్యంబులై ఉన్నవి. నీ పాద ద్వయంబు ఆశ్రయించిన వారు ఎందరో మహాత్ములకు మోక్ష ధామం ప్రసాదించినట్లు, పరమ భక్తాగ్రేసరుడైన చోఖామేళాను, ఈనాడు నీ పవిత్ర పాద సన్నిధికి చేర్చుకున్నారు" అని స్వామి పాదాలపై పడి విలపిస్తాడు నామదేవుడు.

భక్త హృదయ నివాసి అయిన పాండురంగడు నామదేవుల వారిని ఓదార్చి, నామదేవ! భక్త శిఖామణి అయిన చోఖామేళునికి ఒక కోర్కె యుండెడిది. అది ఫలించలేదు. ఆ కోర్కెను ఇప్పుడు నీవు తీర్చాలి అని చెబుతాడు. పరాత్పరుడైన స్వామివారి వాక్కులను శిరోధార్యంగా భావించే నామదేవుల వారు "భగవాన్ నీకు నీ భక్తులకు తేడా లేదని భాగవత ప్రముఖుడైన నారదమహర్షి ప్రవచించాడు. నిరంతరం భగవన్నామ స్మరణతో తన జీవితమును ధన్యం చేసుకున్న చోఖామేళా మహాశయుని



కోర్కె తీర్చుట నా భాగ్యము. నీ కృ పా వీక్షణాలతో నిర్వర్తించెదను గాక సెలవివ్వండి స్వామి" అని చెబుతాడు.

పరమోద్ధారుడైన రుక్మిణీ వల్లభుడు "నామదేవ! అతని మరణానంతరం తన మృతదేహం నా ఆలయానికి ముందు సమాధి కావాలని అతనికి ప్రగాఢ వాంఛ ఉండేది. కానీ ఆ అవకాశం లేకుండా అతడు భయానక ఆకస్మిక మరణానికి గురి కావలసి వచ్చింది. ఈ ప్రమాదంలో మరణించిన వారిని అందరినీ కలిపి సామూహిక దహనం చేశారు కనుక అతని కోరిక నెరవేరకుండా పోయింది. నీవు వెళ్లి అతని శల్యములను తెచ్చి, ఆలయం ముందు సమాధి గావించవలసినది" అని చెబుతాడు. అంతట నామదేవుల వారు "భగవాన్ సామూహిక దహనం చేశారు అని తమరే చెబుతున్నారు. అలాంటప్పుడు చోఖామేళుని అస్తికలను నేను ఏ విధంగా గుర్తుపట్టగలను సెలవివ్వండి" అని పలుకుతాడు.

నామదేవా! అంతిమ క్షణంలో కూడా నా భక్తుడైన చోఖామేళుడు నన్ను స్మరిస్తూ ప్రాణం విడిచాడు. నీవు ఎముకలను చెవి దగ్గర పెట్టుకోగానే, ఏ ఎముకలలో పాండురంగా అని వినిపిస్తుందో, ఆ ఎముకలు చోఖామేళునివిగా గుర్తించు అని చెబుతాడు. నామదేవుని కంటిలో ధారాపాతంగా కన్నీరు స్రవిస్తుంది. ఆ మహాత్ముని పాదధూళికి కూడా నేను సరికాను కదా అని విలపిస్తాడు. తర్వాత అక్కడికి వెళ్లి ఎముకలను పరీక్షించగానే, ఆనందముతో ఎన్నోసార్లు, మరల మరల మూర్ఛిల్లినాడు. ఆ తర్వాత అస్తికలను తలపై మోసుకుంటూ వచ్చి పాండురంగని పవిత్ర ఆలయం ముందు సమాధి చేస్తాడు.

పండరీక్షేత్రంలో, నేటికీ భక్తులచే పూజలందుకుంటున్న చోఖామేళుని యొక్క సమాధిని మనం దర్శించవచ్చు.

ప్రారంభంలో భక్తులు తమ అవసర నిమిత్తమై భగవంతుని ఆశ్రయించిన రాను రానూ వారిలో పరిపక్వత వచ్చి భగవత్ సాన్నిహిత్యానికి అలవాటు పడి. ఆయనతో విడిపోని సహజీవనం సాగిస్తారు. ఇది జీవించి ఉండగానే ముక్తి పొందిన వైనం. అంధకారమైన అమావాస్య చీకటిలోని విశాల గగనంలో దివ్య కాంతులు విరజిమ్ముతున్న నక్షత్రాల వలె అజ్ఞాన మయమైన ఈ ప్రపంచంలో భక్తులు, భగవత్ ప్రేమ అనే దివ్య కాంతులను మానవాళిపై విరజిమ్మేరు. వీరు సమస్త మానవాళికి మార్గగాములు.

పరమ పుణ్యధామమైన పండరీక్షేత్రంలో భక్తులు లేని కాలం అంటూ లేనేలేదు. వారు మూర్తీభవించిన జ్ఞానమూర్తులు. అట్టి వారిలో భక్త చోఖామేళా ఒకరు.

చోఖామేళా 14వ శతాబ్దంలో మహారాష్ట్రకు చెందిన ఒక వార్కరీ సన్యాసి. విఠోబా భక్తుడు. ఈయన అప్పటి సామాజిక కట్టుబాట్ల ప్రకారం అంటరాని కులంగా భావించే మహర్ జాతికి చెందిన వాడు. చాలా అభంగాలు రాశాడు. ఈయనను తొలితరం దళిత కవుల్లో ఒకడిగా చెప్పవచ్చు. ఈయన భార్య సాయిరాబాయి, కొడుకు కర్మమేళాతో కలిసి జీవించాడు. ఈయన చెల్లెలు నిర్మల, ఆమె భర్త బంక, వీరందరూ కూడా విఠోబా భక్తులుగా ప్రసిద్ధి గాంచారు. నామదేవుడి (1270–1350) ఉపదేశంతో ఆధ్యాత్మిక సాధన కొనసాగించాడు.

చోఖామేళా ప్రస్తుతం మహారాష్ట్ర, బుల్ఢాణా జిల్లా, దేవుల్ గావ్ రాజా తాలూకా, మెహూణా రాజా అనే గ్రామంలో జన్మించాడు. మంగళవేద అనే ప్రాంతంలో నివాసం ఉన్నాడు. ఆయన వృత్తి అగ్రవర్ణాలకు చెందిన తోటలు, పంటలకు కాపలా కాయడం. ఇందులో భాగంగానే ఊరికి దూరంగా నివాసం ఏర్పరుచుకుని ఉండేవాడు.

ఒకసారి పండరీపురాన్ని సందర్శించిన చోఖామేళా అక్కడే నామదేవుడి సంకీర్తనను విన్నాడు. సహజంగానే విఠోబా భక్తుడైన ఆయన ఆ గానంతో పరవశుడై నామదేవుని దగ్గర దీక్షను స్వీకరించి తర్వాత పండరీపురంలోనే స్థిరపడ్డాడు. ఇక్కడి సాంప్రదాయ కథ ప్రకారం అంటరాని వాడైన ఈయనను పూజారులు మొదట్లో ఆలయంలోకి అనుమతించలేదు. చంద్రభాగ నదికి ఆవల వైపున ఒక చిన్న గుడిసె వేసుకుని అక్కడ

నుంచే విఠోబాను ప్రార్థిస్తూ ఉండేవాడు.

అది ప్రభాత మంగళ శుభవేళ, ఆలయంలోని ప్రధాన అర్చకులు స్వామివారికి మేలుకొలుపు సేవలు చేస్తున్నారు. స్వామి వారు చాలా గంభీరంగా మౌనంగా ప్రశాంతంగా ఉన్నారు. అర్చకులు వినయవిధేయతలతో పూజలు మొదలుపెట్టారు.

ఆలయానికి బయట ముందు భాగంలో ఎవరిదో సుశ్రావ్యమైన సంకీర్తన మొదలైనది. అది వినే చెవులను మరియు హృదయాలను మైమరపిస్తూ వుంది. అంతవరకు గర్భగుడిలో గంభీరంగా ఉన్న స్వామివారి మూర్తిలో చిరునవ్వు మొలిచింది. ఈ వింత అనుభవం అర్చకులకు అనుభవమే.

గుడి బయట భక్తులు గుంపులు గుంపులుగా ప్రోగౌతున్నారు. దివిగంగ వోలే ప్రవహించే అమర గానాన్ని ఆలకిస్తూ... వున్నారు. సంకీర్తన చేయు ఆ మహనీయుడు మాత్రం ఎవ్వరిని పట్టించుకోవడం లేదు. చిత్రం ఏమిటంటే ఈ భక్తునికి ఆలయ ప్రవేశం లేదు. అందుకు కారణం అతడు అంత్యజుడై పుట్టడమే. అగ్రవర్ణాల వారు అతనికి ఆలయ ప్రవేశం నిషేధించారు. ఇదే అతని బాధ. స్వామి ఈ జన్మకు, నా తండ్రివైన నిన్ను దర్శించుకొనే భాగ్యం నాకు లేదా? నిన్ను దర్శించు కోకుండానే నేను రాలిపోవాల? అని, కంటిలో ధారపాతముగా అశ్రువులు ప్రవహిస్తూ వుండగా.. అతడు మూర్ఛిల్లినాడు. అంతవరకు గుమికూడిన జనులు నిర్ధాక్షణ్యంగా అతన్ని వదిలి వెళ్ళిపోయారు. ఇద్దరు ఆలయ సేవకులు వచ్చి అతన్ని తట్టి లేపి నిలబెట్టారు.



"చూడూ.. నీ భక్తిపారవశ్యం నిజమే అయితే, పాండురంగడు నీకు ఆలయ ప్రవేశం ఎందుకు కల్పించడు? నటనలు చాలించి ఇక్కడ నుండి వెళ్ళిపో" అని ఆతనిని మెడబట్టి విసురుగా త్రోసివేశారు. దీనిని దయలేని కొందరు వినోదంతో చూసి పగలబడి నవ్వుతున్నారు.

రంగా రంగా యంటూ కిందపడిన ఆ మహా భక్తుడు 'భక్త చోఖామేళా'.. కన్నతండ్రి దర్శనానికి తహతహలాడుతున్న పసిబిడ్డ..

"అయ్యా నేను చేసిన నేరమేమి? నేను ఆలయ ప్రవేశం చేయలేదు కదా? అనవసరంగా నన్ను స్పృశించి మీరు మైల పడ్డారు కదా! మీకు ఇంత శ్రమ ఎలా? మహాత్ములారా నన్ను క్షమించండి నా తండ్రితో రెండు మాటలైన చెప్పకోనిది, నాకు ఏ పని చేయబుద్ధి కాదు. అందుకే వచ్చాను కానీ మిమ్మల్ని శ్రమ పెట్టుటకు కాదు" అని అంటూ వారికి నమస్కరిస్తూ, కంటినీరు తుడుచుకుంటూ, గృహోన్ముఖుడైనాడు... చోఖామేళా.....

పాండురంగని ఆలయం వద్ద అవమానించబడి గాయపడిన శరీరంతో, బరువెక్కిన మనసుతో, దుమ్ము ధూళితో నిండిన వస్త్రములతో, అడుగులో అడుగులు వేసుకుంటూ తూలుతూ ఇంటికి చేరుకున్నాడు చోఖామేళా.

అతని అర్ధాంగి అయినటువంటి సాయిరాబాయి భర్త పరిస్థితిని అర్థం చేసుకుని, ఎదురేగి భర్త పాదాలను కడిగి, ఆ పాద తీర్థం శిరస్సుపై చల్లుకొనింది. ఆ తర్వాత నెమ్మదిగా ఇలా అడిగింది ఏమండీ మిమ్మల్ని నేను ఎప్పుడూ ఇలా చూడలేదు అసలు ఇంతకీ ఏం జరిగింది. ఎందుకు ఇంత దీనంగా ఉన్నారు, వళ్ళంతా ఈ గాయాలు ఏమిటి ఎక్కడైనా కింద పడ్డారా? స్వామి! మీ కనులలో కన్నీళ్లు నేను ఎన్నడూ చూడలేదు, ఇంత బేలగా ఉన్నారు ఎందుకు? దుఃఖ వదనంతో తన వైపు దీనంగా చూస్తూ అడుగుతున్న అర్ధాంగియైన సాయిరా వైపు చూశాడు చోఖామేళా.

"సాయిరా! నేను అంత్యజునిగా పుట్టినందుకు బాధపడడం లేదు. ఈ మనుషులు చేసే అవమానాలకు బాధపడలేదు. దుర్భరమైన పేదరికానికి ఏనాడు దిగులు చెందలేదు. కానీ ఈ రోజు ఒక పుణ్యాత్ముడు నన్నోమాట అన్నాడు, నీలో భక్తి పారవశ్యం నిజమే అయితే ఆ పాండురంగడు నీకు ఆలయప్రవేశం ఎందుకు కల్పించడు అని. దేవి నేను అందుకే బాధపడు తున్నాను పాండురంగనికి నామీద ఇష్టం లేదనే ఆ ఒక్క భావన నన్ను కలచి వేస్తుంది". అని భార్యతో పసిపిల్లవాడిలా రోదిస్తూ పలికాడు చోఖామేళా.

సాయిరా అన్నది మీరు ఆ మాటలు పలకవద్దు, మీరంటే స్వామికి ఎంతో ఇష్టం నాకు తెలుసు అని చెప్పింది. ఆ పుణ్య దంపతులు ఆ రోజంతా ఏమి భుజించకయే ఉన్నారు.

అర్ధరాత్రి కావస్తోంది ఉన్నట్టుండి ఆ గృహంలో వేణునాదం ఒకటి చాలా కమ్మగా మొదలైనది. ఉలిక్కిపడ్డారు

ఆ దంపతులిద్దరూ ఆ గానం ఎటువైపు నుంచి వస్తుందా అని, గృహంలోని నాలుగు వైపులా చూశారు, కానీ ఎవరూ కనపడలేదు. అద్భుతమైన సువాసనలు వెదజల్లుతున్నాయి ఆవాసనలు ఎక్కడినుంచి వస్తున్నాయో వారికి అంతుచిక్కలేదు. ఆ గృహం దేదీప్యమానమైన వెలుగుతో నిండిపోయింది. ఆ వెలుగు ఎక్కడి నుంచి వస్తుందో వారికి అర్థం కాలేదు. వారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు రంగా రంగా అంటూ సాష్టాంగపడి పరిపరివిధాలా స్వామిని స్తుతిస్తున్నారు.

బాలకృష్ణుని సిరిమువ్వ గజ్జల నాదాలు వినిపిస్తూనే ఉన్నాయి కానీ బాలకృష్ణుడు కనిపించడం లేదు. కిలకిలమని అద్భుతమైన నవ్వులు వినిపిస్తున్నాయి కానీ ఆ నవ్వుల రారాజు కనిపించడం లేదు. ఆ దంపతులు స్వామి వారి కోసం అంతా పరుగులు తీస్తున్నారు కానీ బాలకృష్ణుడు వారికి అంతు చిక్కడం లేదు.

స్వామీ! పాండురంగా! ఏమిటి నీ లీల మాకు కనిపించవా అని వారు గట్టిగా నినాదాలు చేస్తున్నారు. స్వామివారు చాలా గోముగా “నాకు బువ్వ పెడతాను అంటే మీకు కనిపిస్తాను” అని పలికాడు.

స్వామీ! ముందుగా కనిపించుమయ్యా కన్నతండ్రీ అంటూ సాయిరా గట్టిగా పలికింది. అమ్మా! అన్నంపెట్టు అని వారి ఇంటిలోని సత్తుపళ్లెం ఒకటి తీసుకుని వారికి కనిపించాడు పాండురంగడు.

ఒక చిరునవ్వు మనసులోని బాధలను మాయం చేస్తుంది అట్టి తరి–చెదరని చిరునగవుల దొరను ఆశ్రయించిన వారికి ఇక బాధ లెక్కడ? ఓ బాధా! నీవు నా దగ్గర నిలువుము అని ప్రాధేయ పడినా అది నిలుస్తుందా? దాని కంత ధైర్యమా? ఇది ఆనంద రూపుడైన నందనందనుని వైభవము.

చోఖామేళా దంపతులకు బాలకృష్ణుని దివ్యమంగళ స్వరూపం దర్శనం అయింది. అమ్మా... అన్నం పెట్టమ్మా అన్న ఆ పరమాత్ముని ప్రేమ పలుకులకు అమాంతం స్వామివారి పాదాలపై పడ్డారు దంపతులిద్దరు. అయ్యయ్యో! ఎవరైనా పుత్రుని పాదాలపై పడతారా? కౌగలించి ముద్దులు పెట్టాలి కాని అని నవ్వుతూ వారిని తట్టిలేపాడు. వారి ఆనందానికి హద్దులే లేవు. వారు కన్నయ్యను అమాంతం కౌగలించుకొని. ముద్దులతో నింపేస్తున్నారు... ఆ బాలస్వామి వారిని విడిపించుకొని.... చిక్కకుండా ఇంటిలో కిలకిలమని నవ్వుతూ పరుగులు పెడుతున్నాడు.. ఆ దంపతులిద్దరూ స్వామివారిని వెంబడిస్తున్నారు. దొరికిన ప్రతిసారి స్వామిని వదలక గట్టిగా కౌగిలించుకుంటూ ఉన్నారు.

ఏ తపస్వికులకు ఇంతటి తపఃఫలం లభించి ఉంటుంది. ఆ నంద దంపతులకు లభించి ఉంటుందేమో అని దేవతలు ఆశ్చర్యంతో ఆనందంతో వీక్షిస్తున్నారు బాలకృష్ణుని క్రీడలను. పరుగులు తీసి తీసి అలసిన స్వామి ...సాయిరాబాయిని అడిగాడు అమ్మా! అన్నం ఎప్పుడు పెడతావు?

ఒక్క నిమిషం కన్నా! కాస్త ఓర్చుకో. స్నానం చేసి భోజనం సిద్ధం చేస్తాను అని బాలకృష్ణుని చోఖామేళాకు అందిస్తూ స్నానం చేయడానికి పరుగు పెడుతున్నది. ఇప్పుడు స్నానం అవసరమా తల్లీ ఆకలౌతుంది. అని అంటూ గోముగా చూశాడు కృష్ణయ్య అమ్మవైపు. ఆనందముతో, ఆ ఉక్కిరి బిక్కిరిలో తాను ఏం చేస్తుందో అర్థం కాలేదు, సాయిరాబాయికి. తాను వంట చేస్తూవుంది. ఇవతల స్వామి వారు చోఖామేళా వడిలో కూర్చొని, ఏదో గుసగుస లాడుతున్నాడు.

ఆ గుడిసెలో ఇంత వరకు ఎవరూ చేయని, అద్భుతమైనటువంటి పంచభక్ష్య పరమాన్నాలు సిద్ధం అయ్యాయి. ఎందుకు కావు? సాక్షాత్తుగా యశోద దేవియే ఆమెలో వుండి వంట చేస్తే?

ఆ నైవేద్యాలను స్వామివారికి తినిపించబోయారు దంపతులిద్దరు. స్వామి వారు వారిని వారించి తన చేతులతో వారికి ఆ నైవేద్యాలను తినిపించాడు. అమ్మ మీరు రెండు రోజుల నుండి పస్తున్నారు ఆహారం మీకు అవసరమా? లేక నాకు అవసరమా?

మీరు భుజించిన ప్రతిపదార్థం నేను మీలో నుండి భుజిస్తూ ఉన్నాను. కనుక మీరు దిగులు చెందవద్దు. అమ్మా ఈ జగత్తులోని సర్వజీవ శరీరాలు అన్నీ నావే. ఈ భావనతో మీరు కదలండి ఆ గుడిలో లోకమనే ఈ ప్రేమ బడిలో ప్రతి తల్లి తండ్రి ఒడిలో నేనెప్పుడూ ఎడబాయక వుంటాను అని చెప్పి బాల రంగడు అదృశ్యమయ్యాడు.

కనుక ఓ పాద ద్వంద్వమా! నీవు భగవదాలయమునకు నడుచుచుండుము. ఓ హస్త ద్వంద్వమా! నీవు భగవదర్చన చేయుచుండుము. ఓ వాగింద్రియమా! నీవు కేశవుని కీర్తింపుచుండుము. ఓ శిరమా! నీవు భగవంతుని నమస్కరించు చుండుము. ఇట్లు కర్మేంద్రియములను నిగ్రహింప వలెను. ఓ నేత్రద్వంద్వమా! శ్రీకృష్ణభగవానునే చూడుము. ఓ శ్రోత్రద్వంద్వమా! ఆ శ్రీకృష్ణుని లీలలనే ఆకర్ణింపుము. ఓ నాసికా ముకుందుని పాదపద్మాలను అలంకరించి ఉన్న తులసిని ఆఘ్రాణించు (ఇట్లు జ్ఞానేంద్రియములను నిగ్రహింపవలెను). ఓ మనసా! ఆ శ్రీధరునే ధ్యానింపుము (ఈవిధంగా మనస్సును నిగ్రహింపవలెను).

అద్భుతమైన ఈ శ్లోకంలో కులశేఖరులు తన దేహంలోని ఒక్కొక్క అవయవాన్ని ఉద్దేశించి హితవుగా అవి చేయవలసిన పనులను వివరిస్తున్నారు. మానవుని అవయవాలు ఆయన చెప్పిన పనులు చేస్తే ముకుందుని దయ తప్పక కలుగుతుంది. భక్త చోఖామేళాకు పట్టిన అదృష్టం మనకు కలుగుతుంది.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు

– కౌతా నిర్మల


**గత సంచిక తరువాయి**

ఆమె సౌందర్యం, ఆమె విన్నపం, ఆమె కోరిక విన్న అర్జునుడు ఎటువంటి మనోవికారానికీ గురికాకుండా ఆమెతో స్థిరంగా పలికాడు. ''తల్లీ! నీవు గౌరవాన్ని పొందవలసిన దానవు. మా వంశానికి మూలపురుషుడయిన పురూరవుని పత్నివి. భారతకుల జననివి. ఇంద్రసభలో నీవంక దృష్టి నిలిపి, మనస్సులోనే నీకు నమస్కారాన్ని సమర్పించుకున్నాను. నేను నీవంక తదేకంగా చూడటాన్ని గమనించిన దేవేంద్రుడు నన్ను అపార్థం చేసుకున్నాడు కాబోలు. నీపట్ల నాకు మాతృభావం ఉన్నది. దయచేసి నువ్వు నా పట్ల పుత్రభావాన్ని ఏర్పరచుకుని, ఇక్కడనుంచి వెళ్ళిపో. నీకు చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. నాతో ఇటువంటి మాటలు మాట్లాడవద్దు. నీ బిడ్డలాంటి వాడను'' అంటూ రెండు చేతులూ జోడించాడు అర్జునుడు.

ఊర్వశి అర్జునుని చూసి సమ్మోహనంగా నవ్వింది. ''సుందరుడా, పురూరవుని తర్వాత దివికి వచ్చిన, ఆ వంశానికి చెందిన రాజులందరూ అప్సరసల తోటి స్వర్గసుఖాలు అనుభవించారు. నువ్వు నాతో సంగమించటానికి ఎటువంటి అనుమానమూ పెట్టుకోవలసిన పనిలేదు. నేను నీపట్ల మోహితురాలినయ్యాను. నా కోరికను కాదని నన్ను నిరాశ పరచకు'' అంటూ ఎంతో ప్రేమగా పలికింది ఊర్వశి.

అర్జునుడు ఊర్వశి ఎదుట చేతులు జోడించి ''అప్సరసాంగనా, నేను నిక్కచ్చిగా సత్యమునే పలుకుతున్నాను. భగవంతుని సాక్షిగా, అష్టదిక్పాలకుల సాక్షిగా, నేను త్రికరణశుద్ధిగా నిన్ను తల్లిగా గౌరవిస్తున్నాను. కుంతీదేవి, గాంధారి, మాద్రీదేవి, శచీదేవి లాగానే నిన్ను భావిస్తున్నాను. నువ్వు నాకు పూజ్యురాలివి. నన్ను నీ బిడ్డగా భావించి ఆశీర్వదించాలే కానీ, నాపై మోహం పెంచుకుని నా సాంగత్యాన్ని కోరకూడదు మాతా. నన్ను క్షమించండి'' అన్నాడు.

అర్జునుని మాటలకు క్రుద్ధురాలయింది ఊర్వశి. ''అర్జునా నన్ను కాదని తిరస్కరించి, నన్ను నిరాశపరచి, నాలో ఆగ్రహాన్ని రేకెత్తించావు. ఒక సంవత్సరం కాలం నీవు నపుంసకత్వంతో ఉంటావు. ఆ సమయంలో నువ్వు నృత్య గానాలతో నిమగ్నమవుతావు. లోకులు నిన్ను పురుషునిగా చూడరు. నీవు



అవమానింపబడుదువు గాక'' అంటూ విసవిసా నడుస్తూ అక్కడినుండి వెళ్ళిపోయింది ఊర్వశి.

అర్జునుడు ఊర్వశి శాపానికి హతాశుడయ్యాడు. ఆ శాపానికి గురయ్యాడే కాని, ఆ అప్సరస పొందును మాత్రం అంగీకరించలేదు. ఊర్వశి శాపఫలితంగా విరాటరాజు కొలువులో బృహన్నల పేరుతో, రాజకుమారికి నాట్యం నేర్పించే గురువుగా నియమింపబడ్డాడు.

అర్జునుని జనన సమయంలో ఆకాశవాణి ''కుంతీదేవీ! నీవు జన్మనివ్వబోయే పుత్రుడు మహాబలవంతుడు, గొప్ప వీరుడు, జితేంద్రియుడు, ఇంద్రుని వలె అజేయుడవుతాడు, శ్రీకృష్ణునికి ప్రియసఖుడవుతాడు. మీ వంశ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందిస్తాడు'' అని పలికింది.

ఆకాశవాణి మాటలు అక్కడ ఉన్నవారందరూ ఆలకించి, కుంతిని ప్రశంసించారు. మునులు, దేవతలు ఎంతగానో సంతోషించారు. కుంతీదేవి పుత్రులయిన ధర్మరాజు, అర్జునుడు, భీముడు, మాద్రి కుమారులైన నకుల సహదేవులు కొంతకాలం కృపాచార్యులు వద్ద, ఆ తర్వాత ద్రోణాచార్యుల వద్ద విద్యాభ్యాసం చేశారు. అర్జునుని సేవాతత్పరత, విద్యయందు అంకితభావం, విలువిద్యయందు అతను కనపరచే నేర్పు, ప్రావీణ్యత ద్రోణుని ఆకట్టుకున్నాయి.

ద్రోణాచార్యుడు అర్జునునితో ''అర్జునా! ధనుర్విద్యలో నీ ప్రావీణ్యత అమోఘమైనది. ఈ లోకాన నిన్ను మించిన మరియొక



ధనుర్ధారి లేకుండా, నువ్వు పేరు ప్రఖ్యాతులు, కీర్తి పొందేలాగా నిన్ను విలువిద్యా ప్రావీణ్యునిగా తయారు చేస్తాను'' అన్నాడు. ఆ మాటలకు మిక్కిలి సంతసించాడు అర్జునుడు. పాండవ, కౌరవుల గురువైన ద్రోణాచార్యుని మాటలు నిజమై అర్జునుడు జగదేక ధనుర్ధారి అయ్యాడు.

పాండవులు నివసించే లక్క ఇంటికి నిప్పంటుకుని పాండవులు ఆ మంటల్లో సజీవ దహనమయ్యారన్న వార్త వ్యాపించింది. కానీ పంచపాండవులు ఆ ఇంటినుంచి తప్పించుకున్నారు. వారు విప్రుల వేషధారణలో ద్రౌపదీ స్వయంవరానికి హాజరయ్యారు. వారిని ఆ సభలో ఉన్న శ్రీకృష్ణుడు గుర్తించాడు. బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునుడిని బలరామునికి చూపించి వారు సజీవంగానే ఉన్నారని చెప్పాడు. అర్జునుడు ఆ స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని వివాహమాడాడు.

ఖాండవ వన దహన సమయంలో అర్జునుడు తన వీరత్వాన్ని ప్రదర్శించాడు. అగ్నిదేవుడు ఖాండవవనాన్ని దహింపనారంభించాడు. అందుకు కృష్ణార్జునులు సాయపడ్డారు. అగ్ని తీవ్ర వేడిమిని భరించలేక దేవతలు దేవేంద్రుని వద్దకు వెళ్ళి తమ తాపమును ఉపశమింపచేయమని వేడుకున్నారు. అప్పుడు ఇంద్రుడు వరుణుని ఆదేశించగా, ఆకాశంలో దట్టంగా మేఘాలు ఏర్పడి, ఆ వేడిని, అగ్నిని చల్లార్చటానికి వానలు కురవసాగాయి. అర్జునుడు ఆ వర్షాన్ని నిరోధిస్తూ, వాన నీటిధారలు భూమి మీదకు చేరకుండా తన బాణాలతో నిరోధించాడు. దేవేంద్రుడు కూడా తన ప్రయత్నాన్ని అడ్డుకోవటానికి సిద్ధమైన అర్జునుని ఎదిరిస్తూ తన బాణాలను సంధించసాగాడు. ఇంద్రార్జునుల మధ్య యుద్ధం ఆరంభమయింది. శ్రీకృష్ణుడు అర్జునునికి సాయంగా తన చక్రాయుధంతో దేవతలను ఎదుర్కొంటుంటే మరోవైపు అర్జునుడు తన బాణాలతో దేవతలను తీవ్రంగా ఎదిరించసాగాడు. అప్పుడు ఆకాశవాణి ఇంద్రునితో ''దేవేంద్రా! ఈ యుద్ధంలో నర నారాయణులను జయించడం అసాధ్యం. వారిద్దరూ ఏకమయ్యారు. వారి పరాక్రమాన్నీ, శక్తినీ నువ్వు నిరోధించలేవు. వారు అజేయులు. వారిని ఓడించాలన్న నీ ప్రయత్నం మానుకుని ఈ యుద్ధభూమిని వదిలి వెళ్ళిపోవడమే మంచిది. అదే నీకు శ్రేయస్కరం'' అని చెప్పింది.

ఆ మాటలు విన్న ఇంద్రుడు తన సైన్యాన్ని వెనక్కు మళ్ళించాడు. తాను కూడా ఆ ప్రాంతాన్ని వదిలివెళ్ళిపోయాడు. అప్పుడు అగ్నిదేవుడు విజృంభించి, ఖాండవ వనాన్ని దగ్ధం చేశాడు. అర్జునుడు తనకు సహాయం చేశాడన్న కృతజ్ఞతతో అతనికి దివ్యాస్త్రాలను ప్రసాదించాడు. ఇంద్రుడు అర్జునుని అస్త్ర విద్యా నైపుణ్యాన్ని ప్రశంసించి అతనికి అవసరమైన సమయంలో తాను అస్త్రాలను ఇస్తానని మాట ఇచ్చాడు. వరుణ దేవుడు కూడా అగ్నిదేవుడు, దేవేంద్రులను చూసి స్ఫూర్తి పొంది అక్షయ తూణీరము, గాండీవ ధనుస్సును అర్జునునికి కానుకగా ఇచ్చాడు.

పాండవులు, కౌరవులు తమ గురువైన ద్రోణాచార్యుల వారి వద్ద అస్త్ర శస్త్ర విద్యాభ్యాసాన్ని ముగించిన తరువాత గురువుగారికి గురు దక్షిణను సమర్పిస్తామని, ఆయన మనసులోని కోరికను తెలుపమని అడిగారు. అప్పుడు ద్రోణాచార్యుడు తన శిష్యులతో, ''శిష్యులారా! పాంచాల రాజైన ద్రుపదుడిని యుద్ధంలో ఓడించి, అతనిని బందీగా చేసి, నాకు అప్పగించండి. ఇదే నేను మీనుంచి కోరే గురుదక్షిణ'' అని చెప్పాడు.

కౌరవ పాండవులు అందుకు అంగీకరించారు. గురువుగారి పాదాలకు ప్రణమిల్లి వారు బయటకు వచ్చేశారు. ముందుగా కౌరవులు ద్రుపదుని మీదకు దండెత్తారు. ద్రుపదుడు తన సోదరులతో కలిసి వచ్చి కౌరవులను ఎదుర్కొన్నాడు. వారి ధాటికి నిలవలేక కౌరవులు ఓటమిపాలై వెనక్కి వెళ్ళిపోయారు. అటుపిమ్మట అర్జునుడు, భీముడు, నకుల సహదేవులతో కలిసి ద్రుపదుని మీదకు దాడి చేశాడు. పాండవ సోదరుల ప్రతాపానికి ద్రుపదుడికి తల వంచక తప్పలేదు. వారు ద్రుపదుని బంధించి, తమతో తీసుకువచ్చి తమ గురువైన ద్రోణాచార్యునికి అతనిని అప్పగించి తమ గురుదక్షిణను చెల్లించుకున్నారు. అర్జునుని శౌర్య పరాక్రమములు అజేయమైనవి.

అజ్ఞాతవాస సమయంలో పాండవులు విరాటరాజు కొలువులో ఉన్నారు. ఆ గడువు పూర్తయిన తర్వాతనే తాము పాండవులన్న విషయాన్ని ఆ రాజుకు తెలియజేశారు. అప్పుడు విరాటరాజు అర్జునునితో తన పుత్రికను వివాహం చేసుకోమని కోరాడు. కాని అర్జునుడు విరాటరాజు మాటలను తిరస్కరించాడు. విరాటరాజుతో అర్జునుడు ''రాజా! నేను చాలాకాలం వరకు మీ పుత్రికకు నాట్యం నేర్పిస్తూ గురువు స్థానంలో ఉన్నాను. ఆమె నాకు శిష్యురాలు. గురువు తండ్రితో సమానం. నా శిష్యురాలిని నేను పుత్రికగానే భావించాను. ఆమె కూడా నన్ను గురువుగా భావించి పూజ్యభావంతోనే ప్రవర్తించింది. నేను ఆమెతో కలిసి ఏడాది కాలం గడిపాను. నాకు, ఆమెకూ మధ్య గురువుకు, శిష్యురాలికీ

మధ్య ఉండే మమతానుబంధాలే ఉన్నాయి. అయినప్పటికీ మా ఇరువురి గురించి అనుమానాలు రాకుండా ఉండాలంటే నేను ఆమెను నా కోడలిగా స్వీకరిస్తాను. అలా చేస్తే మా మధ్య పవిత్ర బాంధవ్యం ఏర్పడి నేనామెకు పితృస్థానంలో ఉంటాను'' అన్నాడు. అందుకు తన సుముఖతను వ్యక్తపరిచాడు విరాటరాజు. ఆ ఇరువురి ఆమోదంతో ఉత్తరకు, అభిమన్యునకూ అత్యంత వైభవంగా వివాహం జరిగింది.

పాండవులు, కౌరవుల మధ్య కురుక్షేత్ర సంగ్రామం మొదలైంది. తొమ్మిది రోజులు గడిచాయి. భీష్ముని వీరత్వాన్ని చూసి యుధిష్ఠిరుడు బెంబేలు చెందాడు. భీష్ముడు ఎంతమాత్రం అలసట చెందకుండా యుద్ధం చేస్తూ పాండవుల సైన్యాన్ని తన పరాక్రమంతో సంహరించసాగాడు. ధర్మరాజు శ్రీకృష్ణునితో తను అశక్తతను గురించి, అధైర్యంగా మాట్లాడాడు. శ్రీకృష్ణునికి అర్జునుని ధైర్య సాహసాలు, పరాక్రమం, శక్తి మీద అపారమైన నమ్మకం ఉంది. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునికి ధైర్యం చెప్పాడు. ''ధర్మరాజా! భీష్ముని వీరోచిత యుద్ధానికి నీవు కలవరపడవద్దు. భీష్ముడు మృతి చెందితే కాని మీకు విజయం లభించదు అన్న అపోహ చెందకు. నీ సోదరుడైన అర్జునుడు ఉపప్లావ్యంలో అందరి ఎదుట తాను భీష్ముని సంహరిస్తానని శపథం చేశాడు. ఆ శపథాన్ని చేసిన అర్జునుడు తన కర్తవ్యాన్ని పూర్తి చేసి, తన మాటను నిలబెట్టుకోగలుగుతాడు. అతనికి అసంభవమైన కార్యం ఏదీ ఉండదు. అతను అరివీర భయంకరుడు. అట్టి శూరునికి భీష్ముని సంహరించడమన్నది కష్టమేమీ కాదు. భీష్ముని మరణానంతరం కౌరవ పతనం ప్రారంభమై మీకు విజయం లభిస్తుంది. నువ్వు ఎంతమాత్రం అధైర్యం చెందవద్దు. కురుక్షేత్ర సంగ్రామంలో విజయం మిమ్మల్నే వరిస్తుంది'' అన్నాడు.

**(ఇంకా ఉంది)**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. భగవద్రామానుజులకు కలిగిన సందేహాలు, వాటికి కంచి వరదరాజస్వామి ఇచ్చిన జవాబులు ఏమిటి? – ముదుంబై నిర్మల**

**జవాబు:** భగవద్రామానుజులకు 6 సందేహాలు కలుగగా వారి గురువుగారైన తిరుకచ్చి నంబిగారి ద్వారా వరదరాజ స్వామివారే స్వయంగా తీర్చారు.

**2. పర తత్త్వమేది?**

**జవాబు:** పరతత్త్వమనగా శ్రీమన్నారాయణుడే.

**3. జీవాత్మ, పరమాత్మలు ఒకరేనా?**

**జవాబు**: కాదు. వేరు వేరు. ఈ రెండింటి భేదము తెలుపునదే ఎంబెరు మానార్ దర్శనం.

**4. మోక్షోపాయము ఏది?**

**జవాబు :** భగవానుని శరణాగతి చేయడమే మోక్షోపాయము.

**5. అంతిమ స్మృతి అవసరమా?**

**జవాబు :** భగవంతుని ప్రత్యేకముగా స్మరించడమనేది శరీరావసాన కాలమున అక్కర్లేదు.

**6. మోక్షమనునది ప్రపన్నులకు శరీరావసానమున లభించునా లేక వేరు శరీరములు గ్రహించిన తరువాత లభించునా?**

**జవాబు :** ప్రపన్నులకు శరీరావసాన కాలముననే మోక్షము లభించును.

**7. తమకు ఆచార్యులెవరు? ఎవరిని ఆశ్రయించి సమాశ్రయణాదులను పొందవలెను.**

**జవాబు:**శ్రీరామానుజులు పెరియనంబిగారిని ఆశ్రయించి సమాశ్రయణాదులను పొందవలెను.

**2. భగవద్గీతలో కృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధం చేయమన్నాడు కదా! అలాగే యుద్ధం చేసినా పాపం అంటదు అని ఆయన ఎలా వివరించాడు? – మహతి, నల్లగండ్ల**

**జవాబు :** యుద్ధంలో హింస జరిగినా దాని పాపం నీకు అంటకూడదు అని అనుకుంటే :

1. యుద్ధం చేసేటప్పుడు కర్తృత్వ భావన లేకుండా ఉండటం (అంటే నేను యుద్ధం చేస్తున్నాను అని అనుకోకపోవడం)
2. యుద్ధాన్ని ధర్మయుక్తంగా తలచడం.
3. క్షత్రియుడవటం వల్ల యుద్ధం చేయడం అనేది నీ కర్తవ్య కర్మ.
4. యుద్ధంలో మనుష్యుల చావు అనేది ఈశ్వర సంకల్పం వలననే జరుగుతోందని, ధర్మం కోసమే ఈ యుద్ధమని, నేను నిమిత్తమాత్రుడనని భావించడం. ఇటువంటి ఆలోచన వల్ల మంచి-చెడు, పాపం-పుణ్యం వంటివి అంటవు. అప్పుడు కర్మ కర్మగా ఉండదు. అది క్రియగా మారిపోతుంది. కాలకృత్యాలు, స్నానం చేయడం వంటివి క్రియలు. అవి పుణ్యాన్నో, పాపమునో ఇవ్వవు కదా.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

# భారతదేశంలో తొలి శివాలయం

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి

భారతదేశంలోనే తొలి శివాలయంగా నిర్ధారింపబడిన "పరశురామేశ్వరస్వామి" ఆలయం గురించి మనం తెల్సుకుందాం. ఈ ఆలయంలోని శివలింగం ప్రపంచంలోనే అతి పురాతనమైన శివలింగంగా పురాతత్వశాఖ గుర్తించింది. ఇంతటి విశిష్టత కలిగిన ఈ దేవాలయం ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లాలో తిరుపతికి ఆగ్నేయంగా 20 కిలోమీటర్ల దూరంలో "గుడిమల్లం" అనే గ్రామంలో ఉంది. తిరుపతి నుండి పాపానాయుడు పేట మీదుగా ఈ గ్రామాన్ని చేరుకోవచ్చు.



ఈఆలయంలోగర్భగుడి,అంతరాలయంముఖమండపముల కంటె చాలా లోతుగా అంటే 5 అడుగుల నుంచి 10 అడుగుల వరకు పల్లంగా ఉంటుంది. అందుకే ఈ ఆలయం ఉన్న గ్రామాన్ని ''గుడిపల్లం''గా పిలిచేవారట. కాలక్రమంలో గుడిపల్లం కాస్తా గుడిమల్లంగా వ్యవహరింపబడుతోంది. చోళుల శాసనాలలో ఈ గ్రామాన్ని ''తిరువిప్పరంవేడు'' అని ప్రస్తావించారు. అలాగే ''విప్రపీఠ'' అని కూడా ప్రస్తావన ఉంది. పల్లవుల కాలంలో ''గుడిపల్లం'' అని పిలిచేవారని శాసనాలు చెప్తున్నాయి.

ఉత్తరప్రదేశ్ లోని మధురలో ఉన్న మ్యూజియంలో క్రీ. పూ ఒకటవ శతాబ్దానికి చెందినది అంటూ ఒక లింగాన్ని భద్రపరిచారు. అది ఈ గుడిమల్లం శివలింగాన్ని పోలి ఉంది. అలాగే ఉజ్జయినిలో క్రీ.పూ 3వ శతాబ్దానికి చెందినదిగా భావింపబడే కొన్ని రాగి నాణాలు దొరికాయి. వాటిపైన ఉన్న చిత్రం గుడిమల్లం శివలింగమే. మంగోలులని పోలిన ఈ రూపం ఖజురహోలో కూడా కనిపించడం విశేషం. ఆంధ్ర శాతవాహనుల నాటి పురాతన శివాలయంగా భావింపబడుతున్న ఈ శివాలయానికి సంబంధించిన సమాచారం చంద్రగిరి కోటలోని మ్యూజియంలో లభ్యమవుతోంది. ఈ ఆధారాల వలన ఒకటవ శతాబ్దంలో ఈ దేవాలయం నిర్మించబడినదనీ, 9 నుండి 18వ శతాబ్దాల వరకు ఎన్నో మార్పులు చేర్పులు జరిగి వుంటాయని పరిశోధకులు భావిస్తున్నారు. చంద్రగిరి రాజులు ఈ దేవాలయాన్ని ఉచ్ఛస్థితిలో నిలిపారు. తదనంతర కాలంలో ముస్లిం పాలకులు చంద్రగిరి సంస్థానంతో పాటు ఈ దేవాలయాన్ని కూడా పాడు చేసినట్లు తెలుస్తోంది.

చాలాకాలం మరుగున పడిపోయిన ఈ గుడి గురించి 1911లో, శ్రీ గోపీనాథరావు అనే పరిశోధకుడు ఒక సంవత్సరం పాటు పరిశోధనలు చేసిన అనంతరం ఈ ఆలయం ఉనికిని ప్రపంచానికి తెలియజేశారు. పురాతత్వ శాఖ వారి తవ్వకాలలో బయటపడిన ఈ ఆలయాన్ని 1954లో ఆర్కియలాజికల్ సొసైటీ



ఆఫ్ ఇండియా వారు స్వాధీనం చేసుకొన్నారు. అప్పటినుండి ఈ ఆలయంలో పూజలు-సేవలు నిలిచిపోయాయి. 2009 వ సంవత్సరంలో వారు తిరిగి ఇచ్చివేయడంతో ఆలయంలో పూజలు, సేవలు పునః ప్రారంభమయ్యాయి.

గుడిమల్లం ఆలయంలో శివుడు పరశురామేశ్వరునిగా ప్రసిద్ధి పొందాడు. ఇక్కడ శివుడు మానవరూపంలో మహావీరుడైన వేటగాని వలె ఉంటాడు. లింగముపైన ముందువైపు ఉబ్బెత్తుగాను, లింగము నుండి బయటకు పొడుచుకు వచ్చినట్లుగాను చెక్కబడిన శివుడు యక్షుని భుజాలపై నిలబడిన రూపంలో అంటే స్థానకభంగిమలో దర్శనమిస్తాడు. స్వామికి రెండు చేతులు ఉంటాయి. కుడిచేతిలో తలకిందులుగా ఉన్న గొర్రెపోతు కాళ్ళు పట్టుకొని ఉంటాడు. కొందరు దీనిని గొర్రెపోతు కాదు లేడి అని అంటారు. ఎడమ చేతిలో చిన్న గిన్నె లేదా చిప్పను పట్టుకొని ఉంటాడు. ఎడమ భుజానికి ఒక గండ్రగొడ్డలిని తగిలించుకొని తలపై చిన్న వస్త్రము ధరించి వేటగాని వలె గోచరిస్తాడు. చెవులకు వివిధ ఆభరణాలు ధరించి, జటలన్నీ పైన ముడివేసుకున్నట్లుగా అలంకరించుకుని కనిపిస్తాడు. నడుము నుండి మోకాళ్ళ వరకు అంగవస్త్రము ధరించి వుంటాడు. ఆ వస్త్రము మధ్యలో వేలాడుతున్న ముడతలు స్పష్టంగా కనిపిస్తాయి. స్వామికి యజ్ఞోపవీతం లేదు. లింగ అగ్రభాగం మరియు కింద పొడవైన స్తంభ భాగములను విడదీస్తున్నట్లుగా లోతైన గీత స్పష్టంగా గోచరిస్తుంది. ఈ అలంకరణ ఋగ్వేద కాలం నాటిదని పరిశోధకులు భావిస్తున్నారు. లింగోద్భవ కాలపు మహాశివుడని విశ్లేషకులు వివరిస్తున్నారు.

2600 సంవత్సరాల క్రితం నాటి ఈ అతి పురాతన ఆలయం త్రిమూర్తులు ఏకశిలపై వెలసిన ఆలయంగా కొందరు భావిస్తున్నారు. లింగమూలంలో ఉన్న యక్షుడు బ్రహ్మగాను, యక్షుడి భుజాలపై మానవాకారంలో పరశువుతో ఉన్న మూర్తి విష్ణువుగాను, అగ్రభాగాన లింగరూపం శివునిగానూ వెరసి ఈ రూపం ఏకశిలపై వెలసిన త్రిమూర్తులుగా వీరు విశ్లేషిస్తున్నారు. ఈ పరశురామేశ్వర దేవస్థానం వారు ప్రచురించిన కరపత్రాలలో కూడా ఈ మూర్తిని త్రిమూర్తులుగానే వర్ణిస్తూ ప్రస్తావించారు.

ఇక పురాణ కథనానికి వస్తే, తండ్రి ఆజ్ఞను పాటించి తల్లిని వధించిన పరశురాముడు తండ్రి ఇచ్చిన వరంతో తల్లిని మళ్ళీ బ్రతికించుకుంటాడు. కానీ తల్లిని సంహరించిన పాపాన్ని నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ గుడిమల్లంలోని ఈ ఆలయ ప్రాంతానికి వచ్చాడు. అప్పుడు ఈ ప్రాంతమంతా దట్టమైన అడవి. పరశురాముడు ఇక్కడ ఒక కోనేటిని నిర్మించి, శివుని అనుగ్రహం కోసం తపస్సు చేయడం మొదలుపెట్టాడు. ఆ కోనేటిలో రోజుకి ఒక పువ్వు మాత్రమే వికసించేది. ఆ పువ్వును ఎవ్వరూ దొంగిలించకుండా ''చిత్రసేనుడు'' అనే యక్షుడిని కాపలాగా పెట్టాడు. ఒకరోజు ఆ యక్షుడు తానే ఆ పువ్వును కోసి దేవుడికి సమర్పించాడు. ఆగ్రహోదగ్రుడైన పరశురాముడు యక్షునితో యుద్ధానికి తలపడ్డాడు. 14 సంవత్సరాలు భీకరయుద్ధం జరిగింది. అప్పుడు శివుడు ప్రత్యక్షమై వారి యుద్ధాన్ని నివారించి అక్కడ వెలశాడని, అందుకే పరశురామేశ్వరునిగా ఆరాధింపబడుతున్నాడనీ పురాణ కథనం. వారిద్దరి మధ్య జరిగిన భీకర యుద్ధం వలన ఆ ప్రాంతం క్రుంగిపోయి పల్లంగా మారిందనీ, అందుకే గర్భగుడి 5 నుండి 10 అడుగుల పల్లంలో వుంటుందనీ చెప్తారు. పరశురాముడు సృష్టించిన కోనేటినే ఇప్పుడు ''చిత్రాల బావి''గా పిలుస్తున్నారనీ అంటారు.

ప్రపంచంలోనే అతి పురాతన శివలింగం కలిగి వున్న, భారతదేశంలోనే తొలి శివాలయంగా నిర్ధారించబడిన ఈ పరశురామేశ్వర ఆలయంలో ఎన్నో అద్భుతాలు ఉన్నాయి. స్వామివారి అమ్మవారి నగలు భద్రపరచడానికి ఆలయ గోడలలో

ఏర్పాటు చేసిన లాకర్లు ఈ దేవాలయంలోని ఒక అద్భుతంగా చెప్పవచ్చు. ఇక స్వామికి తూర్పువైపున ఉన్న కిటికీలోంచి ఉత్తరాయణ – దక్షిణాయన సమయాలలో అంటే సంవత్సరానికి రెండుసార్లు ప్రసరించే సూర్యకిరణాలు మూలమూర్తిని ప్రత్యక్షంగా తాకడం ఈ ఆలయంలోని మరో అద్భుతం. అరవై సంవత్సరాల కొకసారి ఈ ఆలయంలోని గర్భగుడిలో 5 అడుగుల ఎత్తు, ఒక అడుగు వెడల్పు ఉన్న శివలింగాన్ని సువర్ణముఖి నది తన జలంతో అభిషేకిస్తుంది. ఇలా గర్భగుడిలో నిండిపోయిన నీరు 4 గంటల తరువాత మాయమైపోతుంది. ఈ నీరు ఎలా వస్తుందో, 4 గంటల తరువాత ఎలా పోతుందో ఎవరికీ తెలియదు. స్వర్ణముఖి నది అంతర్వాహినిగా గర్భగుడిలోకి వచ్చి 60 సంవత్సరాలకు ఒకసారి మూలమూర్తిని అభిషేకిస్తుందని భక్తుల నమ్మకం. 1945వ సంవత్సరంలో ఇలా గర్భగుడి జలంతో నిండిపోవడం తాము కళ్ళారా చూశామని వృద్ధులైన ప్రాంతీయులు చెప్తున్నారు. 2005వ సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన గర్భగుడి నీటితో నిండిపోయినట్లుగా ఆలయ రికార్డులలో నమోదయింది. ఈ ఆలయంలో మరో అద్భుతం గోపురం. గోపురం ఈ ఆలయంలో గజపృష్ఠ ఆకారంలో విభిన్నంగా ఉంటుంది.

ఈ ఆలయంలో అమ్మవారి పేరు "ఆనందవల్లి" ఒక ప్రత్యేకంగా ఉన్న ఉపాలయంలో ఆనందవల్లి అమ్మవారు కొలువై ఉన్నారు. వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు మరో ఉపాలయంలో కొలువై భక్తులకు దర్శనమిస్తారు. ప్రధాన దైవానికి అభిముఖంగా ఈశాన్యంలో ఒక చిన్న ఉపాలయంలో సూర్యనారాయణమూర్తి కొలువై ఉన్నారు. ఈ సూర్యుని ఆలయాన్ని భారతదేశంలోనే తొలి సూర్య ఆలయంగా భావిస్తారు. ఆలయ కుడ్యాలపై లెక్కకు మిక్కిలిగా శాసనాలు మనకు కనిపిస్తాయి. చోళ, పల్లవ, గంగపల్లవ, రాయల కాలంలో అత్యంత వైభవంగా శోభిల్లిన ఈ దేవాలయం ప్రస్తుతం దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ప్రతి సోమవారం రాహుకాలంలో ఈశ్వరునికి రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం మృత్యుంజయ హోమం జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఆనందవల్లి అమ్మవారికి ఉదయం 8 నుండి 9 గంటల వరకు అభిషేకం జరుగుతుంది. తదనంతరం 10 నుండి 11 గంటల వరకు విశేష కుంకుమార్చన జరుగుతుంది. వివాహం ఆలస్యం అవుతున్నవారు – సంతానం లేనివారు సోమవారం రాహుకాలంలో జరిగే అభిషేకంలో భాగస్వాములయితే సత్వరమే ఫలితం లభిస్తుందని భక్తులు చెప్తూ ఉంటారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ ఆలయం తెరిచే ఉంటుంది. తిరుపతి వెళ్ళినప్పుడు తప్పకుండా ఈ ఆలయాన్ని దర్శించి ప్రపంచంలోనే అతి పురాతనమైన శివలింగాన్ని, భారతదేశంలోనే తొలి శివాలయాన్ని చూసిన అనుభూతిని స్వంతం చేసుకోండి.


## శ్రీ వేంకటాచల మహాత్మ్య ముద్రణకు దాతల ఆహ్వానం

'శ్రీ వేంకటేశం' మాసపత్రికలో ధారావాహికగా ప్రచురితమైనవి, మరియు శ్రీ వేంకటేశ్వర పరిశోధకులు డా. విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, తిరుపతి గారిచే ఈ క్రింది పురాణాల నుండి తెలుగులో అనువదించబడినవి. భక్తులు వీటిని మరింత చదివి స్వామి తత్త్వమును తెలుసుకోవాలనే కోరికతో పుస్తకముగా ముద్రించుటకు ఆర్థిక సహాయం కోరుచున్నాము. దాతలు ఎన్నుకొన్న పుస్తకముపై దాతగా వారి పేరును ముద్రించుటతోపాటు కొన్ని పుస్తకములు ఇవ్వడబడును. మరియు శ్రీ వేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించగలవు.

1. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, మొదటి సంపుటం, స్కాందపురాణ భాగం (250 పేజీలు)
2. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, రెండవ సంపుటం, వరాహ పురాణ భాగం (200 పేజీలు)
3. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం మూడవ సంపుటం, పద్మ, గరుడ, హరివంశ పురాణ భాగములు (200 పేజీలు)

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠము

హైదరాబాద్. ఫోన్: 040-27175050, 9348212354. Email: srivenkatesham@gmail.com


# నారద పూర్వజన్మ వృత్తాంతం

- విద్వాన్
వల్లూరి చిన్నయ్య

వేద ధర్మాలను వివరించే విధానంలో విశేష ప్రాచుర్యం కలదీ, శరణు వేడిన వారిని సంరక్షించే శాంతికారుడు శ్రీమహావిష్ణువనడానికి తగిన దృష్టాంతాలను ధృవీకరించేది, నిరాకారుడుగా తత్వజ్ఞానసంపూర్ణులకు సాకారుడుగా, భక్తకోటికి శాశ్వతానందాన్ని కల్గించేవాడు కంజాక్షుడయిన శౌరియే అని తెలియజేసేది, శ్రీమహావిష్ణుదేవుని దశావతారాలన్నీ ధర్మ సంస్థాపనార్థమే అని నిరూపించేది శ్రీమదాంధ్ర మహాభాగవతం. ఆ పవిత్ర గ్రంథం ఆధారంగా సప్తమస్కంధం నుండి నారద పూర్వజన్మ వృత్తాంతం అనే విభాగం వ్రాయబడింది.

**శా. భూపాలోత్తమ! మీరు భక్తి గరిమ స్ఫూర్తిన్ సరోజేక్షణ**
**శ్రీపాదాంబుజ యుగ్మమున్ నియతుల్ సేవించి కాదే మహో**
**గ్రాపత్సంఘము లోనఁ జిక్కక సమస్తా శాంత నిర్జేతలై**
**యేపారంగ మఖంబు సేసితిరి దేవేంద్ర ప్రభావంబునన్**
**-శ్రీమదాంధ్ర మహాభాగవతం – సప్తమస్కంధం – 471 పద్యం**

రాజశ్రేష్ఠా! ధర్మజా! తమరు శ్రీమన్నారాయణ మూర్తి పద్మాలవంటి పాదాలను పూజించటం వల్లనే భరింపరాని ఇడుములకు లోను కాకుండా ఇతరులు పొందలేని దిగ్విజయాన్ని పొంది ఇంద్ర వైభవంగా రాజసూయ యాగాన్ని పరిసమాప్తి చేయగలిగారని, నారద మహర్షి ధర్మరాజుకు తెల్పి తన జన్మ వృత్తాంతాన్ని ఈ క్రింది విధంగా తెల్పాడు.



గతించిన మహాకల్పంలో గంధర్వ వంశంలో ఉపబర్హణుడు అనే పేరుతో నేను పుట్టాను. అపుడు నేను మహా అందగాడిని. మధురాతి మధురంగా మాట్లాడేవాడిని. అందువల్ల సౌందర్యవంతులైన స్త్రీలు నా దగ్గరకు చేరేవారు. నేను కూడా వారి ఆకర్షణీయమైన చూపులకు భ్రమపడి వారితో క్రీడిస్తూ ఉండేవాడిని. ఒక పర్యాయం విశ్వాన్ని సృష్టించే ప్రజాపతులు దేవసత్రం అనే పేరుగల యజ్ఞాన్ని చేశారు. ఆ మహత్తర కార్యంలో యజ్ఞపురుషుడగు విష్ణుదేవుని లీలావిశేషాలు మధురాతి మధురంగా గానం చేయటానికి గంధర్వులను, అప్సరసలను పిలిచారు. ఆ యజ్ఞానికి నేను కూడా వెళ్ళాను. విష్ణుమూర్తి కథలు శ్రవణానందకరంగా గానం చేశాను. గాన సమయంలో స్త్రీలపై వ్యామోహం కలిగింది. జన్మను తరింపచేసే ఆ సంకీర్తనా గానాన్ని విస్మరించి స్త్రీల పొందు కోసం పరుగులెత్త సాగాను. ప్రజాపతులకు పట్టరాని కోపం కలిగింది. ఆ క్రోధాగ్నికి తట్టుకోలేక వారు నన్ను శపించారు. ఆ శాప కారణంగా నేను భూలోకంలో బ్రాహ్మణ దాసికి పుత్రుడిగా జన్మించాను. నేను బ్రాహ్మణ దాసికి పుత్రుడిగా పుట్టి అక్కడ బ్రహ్మ నిష్ఠులైన వారికెందరికో సేవలు సల్పాను. ఆ సేవా భావ ప్రభావం వల్ల ఈ మహాకల్పంలో బ్రహ్మ మానసపుత్రుడిగా ఉద్భవించానని నారదుడు ధర్మరాజుకు తెల్పి ఇంకా ఈవిధంగా పల్కుతున్నాడు.

**మ. అఖిలాధారుడజాది దుర్లభుడు బ్రహ్మంబైన విష్ణుండు, నీ**
**మఖమందర్చితుఁడై నివాసగతుఁడై మర్త్యాకృతిన్ సేవ్యుఁడై**
**సఖియై చారకుఁడై మనోదయితుడై సంబంధియై మంత్రియై**
**సుఖదుండయ్యె భవన్మహా మహిమదాఁ జోద్యంబు ధాత్రీశ్వరా**
**-శ్రీమదాంధ్ర మహాభారతము – సప్తమస్కంధం – 478 పద్యం**

ధాత్రిని పరిపాలించే రాజులలో అగ్రగణ్యుడవైన ధర్మజా! ప్రపంచాన్ని పరిపాలించే పరమాత్ముడు, బ్రహ్మాదులకు కూడా అర్థము కానటువంటి లీలలు కల పరబ్రహ్మ స్వరూపుడు అయిన శ్రీమహావిష్ణువు నీవు సల్పిన యజ్ఞరాజంలో ఆరాధింపబడినాడు. అనునిత్యం నీవు ఆ సత్యస్వరూపుని ఆత్మానందంలో ఆరాధించేవాడివైనందున ఆ మహామహుడు నీ యజ్ఞకార్య సందర్భాన ఆ మాధవుడు ఒక మానవుడుగా, మహోత్తమ పూజనీయుడుగా, బహుపుణ్యమూర్తిగా, మీ ప్రాణస్నేహితుడిగా కార్యాన్ని సమర్థవంతంగా నిర్వహించే నియతిధనుడుగా, ఆపదలో ఆదుకొనే బంధువుగా, మంచి మంత్రిగా ఉండి సర్వవిధాల సుఖోన్నతులు సమకూర్చగలిగాడు. నీ పూర్వపుణ్యఫల విశేషాన్ని కొనియాడుటకు సామాన్యులు చాలరు. నీవు మహనీయ మూర్తివి, మహాభాగ్యశాలివి అని ధర్మరాజును నారదుడు కొనియాడాడు.

నారదుడు తెల్పిన ధర్మసార తత్వమంతా విని ధర్మజుడు పరమానంద భరితుడై వినయభూషణుడై వాసుదేవుణ్ణి అనేకానేక విధాలుగా అర్చన చేశాడు. పరమాత్ముడు కూడా అంతులేని విధంగా సంతసించాడు. శ్రీకృష్ణునిచేత, ధర్మజుని వలన పునీతంగా పూజింపబడిన నారదుడు దేవలోకానికి వెళ్ళాడు.

పై విషయాన్నంతా శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు వివరించాడని పరమ పవిత్రమయిన పురాణ శాస్త్రములందు పారంగతుడైన సూతుడు, శౌనకుడు ఆదిగా గల మౌనివర్యులకు తెలియజేశాడు.

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

పన్నిద్దరు ఆళ్వారులలో నమ్మాళ్వార్ ఒకరు. ఆ ఆళ్వార్లు కృష్ణ భక్తులు. ఒక రోజు కృష్ణుణ్ణి చూసి – ఆ ఆళ్వార్లు పరిగెత్తుకుంటూ పోతున్నారు. అపుడు కృష్ణదేవునికి ఆయనకు జరిగిన సంభాషణ ఇది–

కృష్ణ – ఆళ్వార్! అలా పారిపోకుండా నేను చెప్పేది వినాలి.

ఆళ్వా – స్వామీ! అసూయాద్వేషాలు వున్నవాణ్ణి. అల్పుణ్ణి. దగ్గరికి రావద్దు.

కృష్ణ – నేను పల్లేరు కాయలు ముళ్లు వున్న బృందావనంలో ఎన్నెన్నో రోజులు నడిచి నడిచి – చదును చేసి – మంచి పంటలు పండేట్లుగా చేసి – పాడి కూడా అధికముగా వృద్ధి చేసాను. అపుడు పాలు పెరుగు వెన్న నెయ్యి ఎవరివో చెప్పవా?

ఆళ్వా–స్వామీ! అదంతా మీ కష్టార్జితమే.

కృష్ణ– అలాగైతే మరి నన్ను వెన్నదొంగ అంటారేమిటి? ఇకపోతే పాలు పెరుగు దాచుకుంటున్నారు. అలాంటపుడు దొంగ ఎవరు?

ఆళ్వా–ఇంకెవరు? దాచుకున్నవాళ్లే.

కృష్ణ–నీ హృదయంలోని కల్మషాలను భస్మంచేస్తూ – నీ మనసును చదును చేద్దామంటే – పారిపోతున్నావు. నీలో నేను వుండటానికి కాస్త చోటివ్వవా?

ఆ మాట వినగానే ఇక నమ్మాళ్వార్లు సంతోషించారు. తన హృదయంలోనికి ఆహ్వానించారు.

నమ్మాళ్వార్ వారు శ్రీకృష్ణ భక్తులు. ఉణ్ణం శోరు – పరుగుం నీరు – తిణ్ణం వెత్తలయుం ఎల్లాన్ కణ్ణన్ కణ్ణన్ ఎన్వెరుమానే – తినే అన్నం (ధారకం) తాగే నీరు పాలు ఇత్యాదులు (పోషకం) అనుభవిస్తున్న సుఖ భోగాదులు (భోగ్యం) సమస్తమూ కృష్ణుడే కృష్ణుడే కృష్ణుడే కృష్ణుడే అన్నారు ఆళ్వార్లు.

దేవుడు అంతర్యామిగా అందరిలోనూ వుంటాడు. అయితే అందరూ దేవునిలో వుండటం లేదు. తనకు తానే వచ్చి – నీ హృదయంలో నాకు కాస్తా చోటు ఇవ్వాలని కృష్ణుడు అన్నాడంటే ఇక నమ్మాళ్వార్ ఎంతటి భాగ్యవంతులో?

నిర్గుణోపాసకులైన వారు శంకర భగవత్పాదులు – సగుణ సాకార కృష్ణుని స్మరిస్తూ – ఒకరోజు బృందావనానికి వెళ్లారు. అక్కడ కృష్ణ పరమాత్మని చూసి – ఆనందపరవశులై అంటున్నాడు –

**శృణు సఖీ! కౌతుకమేకం నందనికేతాంగణే మయా దృష్టమ్ ।**
**ధూళిధూసరితాంగః నృత్యంతీ వేదాంత సిద్ధాంతః ॥**

తన మనసుని సఖీ అని తనకు తాను చెప్పుకున్నాడు ఆదిశంకరులు. వ్రేపల్లెలో నందుని ఇంటి ముంగిట్లో నేను కృష్ణ పరమాత్మను చూసానుకదా. ఆ స్వామి గో ధూళి ధూసరితమైన దివ్య దేహంతో దర్శనమిచ్చాడు. ఆహా! అది మామూలు దర్శనం కాదు – నాట్యం ఆడుతున్న వేదాంత సిద్ధాంతం అద్భుత మధురమైన రూపంలో సాక్షాత్కారించింది. అందుకే ఆశ్చర్యపోతున్నాను అన్నాడు. అది సగుణ సాకార దర్శనంలో శంకరుల తన్మయత్వం.

మధుసూదన సరస్వతి యతీంద్రులు కూడా నిర్గుణమైన నిరాకారమైన తత్వాన్ని ప్రతిపాదించినట్టి మహనీయులు. ఆయన బెంగాలీ నివాసి. ఒకరోజు నిర్గుణ నిరాకారమైన బ్రహ్మని ఆరాధించాలని ఉపక్రమించారు. అయితే ధ్యానములో మనసు బలవంతముగా నీలమేఘ వర్ణంలోని కోమలమైన మనోహరమైన దివ్యాద్భుత దేవుడు గోపబాలుడు తన హృదయ స్థానంలో సాక్షాత్కరించాడని మురిసి పోయారు. యమునా తటీ విహారి దివ్యమైన మంగళమూర్తి కృష్ణ భగవానుడు ప్రతినిత్యం దర్శనభాగ్యం కలిగించాలని ప్రార్థించారు. అలా ఎందరో నిర్గుణోపాసకులు సగుణ రూపమును ఆరాధించారు.

కులశేఖర ఆళ్వార్లు భక్తి పారవశ్య ప్రపన్నులు. శ్రీరామ శ్రీరంగనాథుల పట్ల వీరి భక్తి నిరుపమానం. ఈ ఆళ్వార్లు విరచించిన ముకుందమాలలో కృష్ణ భక్తి కనపడుతుంది.

**శ్రీనాథ! నారాయణ! వాసుదేవ! శ్రీకృష్ణ! భక్తప్రియ! చక్రపాణే!**
**శ్రీపద్మనాభ!అచ్యుత!కైటభారే!శ్రీరామ!పద్మాక్ష!హరే!మురారే!**
**అనంత!వైకుంఠ!ముకుంద!కృష్ణ!గోవింద!దామోదర!మాధవ ఇతి వక్తుం**
**సమర్థోపి న వక్తి కశ్చిత్ అహో జనానాం వ్యసనాభిముఖ్యమ్ ॥**

ఆ విధమైన భగవంతుని నామాన్ని పలకడంలో సమర్థులైననూ – ఒక్కడునూ పలకలేకున్నాడు. అయ్యో! వ్యసనాల మీద ఆసక్తి సంసారులకు ముఖ్యమైనదా? అంటూ కులశేఖరులు ఆశ్చర్యపోతున్నారు.

త్వత్ భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య భృత్య పరిచారక భృత్యుణ్ణిగా అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నారు ఆళ్వార్లు. భగవత్ సన్నిధిలో వుంటున్న దాసానుదాసులలో స్వామీ! చరమదాసునిగా నన్ను అనుగ్రహించు అని వేడుకున్నారు కులశేఖరాళ్వార్లు.

భగవంతుని సేవించడమెలాగో కులశేఖరాళ్వార్లు సెలవిస్తున్నారు. రెండు చేతులనూ జోడించాలి. శిరస్సును వంచాలి. శరీరం పులకాంకురమై పోవాలి. కంఠం స్వగద్గదమవ్వాలి. నేత్రాలు బాష్పపూరితాలవ్వాలి. ఓ స్వామీ! నిరంతరమూ నీ పాదపద్మముల మీద ధ్యానామృతాన్ని ఆస్వాదించగల దివ్యమైన జీవితాన్ని ప్రసాదించాలని ప్రార్థించాలన్నారు ఆళ్వార్లు.

కృష్ణుణ్ణి ఒక అమూల్యమైన మణిగా భావించారు కులశేఖరులు. ఆ స్వామి ఒక గోపాల చూడామణియట. ఇంకా భక్తులకు సంభవించే – ప్రమాదాలనే భయంకర సర్పాలను అణగదొక్కగల గరుడమణియట. వ్రజ గోపభామలు నిరీక్షిస్తున్న నేత్రాలు అనే చాతకపక్షులకు మేఘమణియట. కృష్ణభగవానునికి కాంతామణియైనట్టి రుక్మిణీదేవికి చెందిన విశాలమైన వక్షఃస్థలానికి అలంకార మణియట. సమస్త దేవతలకు శిరోభూషణమైన గోపాలచూడామణి మాకు శ్రేయస్సునిచ్చి రక్షించుగాక.

ఎవరి ఇష్టదైవమైన భగవన్మూర్తి ముందు కూర్చోవాలి. భగవానునితో మనసు విప్పి మాట్లాడాలి. తెలిసి చేసిన – తెలియక చేసిన పాపాలను అన్నింటినీ భస్మము చేయాలంటూ – స్వామితో చెప్పుకోవాలి. మనసులోనే భోరున ఏడ్వాలి.

రామకృష్ణ పరమహంస నిద్రాహారాలు మానుకుని వరుసగా మూడురోజులు ఏడ్చాడు. ఇక వ్రజ గోపభామలు ఏడ్చారు. ఇకపోతే గోరాకుంభారుడు ఏడ్చాడు. అలాగనే లీలాశుకుడు ఏడ్చాడు. ఇంకా బాగా చెప్పాలంటే చోకామేళుడు ఏడ్చాడు. రామదాసు ఏడ్చాడు. ఈ విధంగా ఎందరెందరో మహానుభావులు ఏడ్చారు.

నేల మెత్తబడితే – విత్తనము భూమి లోపలికి దిగుతుంది. మొక్కగా పైకి వస్తుంది. ఏడ్పుతో మన హృదయం ఆర్ద్రమైతే – భగవదనుగ్రహము సిద్ధిస్తుంది. కులశేఖరుల అభిప్రాయం అదే కావచ్చు.

ఒకసారి నారదుడు కృష్ణభగవానుని సందర్శనం కోసం ద్వారకానగరానికి వెళ్లాడు. అపుడు తన తలకు గుడ్డను చుట్టేసుకుని పడుకుని వున్నాడు కృష్ణభగవానుడు. అదేమిటబ్బాయని అడగ్గా నారదా! నేను తలనొప్పితో బాధపడుతున్నాను. దానికి భక్తుల పాదధూళిని నా శిరస్సుమీద చల్లుకుంటే చాలు పోతుందన్నాడు. అయితే తన పాదాలకున్న మట్టిని తీసి వేయలేక – దిక్కు తోచకపోవడంతో – ఇక బయటికి వెళ్లాడు.

ఇక అపుడు అక్కడ తిరుగుతున్న గోపభామలు కనిపించారు. విషయాన్ని దాచకుండా చెప్పేసాడు. వారు వెంటనే తమ తమ




కాళ్లకు వున్న మట్టిని అంతా గోకి గోకి – వాళ్లందరూ ఒక చాటెడు మట్టిని సేకరించిన తర్వాత నారదులవారికి ఇచ్చారు. అమ్మో! ఇంత మట్టిని భగవానుని తల మీద పోస్తే ఇంక నేను నరకాదులలో పడిపోతాను అని దేవర్షి నారదుడన్నాడు. అపుడు ఎంత పాపమైనా రానీ గాక – ఏ రౌరవాది నరకాలలో మేము పడిపోతేనేమి – మా కిట్టయ్యకి తల నొప్పి తగ్గాలంటూ–ఆ నారదుల వారిని తోసుకుంటూ లోపలికి వెళ్ళారు గోపికలు. జగన్నాటక సూత్రధారి తన కళ్ళు తెరిపించాడని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు నారదమునీంద్రులకు. యథా వ్రజ గోపికానాం అని – తన భక్తిసూత్రాల్లో 21 సూత్రంగా చేర్చాడు నారదుడే.

కృష్ణ భగవానుని లీలావిలాసాలలో యశోదకు తన విశ్వరూపాన్ని రెండుసార్లు చూపించాడు. ఆ చిన్ని కృష్ణుని తత్వం అందీ అందనట్లు వుంటుంది. ఆ నల్లనివానిలోని దివ్యమైన ఆకర్షణాశక్తి మహాద్భుతమైంది.

కౌరవసభకు రాయబారిగా వెళ్లినపుడు దుర్యోధనుడు తన ఇంటికి ఆతిథ్యానికి రమ్మన్నాడు. సున్నితంగా ఆ ఆహ్వానాన్ని తిరస్కరించి విదురుని ఇంటికి వెళ్లాడు కృష్ణుడు. దానికి క్రోధావేశానికి గురైనాడు సుయోధనుడు.

రేపు సభాభవనంలోనికి ఆ యాదవుడు వస్తున్నపుడు ఎవ్వరేగానీ లేవరాదు. అతనికి నమస్కరించరాదు – దుర్యోధనుని ఆదేశం అది. మహాద్వారం వైపు ఎవరూ చూడరాదు. నా వైపు చూస్తుండాలి. నేను చేసినట్లు మీరందరూ చేయాలి – రెండోసారి ఆజ్ఞాపించాడు.

**(ఇంకా ఉంది)**



# అమ్మకథలు

ధారావాహిని

- డి.శ్రీనివాస దీక్షితులు

## మహాష్టమి నాడు...

కోసల దేశం సుసంపన్నమైన దేశం. అక్కడ సుశీలుడు అనే ఒక వైశ్యుడు నివసిస్తున్నాడు. పేరుకు తగ్గట్టే అతను సద్గుణ సంపన్నుడు. సత్యసంధుడు. ఎంత కష్టం కలిగినా అబద్ధం చెప్పేవాడు కాదు సుశీలుడు. అతను శాంతంగా ఉండేవాడు. తనకి ఉన్నదాంట్లోనే దానధర్మాలు చేయటం అతని స్వభావం.

మాయలు, మర్మాలు, మోసాలు తెలియని సుశీలుడు పెళ్ళి చేసుకున్నాడు. ఆమె పేరు కమల. భర్తకి తగిన ఇల్లాలే కమల. ఆ దంపతులకి ఇద్దరు కుమార్తెలు, నలుగురు మగపిల్లలు. అందరికంటె కుమార్తె పెద్దది.

అతనికి ఆస్తిపాస్తులు లేవు. రకరకాల వ్యాపారాలు చేశాడు. ఏదీ కలిసి రాలేదు. రోజు గడవడమే కష్టంగా మారింది. మహాదేవిని రోజూ భక్తితో పూజిస్తూ, ధైర్యంగా దారిద్ర్యంతో పోరాడుతూ కాలక్షేపం చేస్తున్నాడు సుశీలుడు.

ఆకలి బాధకు పిల్లలు ఏడుస్తున్నారు. వాళ్ళని ఓదార్చలేక సతమతమవుతోంది కమల.

"ఈ పిల్లల ఆకలిని తీర్చేదెలా? ఏ పని చేసినా కలిసి రావటం లేదు. ఈయనకి మాయలూ మర్మాలూ తెలియవు. వ్యాపారం చేసేవాళ్ళకి కొంతైనా మోసం తెలియాలి" అని తన భర్తని గురించి అనుకుంటూ బాధపడుతోంది కమల.

భర్త దగ్గరికి వెళ్ళింది కమల.

"నాథా! దారిద్ర్యాన్ని భరించటం కష్టంగా ఉంది. పిల్లలు ఆకలిబాధని తట్టుకోలేకపోతున్నారు. ఏం చేద్దాం" అని ఏడ్చింది కమల.

సుశీలుడు భార్యని ఓదార్చాడు. బాగా ఆలోచించాడు. ఉపాయం తోచింది.

మర్నాడు దగ్గరలో ఉన్న అడవికి వెళ్ళాడు. సాయంత్రం వరకూ అక్కడే తిరుగుతూ చెట్లకి కాసిన కాయలూ, పళ్ళూ కోసుకొచ్చాడు సుశీలుడు. ఆ కాయలూ పళ్ళూ తింటూ అతని కుటుంబమంతా కొంతకాలం గడిపింది. కానీ అలా ఎంతోకాలం గడవలేదు.

సుశీలుడు అడవికి వెళ్ళటానికి ముందే వేరేవాళ్ళు వచ్చి ఆ కాయలు, పళ్ళు కోసుకుపోతున్నారు. ఆవిధంగా ఆ ఆహారం దూరమైంది. మళ్ళీ వేట ఆరంభం.

ఆ కుటుంబం మంచినీళ్ళు తాగి కొన్నాళ్ళు గడిపింది. పొరుగూరికి వెళ్ళి బిచ్చమెత్తుకుని వచ్చి దాంతో కొంతకాలంపాటు గడిపాడు సుశీలుడు.

"నాథా! మీరు పొరుగూరిలో ఏం వ్యాపారం చేస్తున్నారు?" అని అడిగింది కమల.

"వ్యాపారం గురించి తెలుసుకోవటం నీకు అవసరమా?" అన్నాడు సుశీలుడు.

"కడుపు నిండటం ముఖ్యం కాదు. అది ఎలా నిండుతోందో తెలుసుకోవడం ముఖ్యం" అంది కమల.

"కమలా! నేను అబద్ధమాడను. అధర్మ మార్గాన్ని అనుసరించను. ఇది నా నియమం" అన్నాడు సుశీలుడు.

"మీ మీద నాకు నమ్మకం ఉంది" అంది కమల.

భిక్షాటనం చేస్తూ సుశీలుడు ధర్మబద్ధంగా గడుపుతున్నాడు. కాలం గడుస్తోంది.

ఆరోజు పొరుగూరికి వెళ్ళినప్పుడు అక్కడ జాతర జరుగుతోంది. కోలాహలంగా ఉంది. అంతా అమ్మదయ అనుకుంటూ ఉత్సాహంగా జాతరలో బాగా బిచ్చమెత్తుకున్నాడు.

బియ్యం, పప్పులు, కూరలు, సంభారాలు సుశీలుడికి బాగా లభించాయి.

జాతర జరిగిన వారం రోజులూ సుశీలుడు ఆ గ్రామానికి వెళ్ళి బిచ్చమెత్తుకున్నాడు.

చాలాకాలం తరువాత సుశీలుడి కుటుంబం తృప్తిగా భోజనం చేసింది. కమల ఆనందించింది. కానీ ఆమెకి భర్తమీద అపారమైన నమ్మకమున్నా అనుమానం కూడా కలిగింది. అయినా ఆమె బిడ్డల ఆకలి తీరుతోంది కదా అని సర్ది చెప్పుకుంది.

మానవ జీవితం చాలా చిత్రంగా సాగుతుంది. విధి విలాసం తోడైతే అది మరింత విచిత్రంగా సాగుతుంది. విధి చేతిలో ఆ జీవితం కీలుబొమ్మగా మారుతుంది. రకరకాల విన్యాసాల్ని ప్రదర్శిస్తుంది.

పొరుగు గ్రామంలో భిక్షాటన చేస్తున్న సమయంలో కుర్ర బిచ్చగాడు సుశీలుడికి పరిచయమయ్యాడు. మిట్టమధ్యాహ్నమవుతోంది. ఒక చెట్టు కింద ఆగారు.

"నాయనా! నీ పేరు?" అడిగాడు సుశీలుడు.

"పశుపతి" అన్నాడు కుర్రబిచ్చగాడు.

"ఏ ఊరు మీది?" అడిగాడు సుశీలుడు.

"బిచ్చగాడికి ఊరేముంటుంది?"

"అలాగా!".... కాసేపు మౌనం.

''అయితే అమ్మా... నాన్నా...''

''ఎవ్వరూ లేరు''

''అయితే మాతో కలిసి వుంటావా?'' అడిగాడు సుశీలుడు.

''అలాగే'' అన్నాడు పశుపతి.

''మాది పక్కనున్న ఊరే... కోసల రాజధానికి పొలిమేరలో ఉంది. అదిగో దూరంగా కనిపిస్తోందే అదే మా ఊరు'' అన్నాడు సుశీలుడు.

''మా నాన్న వ్యాపారం చేసేవాడట. మశూచితో అందరూ చనిపోయారట. నేను ఒక్కడినే బతికాను. దూరపు బంధువు నన్ను కొన్నాళ్ళు సాకి వదిలేశాడు'' అని చెప్పాడు పశుపతి. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

కుర్రాడు బాగున్నాడు.. వినయం ఉంది. కష్టపడతాడు. బంధువులెవరూ లేరు. అల్లుడిగా చేసుకోవచ్చు అనుకున్నాడు సుశీలుడు.

ఇద్దరూ ఇంటికి చేరారు. ''ఇదే మా ఇల్లు పశుపతీ. మా తాత కట్టించాడు. నేను వ్యాపారాలు చేశాను. కలిసిరాలేదు. భిక్షాటనం చేస్తూ ఇలా బతుకుతున్నాను. ఆనందంగానే ఉంది అన్నాడు సుశీలుడు.

కమల వేగంగా వంట చేసింది. అందరూ తృప్తిగా భోజనం చేశారు. పశుపతి గురించి కమలకి చెప్పాడు సుశీలుడు. అతనిని అల్లుడిగా చేసుకునేందుకు అంగీకరించింది కమల. కూతురు కూడా సరే అంది. భిక్షాటనం చేస్తున్నామని కూడా అన్నాడు సుశీలుడు.

అంతా అమ్మ కరుణా కటాక్షం అనుకున్నాడు సుశీలుడు. సుమూహర్తంలో పశుపతికి తన కూతురునిచ్చి పెళ్ళి చేశాడు సుశీలుడు. కాలం గడుస్తోంది. కూతురికి కుమారుడు కలిగాడు. మూడేళ్ళు నిండాయి. వాడికి కోపం ఎక్కువ. ఒకరోజు వాడు అడిగింది ఇవ్వలేదని వెర్రి కోపంతో ఎక్కడికో పారిపోయాడు. వెదికారు కానీ కనిపించలేదు. ఆ దిగులుతో క్రుంగిపోయాడు సుశీలుడు.

పశుపతి మామగారిని ఓదార్చాడు. మళ్ళీ జీవనయానం సాగుతోంది.

అంతలో వర్షాలు కురవక కరువొచ్చింది. కోసలదేశం ఆకలితో అలమటించిపోయింది.

కొడుకులకి పెళ్ళి కాలేదు. సుశీలుడి కుటుంబ పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. భిక్ష వేసేవాళ్ళే లేకుండా పోయారు. కొడుకులూ, అల్లుడు, సుశీలుడూ అందరూ కలిసి భిక్షాటనం చేసినా వాళ్ళ కడుపులు నిండటం లేదు. ఉమాపతిని కలవమని పోరు పెట్టింది కమల. చిన్న కూతురికి పెళ్ళి చేస్తే కన్యాదాన ఫలం దక్కుతుందని అందరూ అంటున్నారు. అదొక దిగులు. సుశీలుడు కష్టాల కడలిలో మునిగిపోతున్నాడు.

ఈ బాధల్ని భరించలేక, ఆలోచిస్తూ, విచారిస్తూ, దుఃఖిస్తూ ఉమాపతి దగ్గరికి వెళ్ళాడు సుశీలుడు. ఉమాపతి ఆ ఊరిలో మంచీ చెడూ చెప్పగలిగిన పండితుడు. మహాదేవి ఉపాసకుడు. ఆయనకి తన గోడు చెప్పుకున్నాడు సుశీలుడు.

''మహాత్మా! నాకు పెద్ద పెద్ద ఆశలు లేవు. అపార ధనమూ వద్దు. బంగారం రత్నాలూ అసలే వద్దు. మరే కోరికలూ కోరను. నా కుటుంబానికి దారిద్ర్య బాధ పోయేందుకు ఏదైనా ఉపాయం చెప్పండి. మంత్రమో తంత్రమో జపమో తపమో ఏదైనా ఉపదేశించి నన్ను కాపాడండి'' అని సుశీలుడు ప్రార్థించాడు. ఉమాపతికి సాష్టాంగ దండ ప్రణామం ఆచరించాడు. ఉమాపతికి జాలి కలిగింది.

''నాయనా! దేవీ నవరాత్రి వ్రతం చెయ్యి. నీ కష్టాలన్నీ తొలగిపోతాయి. నీ దారిద్ర్యం కూడా నశిస్తుంది'' అని చెప్పాడు ఉమాపతి. ''అయ్యా! మీరే నాకు గురువు. అంబికా దివ్య మంత్రాన్ని నాకు ఉపదేశించండి. శ్రద్ధగా భక్తితో దేవీనవరాత్ర వ్రతాన్ని నేను ఆచరిస్తాను'' అన్నాడు సుశీలుడు.

ఉమాపతి మాయా బీజాక్షర దివ్యమంత్రాన్ని సుశీలుడికి ఉపదేశించాడు. సుశీలుడు క్రమం తప్పకుండా దివ్యమంత్రాన్ని జపిస్తూ యథాశక్తి దానధర్మాలు చేస్తూ ఎనిమిది సంవత్సరాలు వ్రతాన్ని ఆచరించాడు. తొమ్మిదో సంవత్సరంలోకి అడుగు పెట్టాడు. నిష్ఠగా నవరాత్రి వ్రతాన్ని ఆచరిస్తున్నాడు. ఓపికగా ఆశగా భవిష్యత్తుని తలచుకుంటూ ముందుకి సాగుతున్నాడు.

మహాష్టమి నాటి అర్ధరాత్రి సమయం. సుశీలుడు నిద్రలో ఉన్నాడు. అది నిద్ర కాదు. మగత నిద్ర. అమ్మవారిని తలచుకుంటూనే ఉన్నాడు. దివ్యమంత్రాన్ని ఉచ్చరిస్తున్నాడు. స్వప్నం... కల... దివ్యకాంతులు... జగజ్జనని కనిపించింది. సుశీలుడు దేవిని అనేక విధాలుగా స్తుతించాడు.

''నాయనా! సుశీలుడా! నీ భక్తి శ్రద్ధలకి మెచ్చాను. ఏం కావాలో కోరుకో'' అంది జగన్మాత.

''తల్లీ! నా కుటుంబాన్ని ఈ దారిద్ర్య బాధ నుండి కాపాడు. సత్యాన్ని పలుకుతూ ధర్మమార్గంలో నడిచేటట్లు నన్ను అనుగ్రహించు తల్లీ. వేరే కోరికలు ఏవీ లేవు. నీ కరుణా కటాక్షం ఎల్లవేళలా మా కుటుంబం మీద ప్రసరించాలి'' అని ప్రార్థించాడు సుశీలుడు.

అతడు కోరినట్టే అమ్మ అనుగ్రహించింది. సుశీలుడు తన కుటుంబంతో సుఖంగా, సంతోషంగా జీవిస్తున్నాడు. దేవీనవరాత్రులన్నీ జీవితాంతం నిర్వహించాలని సంకల్పించాడు. పిల్లలందరికీ పెళ్ళిళ్ళు చేశాడు. మనవళ్ళు, మనవరాళ్ళు, కోడళ్ళు హాయిగా ఉన్నారు.

**నమో దేవ్యై జగద్ధాత్రై శివాయై సతతం నమః ।**
**దుర్గాయై భగవత్యై తే కామదాయై నమో నమః ॥**

లోకాలకి తల్లి, శివునికి అర్ధాంగి అయిన దేవికి నమస్కారం. కోరిన కోర్కెలన్నీ తీర్చే దుర్గాదేవికి ఎల్లవేళలా నా నమస్సులు.



# అంబరీషుడు

– పి.ఎల్.ఎన్.మూర్తి

వైవస్వతమనువు కుమారులలో నభగుడొకడు. అతని కుమారుడు నాభాగుడు. నాభాగుడు బ్రహ్మజ్ఞాని. నైష్ఠికుడు. గొప్ప విద్వాంసుడు. నాభాగుని పుత్రుడే అంబరీషుడు. అంబరీషుడు భక్తాగ్రేసరులలో ఒకడు. అతని చరిత్రము జగత్ప్రసిద్ధమైనది.

భూమండలమంతటికీ అంబరీషుడు ప్రభువు. అయినను తుచ్ఛము, అనిత్యము అయిన రాజ్యభోగాలను ఆశించలేదు. ఐహిక లౌకిక భోగభాగ్యాలను తృణప్రాయముగా ఎంచి, నిరంతరం హరినామస్మరణము చేయుచుండెడివాడు. శ్రీహరిని అర్చించుట, హరికథలు వినుట, హరిభక్తులను సేవించుట అంబరీషుని దినచర్య. విష్ణుప్రీతికరమైన వ్రతములు, దానధర్మములు లెక్కకు మించి యొనర్చెను. ప్రతి కార్యము స్వార్థము లేక భగవదర్పణముగా చేసెడివాడు.

అంబరీషునకు ఏకాదశవ్రతము అత్యంత ప్రీతికరమైనది. ఏకాదశినాడు ఉపవసించి, హరిని భక్తిప్రపత్తుల పూజించడం, ద్వాదశినాడు విష్ణుప్రీతిగా పారణ చేసి, హరిభక్తులకు, బ్రాహ్మణోత్తములకు అన్నదానము ఘనముగ చేయడం అంబరీషునకు ఎంతో ఇష్టమైనది. అంబరీషుని భార్య మహాపతివ్రత. హరిభక్తులను భర్తవలెనే భక్తిశ్రద్ధలతో ఆరాధించెడిది. విష్ణుదేవుని అర్చించెడిది.

అంబరీషుని భక్తికి శ్రీమహావిష్ణువు మెచ్చెను. ఆత్మరక్షణార్థము, శత్రుశిక్షణ నిమిత్తము శ్రీమహావిష్ణువు తన సుదర్శన చక్రమును అంబరీషున కొసగెను. విష్ణువు నుండి సుదర్శన చక్రమును పొందిన భక్తుడు వేరొకడు లేడు. అటులే అంతటి అఖండ రాజ్యసంపదను కలిగిన చక్రవర్తియును లేడు.

ఒకానొక సమయమున అంబరీషుడు పత్నీసమేతుడై ఏకాదశీ వ్రతము చేయబూనెను. ఒక సంవత్సర కాలము మహానిష్ఠతో వ్రతమును ఆచరించెను. వ్రతము ముగియు కాలమున, కార్తీకమాసమునందు త్రిరాత్రోపవాసము చేసెను. మరునాడు తెల్లవారకముందుగనే కాళిందీనదిలో స్నానము చేసి, నిత్యాకర్మానుష్ఠానములు ముగించెను. అటుపిమ్మట మధువనమునకు వెళ్ళి విష్ణుదేవుని భక్తితో పూజించెను. బ్రాహ్మణ శ్రేష్ఠులకు గోదాన, భూదాన, హిరణ్య దాన, వస్త్ర దానములు, భూరి దక్షిణలిచ్చి సంతుష్టి పరచెను. మహావైభవముగా అన్నసంతర్పణము చేసి పారణకు పూనుకొనెను.

అపుడా సమయమున దుర్వాస మహర్షి అతిథిగా అంబరీషుని వద్దకేతెంచెను. దుర్వాసుడు మహాకోపిష్ఠి. ఎంతటి చిన్న లోపము గాని, పొరపాటు గాని, తప్పు గాని సహించడు. కఠోరముగా శపించును. అంబరీషుడు మునిని ఉచితరీతిని పూజించి, ఆతిథ్యము స్వీకరించుమని వేడుకొనెను. మునియు అంగీకరించెను. స్నానాది నిత్యకృత్యములు ముగించుకొను నిమిత్తము యమునా నదికేగెను. స్నానమాడి మాధ్యాహ్నికములు ముగించుకొని, ధ్యాన నిష్ఠలో నిమగ్నుడయ్యెను. ఎంతకూ ముని రాడయ్యెను. అకాల మగుచుండెను.

ముని రాకకు జాగగుచుండెను. అంబరీషునకు ఆందోళనము అధికమయ్యెను. పెద్ద సంకట స్థితిలో చిక్కినాడు. ముని రాకపోవుట, ద్వాదశి ఘడియలు మించనుండుట అంబరీషునకు ఏమి చేయుటకు తోచినది కాదు. ద్వాదశి ఘడియలు దాటుటకు పూర్వము పారణము చేయకున్నచో ప్రతిఫలము దక్కదు. చేసిన క్రతువంతయు వ్యర్థమగును. పోనీ పారణము చేయుదమన్న అతిథిని వదలి పారణము చేయరాదు. పరమభక్తుడగు అంబరీషునకు ధర్మసంకటము ప్రాప్తించినది. పెద్ద అగ్నిపరీక్ష అయినది. అటుల దీర్ఘకాలము యోచించి తుదకు కొందరు పెద్దలు, పండితుల సూచన ననుసరించి జలపారణము చేసి, ముని రాకకు నిరీక్షించసాగెను.


తరువాత దుర్వాసముని వచ్చి తను రాకుండగనే అంబరీషుడు జలప్రాసనము చేసినట్లు దివ్యదృష్టి వలన తెలుసుకొనెను. తనను అవమానపరచెనని, కోపమున మండిపడెను. అందులకు 'తగిన ఫలితము అనుభవింతువు గాక' అని పలుకుచు ఆగ్రహమున తలనుండి జడనొకదానిని నూడపెరికి అంబరీషునిపై

ప్రయోగించెను. అదియు కాలాగ్ని జ్వాలలతో మండుచు మహావేగమున అంబరీషుని మీదకు దూసుకొని వచ్చెను. అపుడా సమయమున అంబరీషుడు అన్యచింతన లేమియు లేనివాడై శ్రీహరిని ధ్యానించుచుండెను. భక్తుని రక్షణార్థము విష్ణువు అనుగ్రహించిన చక్రాయుధము వెనువెంటనే బయలుదేరి, దుర్వాసుడు ప్రయోగించిన మహాగ్నిజ్వాలలను నిర్మూలించెను. అంతటితో ఆగక చక్రాయుధము మునిని పరిమార్చుటకు అతని వెంటపడెను. దుర్వాసునకు అపుడేమి చేయవలెనో తోచక, ప్రాణములు కాపాడుకొనుటకు దిక్కులబడి పరుగులు తీసెను. ముల్లోకములు చుట్టి వచ్చెను. దిక్పాలురను వేడుకొనెను. వారు దానిని నివారింప శక్తి లేదని పలికిరి. బ్రహ్మ, మహేశ్వరులను దర్శించెను. విష్ణుతేజము నెదుర్కొనుట తమవల్ల కాదని పలికిరి. తుదకు వైకుంఠమునకేగి శ్రీమహావిష్ణువును శరణు జొచ్చెను.

అంతట శ్రీహరి "ఓ మహర్షీ! నేను భక్త పరాధీనుడను. నాకంటే నా భక్తులు అధిక శక్తిసంపన్నులు. నీవు బుద్ధిపూర్వకముగా నా భక్తునకు అపకారము కలుగజేసితివి. కావున నిన్ను కాపాడగలిగినవాడు నా భక్తుడే కాని, నేను కాదు. వెంటనే అంబరీషుని చెంతకేగి, ఆ భక్తుని శరణు వేడుకొనుము. ఆ భాగవతోత్తముడే నిన్ను రక్షించగలడు" అని మునికి హితవు పలికెను. అపుడు వేగమే దుర్వాసుడు అంబరీషుని కడకేతెంచి తనను రక్షింపుమని వేడుకొనెను. అపరాధమును మన్నించుమని ప్రార్థించెను. కరుణాంతరంగుడు, శాంతచిత్తుడు, పరమభక్తుడు అయిన అంబరీషుడు, దుర్వాసమహర్షిని రక్షింపవలసిందిగా సుదర్శనాయుధమును వేభంగుల స్తుతించెను. అపుడా చక్రాయుధము శాంతించి దుర్వాసుని విడిచివైచెను. అంతట దుర్వాసుడు మిగుల సంతసించెను. అంబరీషుని భక్తి శ్రద్ధలకు, మహిమకు మిగుల ఆనందించి కీర్తించెను. అయినను అంబరీషుడు ఎంతమాత్రము గర్వించలేదు. మహర్షిని గౌరవించి, యథావిధిగా పూజించి, భోజనమిడి సంతృప్తుని గావించెను.

చక్రాయుధము దుర్వాసుని వెంబడించడం, ఆయుధము లోకములు సంచరించు మున్నగు కృత్యములకు ఒక సంవత్సర కాలము పట్టెను. అంతకాలము అంబరీషుడు భుజించలేదు. కేవలము జలములు మాత్రము గ్రోలి వ్రతదీక్షను రక్షించెను. అటుతరువాత దుర్వాస మునీంద్రునకు భోజనమిడి, అటుమీదట తాను భుజించెను.

అటుల పరమభక్తాగ్రేసరుడైన అంబరీషుడు శ్రీహరి పవిత్ర పాదాబ్జంబులను అనవరతము సేవించుచు, ధర్మయుతముగ రాజ్యపాలనము గావించెను. తుదకు తన కుమారునకు రాజ్యభారము అప్పగించి తపమాచరించుటకు వనభూముల కేగెను. అనంతరము అంబరీషుడు వైకుంఠమును చేరెను. విష్ణుభక్తి మహిమను వర్ణించెడి అంబరీషుని చరిత్రము చదివినను, వినినను శుభప్రదము. మోక్షదాయకము.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 62 వ కళ్యాణం

తేది 30-12-2023 శనివారం ఉదయం జరిగింది. దీనిని శ్రీమాన్ కోవ్వూరి విశ్వేశ మేఘమాల దంపతులు నిర్వహించారు. ఇది నీలాద్రి నిలయం అపార్టుమెంట్ వద్ద, సాయిబాబా నగర్ కాలనీ, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ లో వైఖానసాగమోక్తంగా జరిగింది.

## 63 వ కళ్యాణం

తేది తేది 11-02-2024 ఆదివారం నాడు ఉదయం 10.30 నుండి జరిగింది. దీనిని శ్రీమాన్ టి.వి.ఎన్.హరీష్, స్వప్న దంపతులు నిర్వహించారు. ఇది కొండాపూర్ లోని అపర్ణ టవర్స్ లో గల క్లబ్ హౌస్ లో వైఖానసాగమోక్తంగా, అత్యంత వైభవంగా జరిగింది.

## 64 వ కళ్యాణం

తేది 24-02-2024 శనివారం నాడు ఉదయం 10.30 నుండి జరిగింది. ఇది అభయాంజనేయ స్వామివారి దేవస్థానము, హెచ్ 106, మధురానగర్, హైదరాబాద్ – 38 లో జరిగింది. దీనిని దేవస్థానపు వ్యవస్థాపక ధర్మకర్తలు శ్రీమాన్ టి.ఎన్.రావు గారు మరియు ఇతరులు వైఖానసాగమోక్తంగా నిర్వహించారు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఈ నెల సంతృప్తికరంగా ఉంటుంది. తల్లిదండ్రుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అకస్మిక ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఇంట్లో శాంతి కొరకు అఖండ దీపారాధన చేయండి. విందు వినోదములతో ఆనందము. దోషాలు పోవడానికి ఇష్టదైవారాధన చేయుట వలన మనశ్శాంతి కలుగుతుంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మిక ఆదాయం సమకూరేందుకు ఇదే కరెక్ట్ టైమ్. ఒర్పుతో పట్టుదల కలిగి ఉండి ముందుకు సాగండి. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. నిర్లక్ష్యం అస్సలు పనికిరాదు. అదృష్టంలో కూడా కొన్ని దోషాలు కలిగి ఉన్నాయి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ, పురుషులకు అనుకూలంగా ఉంటుంది. అనవసర ఖర్చులు, ఆర్భాటాలు తగ్గించుకోండి. అకస్మిక ధన ఆదాయం ఉన్నది. పనులు చేసే విషయంలో వెనక్కి తగ్గకండి. ధైర్యంగా ముందుకెళ్లండి. లక్ష్మీనారాయణుడికి అలంకారం చేయించండి. పెండింగ్ పనులు పూర్తవుతాయి. ఓం నమో భగవతేవాసుదేవాయ నామం జపించండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఆర్థిక విషయాల్లో జాగ్రత్తలు పాటించండి. కొన్ని విషయాల్లో చాలా ఉత్సాహంగా ఉంటుంది. తాత్కాలిక ఆనందం పొందండి. జాగ్రత్తల విషయంలో రాజీ పడొద్దు. ఆయుర్వేదం సేవించి ఆరోగ్యంగా ఉండండి. నవ గ్రహ ప్రదక్షిణలు చేయండి.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు చాలా వ్యతిరేకత కలిగి ఉన్నారు. గ్రహ కలయిక సరిగా లేదు. తెలియకుండా ఏదో ఒక చికాకు బాధిస్తుంది. కుటుంబంలో సమస్యలు తగాదాలు ఉండగలవు. విద్యార్థుల పట్ల పూర్తి జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే వాళ్లు విజయం సాధిస్తారు. నవగ్రహ ఆరాధన చేసి, దానాలు చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులు కొంతవరకు మనశ్శాంతిగా ఉంటారు. ఉత్సాహంగా కనిపిస్తారు. కార్యసాధనంలో కొంత వరకు శాంతి ఉంటుంది. లౌకిక భావం వల్ల ఇతరులను ఆకర్షించగలరు. ఎక్కడా ఉద్రేకమునకు అవకాశం ఇవ్వొద్దు. నవగ్రహాలు ప్రత్యేకంగా కుజ ధ్యానంతో ఆర్థిక పరిస్థితులు చక్కబడతాయి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. అలాగని నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. మీరు ముందస్తు ప్లానింగ్‌తో ఉంటారు. కార్యసాధనలో ఉత్సాహంగానే ఉండగలరు. మీరేం అమాయకులు కాదు. కానీ, కాల మహిమ కదా.. కాలానుగుణంగా కొనసాగండి. ఇష్ట దేవతలకు పూజలు తప్పనిసరిగా చేయాలి. ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉంది.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని విషయాల్లో నిర్లక్ష్యం తగదు. నాలుకను అదుపులో పెట్టుకోవాలి. తక్కువగా, మెల్లిగా మాట్లాడండి. లేక నోటిలో నీరు పెట్టుకొనగలరు. గ్రహ సంచారంలో ఉన్న ఇబ్బందుల వలన మన పరిస్థితులు కూడా అమావాస్య, పౌర్ణమిలాగా వచ్చి పోతూ ఉంటాయి. గ్రహ ఆరాధనతో గృహంలో శాంతి ఉంటుంది.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలత ఉంటుంది. కార్యసాధన దిశగా ముందుకు సాగండి. అన్నింట దైవబలంతో మీరు తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా ముందుకు సాగుతాయి. పట్టుదలతో, ఉత్సాహంతో రాజీపడకుండా ముందుకు సాగండి. మధ్యలో ఆగిపోయిన పనులు నెరవేర్చుకొనుటకు అనుకూలంగా ఉంటుంది.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయం ఆలస్యంగా జరుగును. అన్ని విషయాల్లో ఇప్పటిదాక అనుకూలంగా ఉంటుంది కానీ, ఇప్పుడు అలా ఉండదు. ప్రతి పని చాలా స్లోగా కంప్లీట్ అవుతూ ఉంటుంది. అమ్మగారికి అనారోగ్య సమస్యలు ఉన్నవి. ఆయుర్వేద మందులు ఈ సమస్యకు మంచి పరిష్కారం చూపుతాయి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మిక ధన లాభం ఉంది. పాత బాకీలు తీరుతాయి. వివాహ ప్రయత్నాలు ఫలించును. పెద్దల మన్ననలు, సంఘంలో కీర్తి ప్రతిష్టలు, అధ్యాత్మిక విషయాల్లో ఆసక్తి కలిగి ఉంటారు. మనశ్శాంతి ఉంటుంది. సంతోషంగా ముందుకు సాగండి. శ్రీహరి అలంకరణ, చక్రపొంగలి ప్రసాదము చేసి దేవునికి నైవేద్యంగా పెట్టాలి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు కార్య దీక్షతో ముందుకు సాగాలి. గ్రహ కలయిక లేదు. శని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. శనికి తైలాభిషేకం నువ్వులు, నలుపు గొంగళి దానం చేయండి. రాహు కేతువులకు మినుములు, ఉలవలు దానం ఇవ్వడం వలన ప్రశాంతత కలిగి ఉండగలరు. చాలా జాగ్రత్తగా గమనించి ముందుకు సాగండి. ఆటుపోట్లు ఉన్నవి. ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా చూసుకోవాలి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**



శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. ఆదిశేషుని కొడుకు ఎవరు?
2. ఆంజనేయునికి నవ వ్యాకరణాలు బోధించింది ఎవరు?
3. రంతిదేవునికి వరమిచ్చిందెవరు?
4. అతిథి ఆకలి తీర్చడానికి ప్రాణత్యాగం చేసింది ఎవరు?
5. కుర్కురము – అంటే ఏమిటి?
6. విశ్వాసం కలిగి ఉండవలసిన కుక్క కృతఘ్నతగా ఎవరికి ద్రోహం తలపెట్టింది?
7. సరస్వతీదేవి ఎప్పుడు ఆవిర్భవించింది?
8. సూర్యస్తుతితో సాగిన శతకమేది?
9. సుగ్రీవుని భార్య పేరు ?
10. వాలి భార్య తార ఎవరి కూతురు?
11. శ్రీకృష్ణ కర్ణామృతం వ్రాసిందెవరు?
12. కృష్ణార్జునులు ఎవరిని దర్శించారు?
13. త్రేతాయుగంలో శ్రేష్ఠమైన కార్యాలేవి?
14. శయన ఆంజనేయుని పాదాల వద్ద శనిదేవుడు ఏ రూపంలో ఉన్నాడు?
15. శశికళ జపించిన మంత్రమేది?

1. ______________
2. ______________
3. ______________
4. ______________
5. ______________
6. ______________
7. ______________
8. ______________
9. ______________
10. ______________
11. ______________
12. ______________
13. ______________
14. ______________
15. ______________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. చక్కని వాక్కులను ఇచ్చునది, 2. కాలడి నుండి హిమాచలం వరకు, 3. విరూపాక్షుడు, 4. కాత్యాయనీ వ్రతం, 5. మేధా తిథి, 6. దేవేంద్రునికి, 7. పక్షిజాతి – కొంగ, 8. భోగినాడు, 9. ముక్కనుమ నాడు, 10. జ్ఞానదేవుడు, 11. చెక్కతో చేసినది (దారుమూర్తి) 12. శ్రీమహావిష్ణువు, 13. లక్ష్మీదేవి కోసం, 14. మాధవుడు, 15. మాఘ శుద్ధ సప్తమి నాడు

**సరైన సమాధానాలు ఎవరూ రాయలేదు**

పేరు: ______________

చిరునామా: ______________

______________

______________

______________

పిన్‌కోడ్: ______________

ఫోన్: ______________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

–





Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122




**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు **https://www.srivenkatesham.org** లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq